ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 07.10.2026 | సంపుటి : 13 సంచిక : 78 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# జ్ఞానేశ్‌కుమార్ దిగిపో..

## ‘సర్’ను రద్దు చేయండి.. ఢిల్లీలో మహానిరసన.. ఉద్రిక్తత



ఆకాశ్ వాణి భవన్ కాంప్లెక్స్ లోపల నిరసన తెలుపుతున్న రాహుల్ గాంధీని అరెస్టు చేసి బలంతంగా తరలిస్తున్న పోలీసులు

- రాహుల్, ప్రియాంక,కేసీ వేణుగోపాల్‌లతో సహా ఎంపీల అరెస్టు
- మోదీ, షా, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారు
- వారు చేసింది దేశద్రోహమే: రాహుల్
- లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో మాట్లాడటానికి ఈసీకి అభ్యంతరం ఏంటని ప్రశ్న
- విపక్షాల ‘సేవ్ డెమొక్రసీ’ పాదయాత్ర
- రోడ్డుపై బైఠాయించి ఎంపీల ఆందోళన

పాదయాత్రగా వెళ్తున్న కాంగ్రెస్ అగ్రనేతలను బారికేడ్లు పెట్టి అడ్డుకుంటున్న పోలీసులు




మోదీ, అమిత్ షా, మోహన్ భాగవత్, సీఈసీ జ్ఞానేశ్? కుమార్ దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేశారు. ఈ విషయం దేశంమొత్తానికి తెలుసు. కానీ మేం రాజ్యాంగాన్ని కాపాడాలని ప్రయత్నిస్తున్నాం. కొద్దిసేపటి క్రితం దాదాపు 300 మంది లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఇతర కమిషనర్లను కలవడానికి నిర్వచన్ సదన్(ఎన్నికల ప్రధాన కార్యాలయం) వైపు వెళ్లాం. అయితే, ఈసీ కార్యాలయానికి కేవలం 50 గజాల దూరంలో పోలీసులు మమ్మల్ని అడ్డుకున్నారు. నాకు అర్థం కాని విషయం ఏంటంటే, కోట్లాది మంది ప్రజలు ఓట్లేసి గెలిపించిన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలతో మాట్లాడటానికి ఈసీకి ఉన్న అభ్యంతరం ఏంటి? ఎన్నికల కమిషనర్లు మమ్మల్ని ఎందుకు కలవడం లేదు? పోలీసులు మమ్మల్ని ఎందుకు అడ్డుకుంటున్నారు? ప్రజల గొంతుకగా వచ్చిన ఎంపీలను కలవడానికే సీఈసీ నిరాకరిస్తే దేశంలో ప్రజాస్వామ్య పరిస్థితి ఏంటి?" - కాంగ్రెస్ అగ్రనేత రాహుల్



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రధాని మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేశారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ నలుగురూ కలిసి దేశానికి వ్యతిరేకంగా ‘ఓటు చోరీ’ కుట్రకు పాల్పడ్డారని, ఇది ముమ్మాటికీ ‘దేశద్రోహం’ అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో వీరిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం తథ్యమని హెచ్చరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీరుకు నిరసనగా మంగళవారం ఇండీ కూటమి ఆధ్వర్యంలో విపక్ష ఎంపీలు కదం తొక్కారు. పార్లమెంట్ భవనం నుంచి ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దాదాపు 300 మంది ర్యాలీగా వెళ్లారు. అయితే

మిగతా 2లో..

## రాహుల్ పోరాటానికి వణికిపోతున్న కేంద్ర ప్రభుత్వం

2 లో..

సర్ రద్దు... సీఈసీ జ్ఞానేష్ రాజీనామా చేసే వరకు విశ్రమించం: సీఎం రేవంత్

రాహుల్, ప్రియాంక, కేసీ, ఎంపీల అరెస్టులను ఖండించిన ముఖ్యమంత్రి

## ‘ఒకే దేశం.. ఒకే ఎన్నిక’ నినాదం వెనుక కుట్ర: సీజేపీ

12 లో..

## వైమానిక దళం కొత్త చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత వైమానిక దళం నూతన చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ నియమితులయ్యారు. ప్రస్తుత ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. అదే రోజు మధ్యాహ్నం అశుతోష్ ‘చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్’ బాధ్యతలు స్వీకరించి.. 2028 డిసెంబర్ 31వరకు

మిగతా 2లో..



## రక్షణ రహస్యాలు పాక్‌కు..



## చేరవేస్తున్న ఇంటి దొంగలు




- అన్నం సాయిప్రసాద్, ప్రదీప్ ముఖర్జీల అరెస్టు
- ఆంధ్రప్రదేశ్‌లో బయటపడిన భారీ కుట్ర

**అమరావతి(జనంసాక్షి):** ఏపీలో గూఢచర్యం వ్యవహారం కలకలం రేపుతోంది. ఆపరేషన్ ఫైర్‌వాల్‌తో భారీ కుట్ర బయటపడింది. పాకిస్థాన్‌కు రక్షణ రహస్యాలు చేరవేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ కుట్రను ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ ఛేదించింది. ‘ఆపరేషన్ ఫైర్‌వాల్–2026’ పేరిట ఏపీ సీఐ సెల్ సంచలన ఆపరేషన్ చేపట్టింది. 13 మంది నావికాదళ సిబ్బంది సహా 18 మంది వ్యక్తులపై నిఘా ఉంచింది. అత్యంత గోప్యంగా వ్యూహాన్ని అమలు చేసింది. ఈనెల 1న 12 ప్రత్యేక బృందాలతో మెరుపుదాడి చేసింది. 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో విస్తృతంగా సోదాలు చేసి అన్నం సాయిప్రసాద్, ప్రదీప్ ముఖర్జీలను అరెస్ట్ చేసింది. విచారణలో పాక్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లతో నేవీ సిబ్బంది రహస్య సంబంధాలు బహిర్గతమయ్యాయి. విశాఖపట్నం కేంద్రంగా గూఢచర్యం కొనసాగినట్లు ఏపీ సీఐ సెల్ గుర్తించిం ది. సమాచారాన్ని ఎన్‌క్రిప్టెడ్ సాఫ్ట్‌వేర్ ద్వారా శత్రు దేశానికి ఈ నెట్‌వర్క్ చేరవేస్తున్నట్లు కనిపెట్టింది. దీనిపై విజయవాడలోని కౌంటర్ ఇంటెలిజెన్స్ పీఎస్‌లో 3 కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బీఎన్ఎస్ సెక్షన్లు 61(2), 147, 148 రెడ్‌విత్ 3 (5)తో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చ ట్టం 1967 లోని సెక్షన్లు 17, 18 కింద కేసు నమో దు చేశారు. అధికారిక రహస్యాల చట్టం 1923 సెక్షన్ కింద కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**దక్షిణాది రాష్ట్రాల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో భారీ ఆపరేషన్.. 100 మంది అరెస్ట్**

2 లో..

## ఎర్రవల్లిలో మిగతా 45 ఎకరాలు ఎక్కడ ఉందో తేల్చండి



- అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఎర్రవల్లి, వెంకటాపురం భూములపై ముఖ్యమంత్రి సమీక్ష
- జూన్ 2లోగా అమరవీరుల కాలనీ నిర్మాణం పూర్తి చేయాలి

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎర్రవల్లి, వెంకటాపురం భూములపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. 2 గ్రామాల్లో సర్వే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎర్రవల్లి సర్వే నెంబర్ 325లో రికార్డుల ప్రకారం 388 ఎకరాల భూమి ఉండగా క్షేత్రస్థాయిలో సర్వేలో మాత్రం 343 ఎకరాలు మాత్రమే ఉందని అధికారులు తెలిపారు. మిగతా 45 ఎకరాలు ఎక్కడుందో తేల్చాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూమి గుర్తింపు కోసం ఎర్రవల్లి, వెంకటాపురంలో సర్వే నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. రెవెన్యూ రికార్డులు సమర్పించాలని మాజీ సీఎం కేసీఆర్ కుటుంబానికి అధికారులు నోటీసులు ఇవ్వనున్నారు. సర్వే నెం.325లో తెలంగాణ అమరవీరుల కాలనీ నిర్మించాలని, అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. కాలనీ నిర్మాణ బాధ్యతలను హౌసింగ్ బోర్డుకు అప్పగించాలని సూచించారు. జూన్ 2లోగా అమరవీరుల కాలనీ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులకు సీఎం ఆదేశించారు.

## నేటితో ‘సర్’ సమాప్తం

ముగియనున్న అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియలో మరో దశ రేపటితో ముగియనుంది. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల దరఖాస్తులకు బుధవారమే చివరి రోజు. ఆగస్టు 17న ముసాయిదా జాబితా ప్రకటించిన ఎన్నికల కమిషన్.. అదే

మిగతా 2లో..

## ఇందిరమ్మ ఇళ్లతో పేదవాళ్లు ధనవంతులవుతారు

పేదల స్థితిగతులను మార్చాలనే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2 లో..

## ఆకలిని అంతమొందిస్తాం

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే తొలిసారి 27 లక్షల మందికి ఏకకాలంలో అల్పాహారం



- విద్యార్థుల పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి
- రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్
- బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదు.. మళ్లీ వచ్చేది ఎందుకో చెప్పాలి
- సంక్షేమం ఉచితం కాదు.. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి పెట్టుబడి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**మునగాల (జనంసాక్షి):** రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడివేడి అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో మరెక్కడా లేదని, తెలంగాణలోనే ఈ వినూత్న పథకాన్ని అమలు చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం ఉచితం కాదని, అది రాష్ట్ర భవిష్యత్తు మానవ వన రులపై చేస్తున్న పెట్టుబడని పేర్కొన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండి బాగా చదువుకుంటేనే భవిష్యత్తులో రాష్ట్ర ఉత్పత్తికి పెద్ద ఎత్తున తోడ్పడతారని, తద్వారా జీఎస్‌డీపీ వృద్ధికి దోహదం చేస్తారని చెప్పారు. సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని ము నగాల గ్రామంలో పాఠశాలల విద్యార్థుల కోసం రూ. 9.6 కోట్లతో నిర్మించనున్న సెంట్రలైజ్డ్

మిగతా 2లో..

## ‘భూత కణాల’ ఆవిష్కరణకు నోబెల్

శాస్త్రవేత్తకు ఫిజిక్స్‌లో బెల్జియన్-అమెరికన్ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు అత్యున్నత పురస్కారం



**నార్వే(జనంసాక్షి):**భౌతికశాస్త్రంలో ఈ ఏడాది నోబెల్ పురస్కారం బెల్జియన్- అమెరికన్ శాస్త్రవేత్త ఫ్రాన్సిస్ హాల్జెన్‌కు లభించింది. ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీకి అందించిన సేవలు, ఖగోళ మూలం కలిగిన అత్యధిక శక్తిమంతమైన న్యూట్రినో (ఆస్ట్రోఫిజికల్ న్యూట్రినోలు)ల ఆవిష్కరణకు గానూ స్టాక్‌హోంలోని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రకటించింది.న్యూట్రినోలను భూత కణాలు (ఘోస్ట్ పార్టికల్స్)గా భావిస్తుంటారు. ఇవి మన చుట్టే తిరుగుతుంటాయి. వీటిని గుర్తించడం దాదాపు అసాధ్యం. ఎందుకంటే ఈ రేణువులకు ద్రవ్యరాశి గానీ విద్యుదావేశం గానీ ఉండవు. ఇతర రేణువులతో ఢీకొట్టటమూ అంతంతే. ఈ కణాలను గుర్తించేందుకు దక్షిణ ధ్రువం వద్ద ఉన్న మంచును ఉపయోగించవచ్చని ఫ్రాన్సిస్ హాల్జెన్ కనుగొన్నారు. మంచు, కాంతి సెన్సార్లతో కూడిన ఐస్‌క్యూబ్ న్యూట్రినో అబ్జర్వేటరీ స్థాపనలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఇదిలా ఉండగా.. బుధవారం రసాయనశాస్త్రం, గురువారం సాహిత్యంలో విశేష కృషి చేసిన వారి పేర్లను వెల్లడించనున్నారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి, అక్టోబర్ 12న అర్థశాస్త్రంలో

మిగతా 2లో..



## ఒమన్ తీరంలో వాణిజ్య నౌకపై దాడి

11 మంది భారతీయ సిబ్బందికి గాయాలు

**టెహ్రాన్(జనంసాక్షి):**ఒమన్ తీరంలో హర్మూజ్ జలసంధిలో పనామా జెండాతో వెళ్తున్న ఓ వాణిజ్య నౌకపై క్షిపణి దాడి జరిగింది. ఈ ఘటనలో 11 మంది భారతీయులు గాయపడినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. నౌకలో మొత్తం 19 మంది సిబ్బంది ఉండగా.. 17 మంది భారతీయులేనని వెల్లడించింది. గాయపడిన వారికి ఒమన్ అధికారుల సాయంతో వైద్య చికిత్స అందిస్తున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఒమన్ అధికారులకు భారత్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. “హర్మూజ్ జలసంధిలో నౌకలపై వరుసగా జరుగుతున్న దాడులు తీవ్ర ఆందోళన

మిగతా 2లో..

## ఒలింపిక్స్ 2036 ఆతిథ్య రేసులో భారత్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఒలింపిక్ గేమ్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలనే కలల దిశగా భారత్ మరో కీలక అడుగు వేసింది. తాజాగా 2036 ఎడిషన్‌కు సంబంధించి భారత్, ఖతార్ రేసులో ఉన్నాయని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ధ్రువీకరించింది. ఈ రెండు దేశాలు కాకుండా.. మరో ఐదు కూడా రేసులో ఉన్నాయని ఐఓసీ వెల్లడించింది. వందకుపైగా సభ్యులు కలిగిన అసోసియేషన్ 2029లో

మిగతా 2లో..



## ‘ఒకే దేశం.. ఒకే ఎన్నిక’ నినాదం వెనుక కుట్ర: సీజేపీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**సీఈసీ పదవి నుంచి జ్ఞానేశ్‌కుమార్ వైదొలగకపోతే ఈనెల 10న ఢిల్లీలో శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని కాక్రోచ్ జనతా పార్టీ ఇప్పటికే హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం నిర్వహించనున్న ఆందోళనల్లో పాల్గొనవద్దని మహారాష్ట్ర పోలీసులు తమ పార్టీ కార్యకర్తలపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించారు. నోటీసులు జారీ చేస్తూ.. బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేస్తోన్న ‘ఒకే దేశం.. ఒకే ఎన్నిక’ నినాదం వెనుక అసలు ఉద్దేశం వేరే ఉందన్నారు. ‘ఒకే దేశం..ఒకే రాజకీయ పార్టీ’ని తీసుకురావడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ‘ఇన్నాళ్లు మహారాష్ట్ర పోలీసులు దేశంలోనే అత్యుత్తమమని.. ఢిల్లీ పోలీసులు వారి నుంచి నేర్చుకోవాలని నేను అనేకసార్లు చెప్పాను. కానీ, జంతర్ మంతర్ వద్ద జరిగే ఆందోళనలో పాల్గొనవద్దని చెబుతూ చంద్రపూర్ పోలీసులు మా పార్టీ కార్యకర్తలకు నోటీసులు జారీ చేయడం బాధాకరం. ప్రయాణ ఖర్చులపై కూడా ప్రశ్నలు అడగడం ఆశ్చర్యం కలిగించింది. ఆందోళన ప్రారంభించకముందే అది హింసాత్మకంగా మారుతుందని పోలీసులు ఎలా అంచనా వేయగలరు? సోషల్ మీడియాలో హింసాత్మక పోస్టులు పెట్టొద్దని ఆదేశించారు. మేము మహాత్మాగాంధీ, అంబేద్కర్ విధానాల గురించే మాట్లాడతాం. అవి హింసాత్మకమని మీరు భావిస్తున్నారా?’ అని దీప్కే ప్రశ్నించారు. ఇదీ చదవండి: జ్ఞానేశ్ రాజీనామా డిమాండ్లతో దద్దరిల్లిన ఢిల్లీ.. బారికేడ్లు ఎక్కిన రాహుల్

## ఒలింపిక్స్ 2036 ఆతిథ్య రేసులో భారత్..

ఓటింగ్ ద్వారా ఆతిథ్య దేశాన్ని ఎంపిక చేయనుంది. భారత్, ఖతార్ ఫేవరెట్‌గా ఉన్నట్లు ఐఓసీ వర్గాలు పేర్కొన్నాయి. కేవలం 2036 ఎడిషన్‌ను మాత్రమే కాకుండా.. 2040, 2044 ఒలింపిక్స్ ఆతిథ్యం ఎంపిక కోసం దక్షిణాఫ్రికా, దక్షిణ కొరియా, జర్మనీ, హంగరీ, తుర్కియే చర్చలు జరుపుతున్నట్లు ఐఓసీ తెలిపింది. “ఒలింపిక్స్ ఎక్కడ జరిగినా.. ఒక్క విషయం మాత్రం ఎప్పటికీ మారదు. మారకూడదు. ఎలాంటి ఏర్పాట్లు చేసినా అథ్లెట్లే కేంద్రంగా ఉండాలి” అని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అధ్యక్షురాలు కిర్స్టీ కోవెంట్రీ వెల్లడించారు. 2036 ఆతిథ్య హక్కుల కోసం బిడ్డింగ్ వేయడానికి అక్టోబర్ 31 వరకు గడువు ఉంది. ఈ క్రమంలో బిడ్డర్లను మార్గదర్శనం చేయడానికి 30 పేజీల డాక్యుమెంట్‌ను ప్రచురించింది. 2028లో లాస్ ఏంజెలెస్ (అమెరికా), 2032లో బ్రిస్బేన్ (ఆస్ట్రేలియా) వేదికగా ఒలింపిక్స్ జరగనున్నాయి.

**ఎవరెవరు?**

అహ్మదాబాద్ వేదికగా ఒలింపిక్ గేమ్స్‌ను నిర్వహించాలని భారత్ ఏర్పాట్లు చేస్తోంది. 2030లో కామన్వెల్త్ గేమ్స్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియం కూడా అక్కడే ఉంది. ఒలింపిక్స్ 2036 కోసం ఖతార్ పోటీ పడుతోంది. భారత్‌కు కాస్త గట్టిపోటీనిచ్చేది ఖతారే. 2022 ఫిఫా ప్రపంచ కప్‌ను నిర్వహించిన అనుభవంతోపాటు పెద్ద క్రీడల ఈవెంట్లకు ఆతిథ్యం ఇచ్చింది. సియోల్ వేదికగా దక్షిణ కొరియా కూడా ఒలింపిక్స్ నిర్వహణకు సిద్ధమవుతోంది. 1988లోనే కొరియా మెగా ఈవెంట్‌కు హోస్ట్‌గా వ్యవహరించింది. 1972లో జర్మనీ ఒలింపిక్స్‌ను నిర్వహించింది. మళ్లీ ఆతిథ్య హక్కుల కోసం సిద్ధమవుతోంది. మ్యూనిచ్ వేదికగా క్రీడల నిర్వహించాలని చూస్తోంది.ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చిన తొలి ఆఫ్రికా దేశంగా నిలవాలనేది దక్షిణాఫ్రికా ఆశయం. అందుకోసం బరిలోకి దిగింది. 2036లో రాకపోయినా.. ఆ తర్వాత ఎడిషన్ల కోసమూ పోటీ పడనుంది. హంగరీ, తుర్కియే రాజధానులు బుడాపెస్ట్, ఇస్తాంబుల్ కూడా ఒలింపిక్స్ హోస్ట్ కోసం బరిలోకి దిగాయి.

## నేటితో ‘సర్’ సమాప్తం

రోజు నుంచి అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరిస్తోంది. ఎన్యుమరేషన్ ప్రక్రియ ముగిసిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 73.39లక్షల ఓట్లు పోయాయి. వాటిపై ఇవాళ్టి వరకు రాష్ట్రవ్యాప్తంగా 7,56,180 అభ్యంతరాలు, క్లెయిమ్‌లు వచ్చినట్లు సీఈవో కార్యాలయం తెలిపింది. అందులో క్యూర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల నుంచే 4,64,685 ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువగా ఫామ్-6లే వచ్చాయి. కొత్తగా ఓటు కోసం 4,40, 942 మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఫామ్-7తో పాటు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు 7,56,180 రాగా.. పరిష్కరించనవి కేవలం 41, 776 మాత్రమే. మిగతా 7,14,401 దరఖాస్తులు ఇంకా విచారణ దశలోనే ఉన్నాయి. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిష్కారానికి నవంబరు 5 వరకు గడువు ఉంది. మరోవైపు నోటీసుల ప్రక్రియ కొనసాగుతోంది. నవంబరు 11 వరకు నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియ పూర్తి చేసి.. నవంబరు 9న తుది ఓటరు జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించనుంది.

## కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణ పనులు రద్దు

హైదరాబాద్(జనంసాక్షి): కేబీఆర్ పార్క్ చుట్టూ చేపట్టిన ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణ పనులను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో ఆ ప్రాజెక్టుకు సంబంధించి రీడిజైన్ చేస్తూ ఆ బాధ్యతలను మేఘా సంస్థకు అప్పగిస్తూ పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే టెండర్ విధానంలో చెల్లించిన డిపాజిట్లను తిరిగి చెల్లిస్తూ కేఎన్ఆర్ నిర్మాణ సంస్థకు జారీ చేసిన లెటర్ ఆఫ్ అవార్డును ఉపసంహరించుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రాజెక్టు రీడిజైనింగ్‌లో భాగంగా జూబ్లీహిల్స్ చెక్ పోస్టు నుంచి ముఫఖంజా కాలేజీ వరకు స్టీల్ బ్రిడ్జిని నిర్మించనున్నారు. ఆ వంతెనను బంజారాహిల్స్ రోడ్ నెం-1 కు అనుసంధానించేలా ర్యాంప్ ఏర్పాటు చేయనున్నారు. గతంలో అనుమతి ఇచ్చిన రూ.1,090 కోట్ల నిధులను కుదించారు. ప్యాకేజీ-1లో మంజూరైన ప్రాజెక్టు వ్యయం రూ.580 కోట్ల నుంచి రూ.365 కోట్లకు తగ్గించగా... ప్యాకేజి-2లో మంజూరైన ప్రాజెక్టు వ్యయాన్ని రూ.510 కోట్ల నుంచి రూ.349 కోట్లకు కుదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.‘కేబీఆర్ పార్కు చుట్టూ హెచ్-సిటీ పనులను రద్దు చేశాం. పార్కు చుట్టూ వన్‌వే విధానం శాశ్వతంగా అమలు చేస్తాం. దీనివల్ల భారీ మొత్తంలో ప్రజాధనం ఆదా అవుతుంది. నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు ఆరు లేన్లతో స్టీల్ బ్రిడ్జి నిర్మాణం చేపడతాం. వచ్చే ఏడాది నాటికి దాన్ని పూర్తిచేస్తాం. కేబీఆర్ పార్కు నుంచి అండర్‌పాస్ నిర్మిస్తాం’ అని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ వివరించారు. ఈపీసీ విధానంలో ఆధునిక స్టీల్ స్ట్రక్చర్ సాంకేతికతతో ప్రాజెక్టును రెండు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి ముగ్ధా జంక్షన్ వరకు తొలి ప్యాకేజీ పనులు చేపడతారు. ముగ్ధా జంక్షన్ నుంచి ముఫకంజా కళాశాల వరకు రెండో ప్యాకేజీ నిర్మిస్తారు. బంజారాహిల్స్ రోడ్ నం-1కు కనెక్టింగ్ ర్యాంపు ఏర్పాటు చేస్తారు.ఎలివేటెడ్ కారిడార్‌ను ఒకే సమగ్ర మార్గంగా రూపొందించడం వల్ల ఖరీదైన ప్రైవేటు భూముల సేకరణ అవసరం గణనీయంగా తగ్గనుంది. దీనివల్ల సుమారు రూ.800కోట్లు ఆదా అవుతుందని అధికారులు అంచనా వేశారు. గతంలో ప్రతిపాదించిన బహుళ అండర్‌పాస్‌లు, గ్రేడ్ సెపరేటర్ల నిర్మాణంతో పోలిస్తే మరో రూ.400 కోట్ల నిర్మాణ వ్యయం తగ్గనుంది. రూ.1,200 కోట్ల ప్రజాధనం ఆదా కానుంది.









# జ్ఞానేశ్ కుమార్ దిగిపో..

ఆకాశ్ వాణి భవన్, నీతి ఆయోగ్ కార్యాలయాల సమీపంలో భద్రతా సిబ్బంది రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇతర ఎంపీలను అడ్డుకోవడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఆకాశ్ వాణి భవన్ కాంప్లెక్స్ లోపల బైఠాయించిన విపక్ష నేతలు అక్కడి నుంచే తమ నిరసన తెలిపారు.

**సీఈసీ రాజీనామా చేయాల్సిందే!**

భారీ భద్రత నడుమ ప్రతిపక్ష ఎంపీలను ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారని సీపీఐ ఎంపీ పి సందోశ్ కుమార్ పేర్కొన్నారు. సీఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్, ఇతర బలగాలతో భద్రతా సిబ్బందిని భారీగా మోహరించి సీఈసీ ప్రధాన కార్యాలయం వైపు వెళ్లకుండా నిలువరించారని చెప్పారు. మరోవైపు, విపక్షాల పాదయాత్రను అడ్డుకున్న తర్వాత, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు అభిషేక్ బెనర్జీ, డెరెక్ ఓ బ్రియన్‌తో సహా పలువురు ప్రతిపక్ష నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే అరెస్టులు తమ సమస్యకు పరిష్కారం కాదని, సీఈసీ రాజీనామా చేయాల్సిందేనని విపక్ష నేతలు స్పష్టం చేశారు. అంతవరకు తమ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. కాగా, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియ సమయంలో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు, సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 14 సార్లు అభ్యంతరాలు లేవనెత్తారని వార్త కథనాలు వెలువడడంతో రాజకీయంగా తీవ్ర దుమారం తలెత్తింది. దీంతో ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. అలాగే, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం- 6లో చేసిన మార్పుపై కూడా ప్రతిపక్ష నాయకులు ప్రశ్నలు లేవనెత్తారు. మరోవైపు, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) కూడా ఈ అంశంపై




అభ్యంతరం వ్యక్తం చేసింది. సీఈసీ రాజీనామా చేసి, క్రిమినల్ చర్యలను ఎదుర్కోవాలని పేర్కొంది.

**పోలీసుల అదుపులో రాహుల్**

ఢిల్లీ ఆకాశవాణి భవన్ వద్ద కొనసాగుతున్న విపక్షాల నిరసన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నేపథ్యంలో రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా, అమరీందర్‌సింగ్‌తో పాటు ఇండీ కూటమి నేతలు, కార్యకర్తలను కూడా అదుపులోకి తీసుకున్నారు.

**విపక్షాల ‘సేవ్ డెమొక్రసీ’ పాదయాత్ర**

ఓటు చోరీ అంశం, సీఈసీ ఏకపక్ష నిర్ణయాలపై రగులుతున్న విపక్షాలు ఈసీ ముట్టడికి దిగాయి. సేవ్ డెమోక్రసీ పేరుతో పార్లమెంట్ నుంచి నిర్వచన్ సదన్ వరకు విపక్ష ఎంపీలు భారీ పాదయాత్ర చేపట్టారు. సర్ పేరుతో ఏకంగా 13 కోట్ల ఓట్లను గల్లంతు చేశారని ఆరోపిస్తున్న విపక్షాలు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.ర్యాలీలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ, జైరాం రమేశ్ సహా పలువురు విపక్ష నేతలు పాల్గొన్నారు. చేతుల్లో భారీ బ్యానర్లు పట్టుకుని నినాదాలు చేస్తూ దూసుకెళ్లారు. నీతి ఆయోగ్ ఆఫీస్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే బైఠాయించారు. కేంద్ర ప్రభుత్వానికి, జ్ఞానేశ్ కుమార్?కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహుల్ తదితరులు బారికేడ్లు ఎక్కిమరీ ముందుకు వెళ్లే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత రాహుల్?, ప్రియాంక సహా పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. బస్సులో తరలించారు.

విపక్ష ఎంపీల ర్యాలీ నేపథ్యంలో ఢిల్లీలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పార్లమెంట్ నుంచి నిర్వచన్ సదన్‌కు వెళ్లే మార్గాలన్నింటినీ పోలీసుల అధీనంలోకి తీసుకుని, బ్యారికేడ్లు పెట్టి ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఈసీ కార్యాలయం, మంత్రుల నివాసాల వద్ద పారామిలిటరీ, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ బలగాలను మోహరించారు. భద్రతా కారణాల దృష్ట్యా పలు ప్రాంతాల్లో ఇంటర్నెట్, మొబైల్ డేటా సేవలను సైతం నిలిపివేశారు.ఇక ఈ నెల 10వ తేదీ నుంచి 20 వరకూ దేశవ్యాప్తంగా శాంతియుత ర్యాలీలను కాంగ్రెస్ పార్టీ నిర్వహించనుంది. ఈ నెల 25 నుంచి నవంబరు 25వ తేదీ వరకూ ఓటు బచావో దేశ్ బచావో సీఈవో హటావో పేరుతో రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ర్యాలీలను పార్టీ నిర్వహించనుంది. గ్రామ స్థాయిలో రచ్చబండలను జరపనుంది. ఈ సమయంలో కార్యకర్తలు ఓట్లు కోల్పోయిన వారిని కలుస్తారు. ఓటర్ల జాబితాలో వారి పేర్లను చేర్పించేందుకు చర్యలు చేపడతారు. నవంబరు 1వ తేదీన ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరగనుంది. సీఈసీ కార్యాలయం వద్ద మంగళవారం విపక్ష ఇండియా కూటమి నిర్వహించే నిరసనకు తాము హాజరు కాబోమని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటించింది.

## రాహుల్ పోరాటానికి వణికిపోతున్న కేంద్ర ప్రభుత్వం

హైదరాబాద్ (జనంసాక్షి): ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటంతో కేంద్ర ప్రభుత్వం వణికిపోతోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. అస్తవ్యస్తంగా మారిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐ-సర్) రద్దు, సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు కాంగ్రెస్ పార్టీ విశ్రమించబోదని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టులా మారిన × సర్× రద్దు కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ఓటు బచావో... దేశ్ బచావో(ఓటును రక్షిద్దాం.. దేశాన్ని రక్షిద్దాం) ఉద్యమంలో భాగంగా అహింసాయుతంగా ఆందోళన చేస్తున్న విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు కేసీ వేణుగోపాల్, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్, ఇండియా కూటమి ఎంపీలను ఢిల్లీలో అరెస్టు చేయడాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య, చట్ట విరుద్ధమైన ఈ అరెస్టులు బీజేపీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శమని సీఎం పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనూ స్వల్ప కారణాలకే మహాత్మా గాంధీ, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, సర్దార్ పటేల్ వంటి నేతలను నాటి వలస ప్రభుత్వం అరెస్టు చేసేదని, ఇప్పుడు బ్రిటిష్ జనతా పార్టీ (బీజేపీ) కూడా అలానే రాహుల్ గాంధీని అరెస్టు చేసిందని సీఎం విమర్శించారు. అక్రమ అరెస్టులు, జైళ్లు కాంగ్రెస్ నేతలకు కొత్త కాదని సీఎం అన్నారు. ప్రతి ఒక్కరి ఓటు హక్కును, దేశ ప్రజాస్వామిక వ్యవస్థను, దేశ భవిష్యత్తును రక్షించుకునేందుకు ప్రజలు, యువత రాహుల్ పోరాటంలో స్వచ్ఛందంగా భాగస్వాములవుతున్నారనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని సీఎం హెచ్చరించారు. అక్రమ అరెస్టులు, జైళ్లు, లాఠీఛార్జీలు కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న ఉద్యమాన్ని అణిచివేయలేవని, తమ పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తాయని సీఎం తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం వందేళ్లకు పైగా పోరాడిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందనే విషయం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గుర్తుంచుకోవాలని సీఎం పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో తుది వరకు పోరాడతామని, ఈ పోరాటంలో విజయం సాధించే వరకు వెనకడుగు వేసే ప్రసక్తే లేదని సీఎం స్పష్టం చేశారు.



## ఒమన్ తీరంలో వాణిజ్య నౌకపై దాడి..

కలిగిస్తున్నాయి. ఈ దాడులను తక్షణమే నిలిపివేయాలి. వాణిజ్య నౌకలు, నావికులు, పౌర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడం ఇప్పటికైనా ఆపాలి. అంతర్జాతీయ జలమార్గాల్లో నౌకాయానం, వాణిజ్య కార్యకలాపాలకు స్వేచ్ఛగా అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది” అని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. మరో రెండు నౌకలపై డ్రోన్ల దాడి.. నాటో ‘జోన్’లో తొలిసారి హర్మూజ్ జలసంధిలో ఇటీవల వాణిజ్య నౌకలపై వరుస దాడులు జరుగుతున్నాయి. అక్టోబరు 3న కువైట్ జెండాతో వెళ్తోన్న ఎంటీ కాజిమా అనే చమురు ట్యాంకర్‌పై క్షిపణి దాడి జరగగా.. అందులోని ఐదుగురు భారతీయులను ఒమన్ అధికారులు రక్షించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. సెప్టెంబరులో హర్మూజ్ ప్రాంతంలో ఓ నౌకపై జరిగిన దాడిలోనూ ఒక భారతీయ నావికుడు మృతి చెందాడు.

## ‘భూత కణాల’ ఆవిష్కరణకు నోబెల్

నోబెల్‌పై ప్రకటన రానుంది. నోబెల్ ప్రైజ్ మనీ విలువ 12 లక్షల డాలర్లు (రూ.11.5 కోట్లు). 1901 నుంచి స్వీడన్ శాస్త్రవేత్తల్ఫ్రెడ్ నోబెల్ జ్ఞాపకార్థం వీటిని ప్రదానం చేస్తున్న సంగతి తెలిసిందే.

## వైమానిక దళం కొత్త చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్

ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు.1966 డిసెంబర్‌లో జన్మించిన ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్.. 1986 డిసెంబర్‌లో వాయుసేనలో చేరారు. నాలుగు దశాబ్దాల కాలంలో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్‌గా ఉన్నారు. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ సిందూర్ వంటి అనేక కీలక ఆపరేషన్‌లలో పనిచేశారు. మిరాజ్-2000, మిగ్, జాగ్వార్, తేజస్ వంటి వివిధ యుద్ధ విమానాల్లో 3,500 గంటలకు పైగా విమానయాన అనుభవం ఉంది.

## దక్షిణాది రాష్ట్రాల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో భారీ ఆపరేషన్..

హైదరాబాద్(జనంసాక్షి):దక్షిణాది రాష్ట్రాల్లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో భారీ ఆపరేషన్ చేపట్టింది. రెండు వారాల పాటు ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళంలో సోదాలు నిర్వ హించి.. సైబర్ నేరగాళ్లకు మ్యూల్ ఖాతాలు, కేవైసీ పత్రాలు సమకూరుస్తున్న 100 మందికిపైగా ఏజెంట్లను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి మ్యూల్ ఖాతాల డెబిట్ కార్డులు, పాసు పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా పలు సైబర్ నేరాలతో నిందితులకు సంబంధం ఉన్నట్టు గుర్తించారు. హైదరాబాద్‌లో ఓ డాక్టర్‌ను మోసం చేసిన కేసులో రూ.11 కోట్ల నగదు పలు మ్యూల్ ఖాతాలకు బదిలీ అయినట్టు దర్యాప్తులో తేలింది. వీరిని ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. దుబాయ్, ఇతర దేశాల సైబర్ నేరగాళ్లతో వీరికి సంబంధాలున్నట్లు తెలుస్తోంది.

# ఆకలిని అంతమొందిస్తాం



కమ్యూనిటీ కిచెన్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపా రుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడారు. 1,020 పాఠశాలల్లో చదువుతున్న దాదాపు 60 వేల మంది విద్యార్థులకు ఒకే కిచెన్ నుంచి పరిశుభ్రమైన, అ త్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేడివేడి అల్పా హారం అందించేందుకు మునగాలలో ఈ గ్రీన్‌ఫీల్డ్ కిచెన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు వారానికి ఆరు రోజులపాటు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ అందిస్తున్నామని చెప్పారు. ఇంటి వద్ద వంద మందికి వంట చేయడం కూడా కష్టమైన పరిస్థితుల్లో 27 లక్షల మంది విద్యార్థులకు ఏకకాలంలో అల్పాహారం అందించే కార్యక్రమం ప్రపంచంలో ఎక్కడా లేదని, ఇది తెలంగాణ ప్రభుత్వ మానవీయ దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తని అన్నారు. ఎదిగే వయసులో పిల్లలకు అవసరమైన పౌష్టికాహారం అందిస్తేనే వారు ఆరోగ్యవంతమైన మానవ వనరుగా ఎదుగుతారని చెప్పారు. అందుకే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు చిన్ననాటి నుంచే నాణ్యమైన ఆహారం అందిస్తూ, వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని వివరించారు.

**సంక్షేమం ఉచితం కాదు.. పెట్టుబడే..**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఉచితాలుగా చూడొద్దని భట్టి విక్రమార్క అన్నారు. పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులపై చేస్తున్న ఖర్చు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు తిరిగి ప్రయోజనం చేకూర్చే పెట్టుబడిగా అభివర్ణించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండటం, పిల్లలు చదువుకోవడం, మహిళలు ఆర్థికంగా ఎదగడం, రైతులకు పెట్టుబడి సాయం అందడం ద్వారా రాష్ట్ర ఉత్పాదకత పెరుగుతుందని చెప్పారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, వడ్డీలేని రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు వంటి కార్యక్రమాలన్నింటి అంతిమ లక్ష్యం పేద కుటుంబాలు ఆర్థికంగా ఎదగడమేనని అన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితే ఆర్థిక కార్యకలాపాలు పెరిగి రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు.

**బీఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్తు లేదు:**బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తామని చేస్తున్న ప్రకటనలపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో స్పందించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు అవసరమైన సంక్షేమ కార్యక్రమాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు మళ్లీ వస్తామని చెబుతున్నారని, అసలు ఏం చేయడానికి వస్తున్నారో ప్రజలకు చెప్పాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లను ఆపడానికి వస్తారా? సన్నబియ్యం పంపిణీ నిలిపివేయడానికి వస్తారా? 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఆపడానికి వస్తారా? మహిళల వడ్డీలేని రుణాలు నిలిపివేయడానికి వస్తారా? పేద విద్యార్థులకు అందుతున్న ఆర్థిక సాయాన్ని ఆపడానికి వస్తారా? అని భట్టి ప్రశ్నించారు. ప్రజలు అమాయకులు కాదని, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గమనిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్‌కు గతమే తప్ప భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు.

**రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్**

ప్రతి నియోజకవర్గంలో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన విద్యార్థులంతా ఒకే పాఠశాలలో ఒకే కుటుంబంలా చదువుకునేలా ఈ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లిష్ మీడియం విద్యతో పాటు క్రీడలు, స్టేడియం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని వివరించారు.

కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంత ప్రజలే తమ కుటుంబమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతున్నారని, ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకులు లభించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని భట్టి అన్నారు. ప్రజాప్రతినిధులు అధికారాన్ని ప్రదర్శించడానికి కాకుండా ప్రజలు అప్పగించిన బాధ్యతను నెరవేర్చడానికి పనిచేయాలని, ఆ కోవాలోనే ఉత్తం దంపతులు ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని అభివర్ణించారు. మునగాల హెలిప్యాడ్ నుంచి సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ శంకుస్థాపన ప్రాంతం వరకు కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు సుమారు 500 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు.

## ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేయాలనుకున్న ఇజ్రాయెల్..!

**టెల్‌అవీవ్:**ఫ్లైదుబాయ్ విమానం కాక్‌పిట్‌లో పైలట్‌పై దాడి ఘటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పుడీ ఘటనలో మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. నిర్దేశిత మార్గం దాటి ప్రయాణించిన ఆ విమానాన్ని ఇజ్రాయెల్ కూల్చివేయాలనుకుందట. అందుకోసం యుద్ధ విమానాలను సిద్ధం చేసిందని అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది.దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ బయల్దేరిన విమానం కాక్‌పిట్‌లో దాడి అనంతరం 30 సెకన్లలో 34 వేల అడుగుల ఎత్తు నుంచి 16వేల అడుగుల మేర కిందకు దూసుకొచ్చింది. అప్పటికే ఆ విమానం నుంచి ఎమర్జెన్సీ కోడ్ ప్రసారం అయింది. ఈ పరిణామాలతో ఇజ్రాయెల్‌లో కలవరం మొదలైంది. విమానాన్ని హైజాక్ చేశారా..? లేక తమ దేశంపై దాడి జరగనుందా..? అని భయపడింది. ఇజ్రాయెల్ వైమానికదళం ఫ్లైదుబాయ్ విమానంతో కాంటాక్ట్ కోసం ప్రయత్నించగా.. కాక్‌పిట్ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. దీంతో అత్యవసర యంత్రాంగాన్ని యాక్టివేట్ చేసింది. ఒక కమాండ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి, యుద్ధ విమానాలను రంగంలోకి దింపింది. తన గగనతలాన్ని మూసివేసింది. అయితే కొద్దిసేపటి తర్వాత యుద్ధ విమానాలను వెనక్కి రప్పించింది. అప్పటికే ఆ విమానం సౌదీ అరేబియా వైపు అత్యవసర ల్యాండింగ్‌కు దారి మళ్లడమే అందుకు కారణం. మరోవైపు సౌదీ కూడా యుద్ధ విమానాలను మోహరించిందని ఆ కథనం పేర్కొంది.ఒకవేళ ఆ విమానం టెల్‌అవీవ్ (ఇజ్రాయెల్ నగరం) వైపు ప్రయాణం కొనసాగించి ఉంటే.. యుద్ధవిమానాల పైలట్లు దానికి సమీపంగా వెళ్లి, కాక్‌పిట్‌లో ఎలాంటి పరిస్థితి ఉందో తెలుసుకునేందుకు సిద్ధమయ్యారని వెల్లడించింది. అది హైజాక్ అయిందని నిర్ధరణ అయి ఉంటే.. ఆ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని, రక్షణమంత్రి దృష్టికి తీసుకెళ్లేవారని పేర్కొంది. దేశానికి ముప్పు పొంచి ఉన్న అలాంటి సమయంలో విమానాన్ని కూల్చివేయాలని ఆదేశించే అధికారం ప్రధానికి ఉండేదని తెలిపింది. కోపైలట్ ప్లాన్ ప్రకారం.. టెల్‌అవీవ్‌లోని ఎత్తైన భవనాలు, బెన్ గురియన్ ఎయిర్‌పోర్ట్ లక్ష్యమని ఇప్పటికే ఇజ్రాయెల్ దర్యాప్తు వర్గాలు వెల్లడించిన సంగతి తెలిసిందే.గాజాలో ఇజ్రాయెల్ చర్యలకు ప్రతీకారంతోనే కోపైలట్ ఇలా చేశాడని ప్రాథమికంగా దర్యాప్తు అధికారులు గుర్తించారు. అతడు టెల్‌అవీవ్‌లో విమానాన్ని కూల్చే ప్లాన్ విఫలమైతే.. ఇంకో ప్లాన్ కూడా సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. జోర్డాన్‌లోని యూఎస్ సైనికస్థావరం అతడి టార్గెట్ జాబితాలో ఉన్నట్లు సమాచారం. ఒమన్ జాతీయుడైన కోపైలట్ ఈ ఏడాది ప్రారంభంలో కూడా టెల్‌అవీవ్‌కు వెళ్లిన విమానంలో విధులు నిర్వర్తించాడని, అప్పుడు విమానాన్ని హైజాక్ చేసి కూల్చివేయాలని భావించాడని దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. అయితే విమానంలో తెలిసిన వ్యక్తి ఉండటంతో తర్వాత ఆ ప్లాన్‌ను విరమించుకున్నట్లు సమాచారం. అసలు ఆ దాడి ప్రణాళికలన్నీ ఫ్లైదుబాయ్ సంస్థలో చేరకముందే వేసుకున్నట్లు కోపైలట్ దర్యాప్తు అధికారులకు చెప్పడం గమనార్హం.

# సారస్ మేళాకు సర్వం సిద్ధం

- పట్టణంలో పది రోజుల పాటు పల్లె ఉత్పత్తుల పండుగ
- 20 రాష్ట్రాల నుంచి 200 పైగా స్టాళ్లు
- దేశీ కళలు, రుచులు, చేనేతల సందడి
- 11న బతుకమ్మ వేడుకలు, హాజరు కానున్న మంత్రి సీతక్క



హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ నగర వాసులకు గ్రామీణ భారతీయ కళలు, చేనేతలు, సంప్రదాయ రుచులు, మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ఒకే వేదికపై ఆస్వాదించే అవకాశం రానుంది. అక్టోబర్ 7 నుంచి 18వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఐమాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో సారస్ మేళా జరగనుంది. తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సెర్ప్ ఈ మేళాను నిర్వహిస్తోంది. 20 రాష్ట్రాలకు చెందిన గ్రామీణ మహిళలు, కళాకారులు, స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ వేదికగా సారస్ నిలవనుంది. ఈసారి సారస్ మేళాలో మొత్తం 200 కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో తెలంగాణకు చెందినవే 95 కాగా, ఇతర రాష్ట్రాలకు చెందినవి 100 కు పైగా ఉన్నాయి. ఇవే కాకుండా....వివిధ ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో 43 స్టాళ్లు ఏర్పాటు కానున్నాయి. హస్తకళలు, చేనేతలు, ఆహార ఉత్పత్తులు, హెర్బల్ ఉత్పత్తులు, ప్రొడక్షన్ ఐటమ్స్, లైవ్ ఫుడ్ విభాగాల్లో ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నాయి.

# ఉపాధ్యాయుల చేతుల్లోనే దేశ భవిష్యత్

- టి-సాట్, సాఫ్ట్ నెట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి




హైదరాబాద్ (జనంసాక్షి) : తరగతి గదుల్లో విద్యను బోధించే ఉపాధ్యాయుల చేతుల్లోనే భారతదేశ బంగారు భవిష్యత్ ఆధారపడి ఉందని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. హైదరాబాద్ టి-సాట్ కార్యాలయంలో పీఎం ఈ-విద్య ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ కు ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల్ రెడ్డి ఉపాధ్యాయులనుద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులకు నాణ్యమైన కంటెంట్ అందించడం వల్లే నాణ్యమైన విద్యను నేర్చుకోగలుగుతారని తద్వారా మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నాణ్యమైన డిజిటల్ కంటెంట్ అందించడమే కాకుండా ఆ కంటెంట్ చూసే విధంగా విద్యార్థులను ప్రోత్సహించే బాధ్యత ఉపాధ్యాయులదేనని గుర్తుచేశారు. తెలంగాణ ప్రభుత్వం ప్రసారం చేస్తున్న టి-సాట్ ఛానళ్లను ఆదరించినట్టుగానే కేంద్ర ప్రభుత్వం పీఎం ఈ-విద్య ద్వార ప్రసారం చేస్తున్న ఐదు ఛానళ్లను ఆదరించాలని సీఈవో కోరారు. డిజిటల్ కంటెంట్ పైనే దేశ భవిష్యత్ అని గుర్తుచేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విద్యపై ప్రత్యేక శ్రద్ధతో అధిక నిధులు కేటాయించడమే కాకుండా డిజిటల్ విద్యను ప్రత్యేకంగా ప్రోత్సహిస్తున్నారని వేణుగోపాల్ రెడ్డి గుర్తుచేశారు.

పీఎం ఈ-విద్య డిజిటల్ ఛానళ్ల ఢిల్లీ ఇన్‌ఛార్జ్ ప్రొఫెసర్ అభయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విద్యార్థులకు ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత విద్య కోసం కేంద్ర ప్రభుత్వం ఐదు డిజిటల్ ఛానళ్లను కేటాయించిందని, వాటి ద్వార ప్రసారం చేసే డిజిటల్ కంటెంట్ ను విద్యార్థులు ఉపయోగించుకునే విధంగా ఉపాధ్యాయులు చొరవ చూపాలని కోరారు. సాట్ కాం డైరెక్టర్ (గుజరాత్) రాజేష్ పటేల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రసారం చేస్తున్న 200 ఛానళ్లలో ఐదు తెలంగాణా రాష్ట్రానికి కేటాయించిందని గుర్తుచేశారు. ఐదు ఛానళ్ల ప్రసారానికి సంబంధించిన వివరాలను ఉపాధ్యాయులకు తెలియజేసారు. పీఎం ఈ-విద్య ఛానళ్ల హెచ్వోడీ పుర్వి చాజెద్, ప్రొఫ్యాసర్ బినితారాయ్, అకడమిక్ కన్సల్టెంట్స్ కోమల్ అరోరా, వైశాలి, రుచి ఎల్ ఖత్రీ, టి-సాట్ ఎగ్జుక్యూటీవ్ డైరెక్టర్ ఎండీ సాధిక్, జీఎం లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం...

డిజిటల్ కంటెంట్ తయారు చేయడంలో తెలంగాణలోని సుమారు 100 మంది ఉపాధ్యాయులకు నాలుగు రోజుల పాటు పీఎం ఈ-విద్య ఆధ్వర్యంలో టి-సాట్ కార్యాలయ కేంద్రంగా జరిగే శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు మంగళవారం వీడియో ప్రొడక్షన్-హార్డ్వేర్, రెండవ రోజు కాపీ రైట్ అండ్ ఎథికల్ యూజ్ ఆఫ్ ఏఐ, మూడవ రోజు రికార్డింగ్ ఆఫ్ డెవెలప్డ్ స్క్రిప్ట్ చివరి రోజైన నాల్గవ రోజు వీడియో ప్రజంటేషన్ అండ్ ఎవాల్యూయేషన్ పై శిక్షణ ఉంటుంది.

# సీఎం ప్రజావాణిలో అర్జీదారుల వెల్లువ

- ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులకు భరోసా ఇచ్చిన గద్వాల్ విజయలక్ష్మి
- 13 గ్రూపులు, 348 మంది ద్వారా 196 దరఖాస్తులు
- దరఖాస్తులు స్వీకరించిన స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి



హైదరాబాద్ (జనంసాక్షి) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం నిర్వహించిన 259వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 13 గ్రూపులు, 348 మంది ద్వారా 196 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ శాఖకు 67, బీసీ సంక్షేమ శాఖకు 24, మున్సిపల్ శాఖకు 26, ఇతర శాఖలకు 79 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి ఎంతో సహనంతో దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్మెంట్ చేసి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించారు. ఆర్టీసీ లో వివిధ కారణాలతో ఉద్యోగం కోల్పోయిన కార్మికులు ప్రజావాణికి వచ్చి తమను విధుల్లోకి చేర్చుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం ప్రజావాణి ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మిని కోరగా రవాణా శాఖ మంత్రి సహా ఆర్టీసీ ఎండీతో మాట్లాడి సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఇప్పటికే 317 మందికి ఆర్టీసీలో ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులకు తిరిగి విధుల్లోకి చేరే విధంగా చర్యలు తీసుకున్నట్లు విజయలక్ష్మి పేర్కొన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏసిపి ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నారై బీఆర్ఎస్ యూకే విస్తృత కార్యవర్గ సమావేశం



హైదరాబాద్ (జనంసాక్షి) : లండన్‌లో ఎన్నారై బీఆర్ఎస్ యూకే విస్తృత కార్యవర్గ సమావేశాన్ని అధ్యక్షుడు నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి యూకే వ్యాప్తంగా పనిచేస్తున్న కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎన్నారై బీఆర్ఎస్ యూకే వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం పాల్గొన్నారు. ఇటీవల మరణించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గారి మరియు ఎన్నారై బీఆర్ఎస్ యూకే సభ్యుడు శ్రీనాథ్ రెడ్డి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం అటు అమరవీరులను, ప్రొఫెసర్ జయశంకర్ సార్‌ను స్మరించుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు. యూకేలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న పలువురు తెలంగాణ ఎన్నారైలు ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎన్నారై బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం నూతన సభ్యులకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ యూకే కార్యదర్శి సురేష్ గోపతి స్వాగతోపన్యాసంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ అధ్యక్షుడు అశోక్ గౌడ్ దూసరి, ఎన్నారై బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు నవీన్ రెడ్డి, బీఆర్ఎస్ యూకే అడ్వైజరీ బోర్డు చైర్మన్ సీకే చంద్రశేఖర్ గౌడ్,ఎన్నారై బీఆర్ఎస్ యూకే ఉపాధ్యక్షుడు రేతినేని రవి, సత్యమూర్తి చిలుముల సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సురక్షిత రహదారుల నిర్మాణమే లక్ష్యం

- 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించాలి
- హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65ను 6౦2 లేన్లకు విస్తరించాలి
- మంత్రి కోమటిరెడ్డి



ఏక్తానగర్ (జనంసాక్షి) : రహదారి భద్రతకు ప్రమాణాలు రూపొందించడం మాత్రమే కాకుండా వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి సురక్షిత రహదారులను నిర్మించడమే లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో జరుగుతున్న చింతన్ శివిర్-2026లో 'ప్రమాణాల నుంచి అమలు వరకు సురక్షిత రహదారుల రూపకల్పన' అంశంపై జరిగిన ప్రత్యేక సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. 2030 నాటికి రోడ్డు ప్రమాద మరణాలను 50 శాతం తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. బ్లాక్ స్పాట్లను గుర్తించడం మాత్రమే కాకుండా శాశ్వత ఇంజినీరింగ్ పరిష్కారాలు చూపాలని సూచించారు. రహదారి రూపకల్పన, నిర్మాణం, నిర్వహణ ప్రతి దశలో భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రోడ్డు భద్రత ఆడిట్లు నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, అవసరమైతే స్వతంత్ర రోడ్డు భద్రత నిపుణుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. భూసేకరణ, రైట్ ఆఫ్ వే అందుబాటులో ఉండటం రహదారి భద్రతకు కీలకమని మంత్రి తెలిపారు. సరైన జంక్షన్లు, సర్వీస్ రోడ్లు, పాదచారుల సౌకర్యా లు, లైటింగ్, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. సాంకేతికతను వినియోగించి ప్రమా దాలను ముం దుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. దేశంలో 2023లో 1,72,890 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణించగా, తెలంగా ణలో 7,660 మంది ప్రాణాలు కోల్పోయారని మంత్రి తెలిపారు. హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65పై నిత్యం జరుగుతున్న ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేశారు. 17 బ్లాక్ స్పాట్లు గుర్తించి ఫ్లైఓవర్ల నిర్మాణం జరుగుతున్నప్పటికీ నాలుగు లేన్ల రహదారిపై ట్రాఫిక్ భారం పెరిగిందన్నారు. 6౦2 లేన్లుగా ఆధునిక సాంకేతికతతో విస్తరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని, ఈ అంశాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. 'ఎన్ని కిలోమీటర్ల రహదారి నిర్మించామన్నది కాదు.. ఎన్ని ప్రాణాలను కాపాడామన్నదే ముఖ్యం' అని మంత్రి అన్నారు.

# మహిళ పట్ల అసత్య ప్రచారం చేసిన ఉప సర్పంచ్ పై కేసు

శాయంపేట అక్టోబర్ 6 (జనం సాక్షి) : శాయంపేట గ్రామ ఉప సర్పంచ్ ధైనశీ పెల్లి సుమన్ అదే గ్రామానికి చెందిన మహిళ గురించి, ఆమె అతనితో సన్నిహితంగా ఉంటుందని, ఆమె వ్యక్తిత్వం గురించి అసత్య ప్రచారం చేస్తూ తనని వేదిస్తూ, ఇబ్బంది పెడ్తున్నాడని శాయంపేట పోలీస్ స్టేషన్ ని ఆశ్రయించగా ఎస్సై పరమేశ్వర్ కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

# చిట్టీల పేరుతో వసూలు

- తిరిగి చెల్లించకుండా మోసం

హైదరాబాద్ (జనంసాక్షి) : చిట్టీలు, అప్పుల పేరుతో పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి తిరిగి చెల్లించకుండా మోసానికి పాల్పడినట్లు వచ్చిన ఫిర్యాదుపై నార్సింగి పోలీసులు విచారణ చేపట్టారు. బల్లి సురేందర్ అలియాస్ సూరిపై ఈ ఆరోపణలు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదుదారు ముంగి అమరేందర్ రెడ్డి తన వద్ద నుంచి సురేందర్ రూ.20 లక్షలు అప్పుగా తీసుకుని, రూ.25 లక్షల విలువైన సెక్యూరిటీ చెక్కు ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా చిట్టీల పేరుతో పలువురి నుంచి క్రమం తప్పకుండా డబ్బులు వసూలు చేసి, చిట్టీలు పూర్తయిన తర్వాత చెల్లించాల్సిన మొత్తాలను ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విధంగా పలువురి నుంచి కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# మానసికంగా వేధించడం వల్లే సుధాకర్ ఆత్మహత్య

**భీంగల్‌లో సుధాకర్ కుటుంబానికి బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మెన్ రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు పరామర్శ**



నిజామాబాద్ (జనంసాక్షి) : పోలీసులు మానసికంగా వేధించడం వల్లే చిరువ్యాపారి సుధాకర్ ఆత్మహత్య చేసుకున్నాడని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మెన్ రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు ఆరోపించారు. సుధాకర్ భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నిజామాబాద్ జిల్లా భీమగల్ పట్టణంలో చేనేత వృత్తికి చెందిన పేద బీసీ సుధాకర్ పై పోలీసులు వరుస కేసులు నమోదు చేసి, మానసికంగా వేధించడం వల్లే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆయన తీవ్రంగా ఖండించారు. టీ, సిగరెట్లు విక్రయిస్తూ, స్టౌల రిపేర్ చేసుకుంటూ జీవనం సాగించే సుధాకర్ ను అకారణంగా పోలీస్ స్టేషన్ కు పిలిపించి వేధించడంతో, మనస్తాపానికి గురై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని, 'పేద బీసీలపై పోలీసులు ఇలా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలో ఆమోదయోగ్యం కాదు. ఇది పోలీసు వ్యవస్థ వైఫల్యం. బీసీలపై జరుగుతున్న వరుస దాడుల్లో భాగమే ఈ ఘటన. దీన్ని మా ఫోరం తీవ్రంగా ఖండిస్తోంది' అని అన్నారు. సుధాకర్ కు మెరుగైన వైద్యం కోసం వెంటనే హైదరాబాద్ కు తరలించి, వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించాలని, ఘటనపై సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర విచారణ జరిపి, బాధ్యులైన పోలీసు అధికారులను వెంటనే సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్ గ్రేషియా మరియు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యాపారులు, యువత, విద్యార్థులు, మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు బంద్ ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ సంఘం అధ్యక్షులు చోళ రాజేశ్వర్ వైస్ చైర్మన్ బెంకి నారాయణ, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర నాయకులు కర్నాటి మనోహర్ నేత, వేముల కొండల గౌడ్, ఐతీ. అవ్వారు వేణు కుమార్, చెన్నా శ్రీకాంత్, లింగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# నీటికుంటలో మహిళ మృతదేహం

- అనుమానస్పద మృతిగా నమోదు



ఫరూఖ్‌నగర్ (జనంసాక్షి) : ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ శివారులోని వడ్లోని కుంటలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. మంగళవారం కుంటలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో షాద్‌నగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. కుంటలో పడి మహిళ మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే ఆమె ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెందిందా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు క్రీమ్ రంగు చీర, నల్లటి జాకెట్ ధరించి ఉండగా.. కాళ్లకు కడియాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆమె ఎలికట్ట గ్రామానికి చెందినవారా? లేక పరిసర గ్రామాలకు చెందినవారా? అనే వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# విద్యార్థులపై ఉపాధ్యాయురాలు కర్రలతో దాడి?

- 35 మంది విద్యార్థులను కర్రలతో కొట్టారంటూ తల్లిదండ్రుల ఆగ్రహం..
- మూడు కర్రలు విరిగేలా దాడి చేశారన్న ఆరోపణలు
- చికిత్స చేయించి విషయం గోప్యంగా ఉంచే ప్రయత్నం
- ఉపాధ్యాయురాలు రజినిపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్



నెక్కొండ, అక్టోబర్ 6 (జనంసాక్షి): నెక్కొండ మండల కేంద్రంలోని జనరల్ సొసైటీ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయురాలు కర్రలతో దాడి చేశారన్న ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఆదివారం సాయంత్రం 5వ తరగతి బి సెక్షన్‌కు చెందిన సుమారు 35 మంది విద్యార్థులను ఇంగ్లీష్ బోధించే ఉపాధ్యాయురాలు రజిని కర్రలతో కొట్టినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు బాత్రూంకు వెళ్లే సమయంలో జారిపడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందనే కారణంతో వారిని కొట్టినట్లు పాఠశాల యాజమాన్యం సమాధానం ఇచ్చిందని తల్లిదండ్రులు చెబుతున్నారు. అయితే, విద్యార్థులపై కర్రలతో దాడి చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు. 35 మంది విద్యార్థులను కర్రలతో కొట్టడంతో మూడు కర్రలు విరిగినట్లు విద్యార్థులు తమ తల్లిదండ్రులకు చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనలో పలువురు విద్యార్థుల శరీరాలపై గాయాలు, దెబ్బల గుర్తులు కనిపించినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమ కుమార్తెను చూడటానికి గురుకులానికి వెళ్లిన ఓ విద్యార్థినీ తల్లిదండ్రులకు అసలు విషయం బయటపడినట్లు తెలుస్తోంది. ఉపాధ్యాయురాలు తమను కొట్టిందని విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పాఠశాల యాజమాన్యాన్ని నిలదీసి ఘటనపై వివరాలు అడిగినట్లు సమాచారం. విషయం బయటకు రాకుండా గోప్యంగా ఉంచే ప్రయత్నం విద్యార్థులకు గాయాలు కావడంతో విషయం తల్లిదండ్రులకు తెలియకుండా ఉండేందుకు గాయాలపై ఐస్ ముక్కలతో మర్ధన చేయడం ఇతర చికిత్సలు చేయడం జరిగిందని విద్యార్థులు తల్లిదండ్రులకు ఆరోపించడం జరిగింది దీనితో ఈ విషయాన్ని గోప్యంగా ఉంచేందుకు ప్రయత్నించారా అనే అనుమానాలు తల్లిదండ్రులు వ్యక్తం అవుతున్నాయి పిల్లల భద్రత రక్షణ బాధ్యత వహించాల్సిన పాఠశాలల్లోనే ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,

ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థుల వాగ్మూలాలను నమోదు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు, ఆరోపణలు నిజమని తెలితే విద్యార్థులపై దాడికి పాల్పడిన ఉపాధ్యాయురాలు రజిని పై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఘటనకు నిర్లక్ష్యం చేసిన పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి సంబంధిత అధికారుల పర్యవేక్షణలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని వారి గాయాలపై పూర్తిస్థాయిలో చికిత్స చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పిల్లలను క్రమశిక్షణ పేరుతో కొట్టడం ఏమాత్రం సమంజసం కాదు ఒకవేళ ఉపాధ్యాయురాలు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ అయిన ఇలాంటి ప్రవర్తన కొనసాగితే మరింత మంది పిల్లలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని తెలిపారు.

# స్వప్న హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స

- మహిళ మూత్రపిండం నుంచి 119 రాళ్ల తొలగింపు
- ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా విజయవంతమైన ఆపరేషన్





నిర్మల్, అక్టోబర్ 06 (జనం సాక్షి): నిర్మల్ పట్టణంలోని స్వప్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అరుదైన, సంక్లిష్టమైన శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన ఓ మహిళ తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ ఆసుపత్రిని ఆశ్రయించింది. వైద్యుల పరీక్షల్లో ఆమె మూత్రపిండ వ్యవస్థలో భారీగా రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం నిర్వహించిన శస్త్రచికిత్సలో ఏకంగా 119 రాళ్లను విజయవంతంగా తొలగించారు. రోగిని డా. నాళం శశికాంత్ (ఎంఎస్ సర్జన్), డా. అశోక్ (యూరాలజిస్ట్) పరీక్షించారు. అనంతరం సీటీ-కేయూబీ స్కానింగ్ నిర్వహించగా మూత్రపిండ వ్యవస్థలో అనేక రాళ్లు ఉన్నట్లు నిర్ధారణ అయింది. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వైద్యులు శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. డా. అశోక్ ఆధ్వర్యంలో నిపుణులైన వైద్య బృందం శస్త్రచికిత్స నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం 119 రాళ్లను తొలగించారు. శస్త్రచికిత్స అనంతరం రోగిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ అరుదైన శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా నిర్వహించారు. దీంతో రోగికి ఆర్థిక భారం లేకుండా అవసరమైన వైద్య చికిత్స అందింది. సంక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన డా. అశోక్, వైద్య బృందాన్ని స్వప్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ యాజమాన్యం, డా. నాళం శశికాంత్ అభినందించారు. ఈ సందర్భంగా యూరాలజిస్ట్ డా. అశోక్ మాట్లాడుతూ కిడ్నీ రాళ్ల సమస్యను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. నడుము లేదా వెనుక భాగంలో తీవ్రమైన నొప్పి, మూత్ర విసర్జన సమయంలో మంట, మూత్రంలో రక్తం, వికారం, వాంతులు, మూత్ర విసర్జనలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. కిడ్నీలో రాళ్లు ఏర్పడకుండా తగినంత నీరు తాగడంతో పాటు సమతుల్యమైన పోషకాహారం తీసుకోవాలని డా. అశోక్ సూచించారు. ఆహారంలో ఉప్పు, జంక్‌ఫుడ్‌ను వీలైనంత వరకు తగ్గించాలని తెలిపారు. అవసరాన్ని బట్టి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారు సకాలంలో నిపుణులైన యూరాలజిస్ట్‌ను సంప్రదించాలని కోరారు.

## డాక్యుమెంట్ పోయినది

నేను అనగా జటంగి గణేష్ S/o మల్లయ్య గ్రామం తాళ్లసింగారం మండలం నూతనకల్ జిల్లా సూర్యాపేట నేను తాళ్ల సింగారం నుండి నూతనకల్‌కు వస్తుండగా మార్గం మధ్యలో డాక్యుమెంట్లు 44 55 / 08 2009 చాలా వెంకట రమణ DOC 18 3rd జనవరి 2007 పోనమల నరసింహా రావు మార్ట్ గేజ్ డీడ్ 47111th APR 1983 పోయినది. దొరికిన వారు 9133850607 నెంబర్‌కు సంప్రదించగలరు.

జనంసాక్షి www.janamsakshi.org
బుధవారం 7 అక్టోబర్ 2026

# రాజీనామాకు ఇంకా ఆలస్యమెందుకు?

సంపాదకీయం

డబ్బు ఆశ మనిషిని ఎంత దిగజారుస్తుందో చెప్పడానికి ఆంధ్రప్రదేశ్‌లో బయటపడ్డ తాజా గూఢచర్యం వ్యవహారమే నిదర్శనం. పుట్టిన గడ్డకు, తిన్న ఇంటికి వెన్నుపోటు పొడిచి, కొన్ని కాసుల కోసం శత్రు దేశానికి దేశ రక్షణ రహస్యాలను చేరవేస్తున్నారన్న ఆరోపణలు ప్రతి భారతీయుడి గుండెను గాయపరుస్తున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా సాగిన ఈ కుట్రను ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ ఛేదించడం ఊరటనిచ్చే అంశం.

'ఆపరేషన్ ఫైర్‌వాల్-2026' పేరుతో అత్యంత గోప్యంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో 13 మంది నావికాదళ సిబ్బందితో సహా 18 మందిపై నిఘా పెట్టారు. ఈ నెల 1న 12 ప్రత్యేక బృందాలు 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. ప్రాథమిక ఆధారాల ఆధారంగా ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో విశాఖపట్నంలో నేవీ అధికారులకు కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేసిన అన్నం సాయి వరప్రసాద్, విశాఖ నేవీ బేస్‌లో పనిచేస్తున్న నేవీ ఉద్యోగి ప్రదీప్ ముఖర్జీ ఉన్నారు.

అన్నం సాయి వరప్రసాద్ పాకిస్థాన్‌కు చెందిన నిఘా వ్యవస్థతో సంబంధం ఉన్న వ్యక్తికి నేవీ, రక్షణ సంస్థలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని చేరవేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇందుకు ప్రతిఫలంగా డబ్బులు తీసుకున్నారా అన్న కోణంలోనూ దర్యాప్తు జరుగుతోంది.

ప్రదీప్ ముఖర్జీ విశాఖ నేవల్ బేస్‌లో పనిచేస్తున్న ఉద్యోగి. పాక్ నిఘా ఆపరేటివ్‌తో సంబంధాలు కొనసాగించడంతో పాటు, వాట్సాప్ ఖాతా యాక్టివేషన్‌కు అవసరమైన ఓటీపీని అందించారని, రక్షణ సంస్థలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని పంచుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయనను తమిళనాడులోని కోయంబత్తూరులో అరెస్టు చేశారు. విజయవాడలోని కౌంటర్ ఇంటెలిజెన్స్ పీఎస్‌లో కేసులు నమోదయ్యాయి. భారతీయ న్యాయ సంహిత, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం, అధికారిక రహస్యాల చట్టం కింద కేసులు నమోదు చేశారు. మిగిలిన 16 మంది అనుమానితుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. సముద్ర తీరాన్ని కాపాడే నావికాదళం దేశానికి కంటిరెప్ప లాంటిది. ఆ వ్యవస్థలోని వారే ఇలాంటి పనికి పాల్పడ్డారన్న ఆరోపణలు సమాజాన్ని విస్మయానికి గురి చేస్తున్నాయి. సరిహద్దుల్లో సైనికులు ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడుతుంటే, లోపల ఉండి కొందరు డబ్బుకు అమ్ముడుపోవడం క్షమించరాని నేరం. ఇది కేవలం చట్ట ఉల్లంఘన కాదు, లక్షలాది మంది ప్రజల భద్రతతో చెలగాటం.

అయితే దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆరోపణలు ఆరోపణలే. నిందితులకు తమ వాదన వినిపించుకునే హక్కు ఉంది. న్యాయస్థానంలో నేరం రుజువైతే మాత్రం ఎలాంటి మినహాయింపులూ ఉండకూడదు. సోషల్ మీడియా పరిచయాలు, ఆన్‌లైన్ ఉచ్చులు, ప్రలోభాల ద్వారా శత్రు ఏజెన్సీలు సిబ్బందిని ఎలా వలలో వేసుకుంటున్నాయో రక్షణ శాఖ లోతుగా అధ్యయనం చేయాలి. ఈ ఘటన మనందరికీ ఒక హెచ్చరిక. దేశభక్తి నినాదాల్లో కాదు, నిజాయితీతో కూడిన బాధ్యతలో కనిపించాలి. కాసుల కోసం కన్నతల్లి లాంటి మాతృభూమిని తాకట్టు పెట్టేవారిని సమాజం ఎన్నటికీ క్షమించదు. ఈ కుట్ర వెనుక ఉన్న మొత్తం నెట్‌వర్క్‌ను వెలికితీసి, అందరినీ చట్టం ముందు నిలబెట్టాల్సిన బాధ్యత దర్యాప్తు సంస్థలపై ఉంది.

# విభజనను అర్థం చేసుకోకుండా ఐక్యత సాధ్యమేనా..?

*కమ్యూనిస్టు పార్టీల విభజనకు కారణం ఏంటని అడిగితే సాధారణం గా కొన్ని సిద్ధాంతపరమైన కారణాలు ముందుకు వస్తాయి. మార్క్సిజాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేదు, వర్గ పోరాటాన్ని తప్పుగా చూశారు, పార్లమెంటరీ మార్గాన్ని ఎంచుకున్నారు, విప్లవ మార్గం నుంచి తప్పిపోయారు, అంతర్జాతీయ పరిణామాలను తప్పుగా విశ్లేషించారు. ఒక్కో విభజనకు ఒక్కో సిద్ధాంతపరమైన కారణం. కానీ ఇక్కడే ఒక ప్రశ్న మొదలవుతుంది. మార్క్సిజాన్ని అర్థం చేసుకోవడంలో విఫలమవుతున్నది ఒక్క పార్టీ అయితే అర్థం చేసుకోవచ్చు. అదే మార్క్సిజం పేరుతో ఏర్పడిన సంస్థలు పదుల సంఖ్యలో విడిపోతూ ఉంటే సమస్య ప్రతిసారి మార్క్సిజాన్ని అన్వయించడంలోనే ఉందని ఎలా నమ్మాలి? సిద్ధాంతం విభేదాన్ని వివరిస్తు ంది. కానీ విభేదం ఎందుకు తప్పనిసరిగా విభజనగా మారుతుందో అది మాత్రమే వివరించగలదా? బహుశా మనం ఇంతకాలం వైరుధ్యాన్ని చూస్తున్నామని అనుకుంటూ వైరుధ్యం కింద దాక్కున్న మరో మనిషిని చూడలేదేమో.*

సెప్టెంబర్ 20న సుందరయ్య విజ్ఞాన కేంద్రం వేదికగా పలు కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాతంత్ర శక్తులు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని చెప్పడం ఈ నేపథ్యంలో ఒక సాధారణ రాజకీయ సమావేశం కాదు. కమ్యూనిస్టుల ఐక్యత కోసం గతంలోనూ వివిధ స్థాయిల్లో, వివిధ వర్గాల ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. భారత రాజకీయాల్లో ఒక నిర్దిష్ట పరిస్థితి ఏర్పడినప్పుడు విడివిడిగా ఉన్న శక్తులు ఒకే వేదికపై రావాలనే అవసరం సహజంగానే పుడుతుంది. ముఖ్యంగా బిజెపి ప్రభుత్వ రాజకీయాలను ఎదుర్కోవడానికి విస్తృత ప్రజాతంత్ర ఐక్యత అవసరమని భావించడం ఒక రాజకీయ అభిప్రాయం. కానీ అసలు ఆసక్తికరమైన విషయం సమావేశం జరగడం కాదు; ఇన్నాళ్లు విడివిడిగా ఉన్న సంస్థలు ఇప్పుడు ఏ కారణంతో ఒక టేబుల్ దగ్గరకు వచ్చాయి, రేపు అదే టేబులు దగ్గర నుంచి ఒకే దిశలో నడవగలవా? అన్నది. ఒక బలమైన రాజకీయ శత్రువు ఉన్నప్పుడు ఐక్యత సులభంగా కనిపిస్తుంది. బయట నుంచి వచ్చే ఒత్తిడి లోపల ఉన్న తేడాలను కొంత కాలం మౌనంగా ఉంచగలదు. విడిపోయిన శక్తులను ఒకే వేదిక పైకి తీసుకు రాగలదు. కానీ వాటి మధ్య ఉన్న భిన్నత్వాన్ని మాత్రం తొలగించలేదు.రాజకీయ అవసరం కలిసి పనిచేయమని చెప్పవచ్చు. చరిత్ర మాత్రం మరొక పరీక్ష పెడుతుంది. నిన్నటి విభేదాన్ని ఈరోజు ఎలా నిర్వహిస్తారు? నిర్ణయం మీకు అనుకూలంగా రాకపోతే మీరు సామూహిక నిర్ణయాన్ని అంగీకరించగలరా? మీ పార్టీ అభిప్రాయానికి భిన్నమైన అభిప్రాయాన్ని కూడా అదే ఉద్యమంలో భాగంగా చూడగలరా? ఐక్యతకు అసలు పరీక్ష సమావేశ మందిరంలో కాదు. నిర్ణయం తీసుకునే క్షణంలో మొదలవుతుంది. కమ్యూనిస్టు రాజకీయాల్లో సిద్ధాంతపరమైన వైరుధ్యాలకు అసలు ప్రాధాన్యం లేదని చెప్పడం తప్పు. మార్క్సిజం ఒక స్థిరమైన మంత్రం కాదు. సమాజాన్ని విశ్లేషించే పద్ధతి. భారతదేశం వంటి సంక్లిష్ట సమాజంలో వర్గం, కులం, భూమి, పెట్టుబడి, మతం, జాతీయత, రాజ్యం వంటి ప్రశ్నలను ఎలా అనుసంధానించాలి అనే విషయంలో నిజమైన విభేదాలు రావచ్చు. మార్క్సిజాన్ని భారత పరిస్థితులకు ఎలా అన్వయించాలనే ప్రశ్న కూడా చిన్న ప్రశ్న కాదు. కాబట్టి ప్రతి విభజనను వ్యక్తిగత స్వార్థంగా కొట్టి పారేయడం ఎంత సరళీకరణో ప్రతి విభజనను కేవలం సిద్ధాంతపరమైన పవిత్రతగా చూడడం కూడా అంతే సరళీకరణ.

అయితే ఒక ప్రశ్నను మాత్రం తప్పించుకోలేం. ఒక సిద్ధాంతపరమైన విభేదం ఎందుకు సంస్థాగత విభజనగా మారాలి? ఇద్దరు వ్యక్తులు ఒకే పుస్తకాన్ని చదివి వేరువేరు గా అర్థం చేసుకోవచ్చు. ఒకే సమాజాన్ని చూసి వేరువేరు రాజకీయ నిర్ణయాలకు రావచ్చు. కానీ భిన్నమైన ఆలోచన అంటే తప్పనిసరిగా వేరువేరు శిబిరాలా? వేరువేరు శిబిరాలు అంటే తప్పనిసరిగా పరస్పర అనుమానాలా? అనుమానం అంటే తప్పనిసరిగా సంస్థాగత విభజనా?ఈ గొలుసులోని ప్రతి కడియం సహజమైనది కాదు. అక్కడే సిద్ధాంతం కంటే సంస్థాగత మనస్తత్వం అనే ప్రశ్న ముందుకు వస్తుంది. కారణాలు ఏమైనా కావచ్చు. ఇప్పటికైనా గతాన్ని పక్కనపెట్టి కలిసి పనిచేద్దాం అన్న భావన ఆ సమావేశంలోని పలువురి మాటల్లో వినిపించింది. రాజకీయంగా ఇది అవసరమైన పిలుపు కావచ్చు. కానీ గతాన్ని పక్కన పెట్టడం అంటే గతంలో మనల్ని విడదీసిన కారణాలను కూడా పక్కన పెట్టడమేనా?



వ్యక్తికి మాత్రమే ఇగో ఉంటుందని మనం అనుకుంటాం. సంస్థలకు కూడా ఒక రకమైన ఇగో ఏర్పడుతుంది. దశాబ్దాల చరిత్ర, త్యాగాలు, నాయకుల జ్ఞాపకాలు, తమ పార్టీ సాహిత్యం, తమ జెండా, తమ కార్యాలయాలు,కార్యకర్తలు, తమ రాజకీయ భాష బి ఇవన్నీ కలిసి ఒక సంస్థకు ప్రత్యేకమైన స్వీయ గుర్తింపును నిర్మిస్తాయి. ఒక దశలో "మేము ఒక రాజకీయ సంస్థ" అనే భావన నుంచి "మా మార్గమే సరైన మార్గం" అనే భావనకు ప్రయాణం మొదలవుతుంది. అప్పటినుంచి మరో సంస్థతో విభేదం కేవలం విధానపరమైన విభేదం కాదు; తమను తాము నిర్వచించుకునే గుర్తింపును కాపాడుకునే ప్రయత్నం కూడా అవుతుంది. అక్కడే "మార్క్సిజాన్ని ఎవరు సరిగ్గా అన్వయించారు?" అనే ప్రశ్నకు ముందు మరో ప్రశ్న రావాలి. "మనం తప్పు కావచ్చని అంగీకరించే సంస్థాగత సామర్థ్యం మనకు ఎంత ఉంది?"మార్క్స్ ను చదవడం ఒక విషయం; మార్క్స్ ను ఉటంకిస్తూ మన సొంత రాజకీయ నిర్మాణాన్ని ప్రశ్నించుకోవడం మరో విషయం. వర్గ పోరాటాన్ని విశ్లేషించడం సులభం; మన సంస్థలో అధికార సంబంధాలు ఎలా పనిచేస్తున్నాయో పరిశీలించడం అంత సులభం కాదు. అలాగే సమాజంలోని ఆధిపత్యాన్ని విమర్శించడం సులభం; మనతో కలిసి పని చేసే మరో సంస్థను సమాన భాగస్వామిగా అంగీకరించడం కొన్నిసార్లు కష్టం. బహుశా ఇక్కడే సిద్ధాంతం మనిషిని మార్చాల్సిన చోట, మనిషే సిద్ధాంతాన్ని తనకు అనుకూలమైన గుర్తింపుగా మార్చుకునే ప్రమాదం మొదలవుతుంది.

ఇదే "వైరుధ్యాల తివాచి".తివాచి కింద ఉన్న దుమ్మును దాచి పెట్టవచ్చు; దుమ్ముపోదు. అలాగే ఒకే వేదికపై జెండాలు పక్క పక్కన పెట్టడం వల్ల పాత అనుమానాలు, పాత గాయాలు, పాత సంస్థాగత అలవాట్లు అదృశ్యమవవు.అవి కేవలం కొంతకాలం కనిపించకుండా ఉండొచ్చు. ఐక్యత సమావేశంలో కనిపించే దృశ్యం. ఐక్యతా సంస్కృతి మాత్రం ప్రతిరోజు తీసుకునే చిన్న నిర్ణయాల్లో కనిపిస్తుంది. ఒకరి మాట మరొకరు వినడంలో, తాత్కాలికంగా తమ రాజకీయ ప్రయోజనాన్ని పక్కన పెట్టడంలో,సామూహిక నిర్ణయాన్ని వ్యక్తిగత లేదా సంస్థాగత ప్రతిష్ట కంటే పైకి ఉంచడంలో కనిపిస్తుంది.

వైరుధ్యాలను తొలగించడం కాదు.వైరుధ్యాలు ఉండటం, వాటిని గుర్తించడం, వాటిపై చర్చ జరపడం, వాటి నుంచే కొత్త అవగాహన సృష్టించడం రాజకీయ ప్రక్రియలో ఒక భాగం. కానీ వైరుధ్యాన్ని పరిష్కరించలేక పోవడం కంటే దాన్ని శాశ్వత విభజనకు కారణంగా మార్చడం అసలు సమస్య. ఒక పార్టీకి మరో పార్టీతో భిన్నాభిప్రాయం ఉండొచ్చు కానీ ఆ భిన్నాభిప్రాయాన్ని నిర్వహించే ప్రజాస్వామ్య సంస్కృతి లేకపోతే సిద్ధాంతం విభజనకు కారణం కాదుబిసిద్ధాంతాన్ని ఉపయోగించే సంస్థాగత పద్ధతి విభజనకు మార్గం అవుతుంది. అప్పుడు వైరుధ్యం పరిష్కరించాల్సిన విషయం కాకుండా, తమ గుర్తింపును బలపరిచే సాధనంగా మారుతుంది. అందుకే ఆ సమావేశంలో వినిపించిన ఐక్యతా పిలుపును కేవలం స్వాగతించడమో, అనుమానించడమో సరిపోదు. దాని ముందు ఒక అద్దం పెట్టాలి. "మనం ఎందుకు విడిపోయాం?" అనే ప్రశ్నకు ఇప్పటివరకు ఇచ్చిన సమాధానాలను ఒకసారి తలకిందులు చేసి చూడాలి. సిద్ధాంత బేధాలు నిజమే అయితే, వాటిని విభజన లేకుండా నిర్వహించే సంస్కృతి ఎందుకు అభివృద్ధి కాలేదు? వ్యూహ బేధాలు నిజమే అయితే, వ్యూహం మారినప్పుడు సంబంధాలు ఎందుకు మారాలి? ఒక పార్టీ తప్పు చేస్తే దాన్ని విమర్శించడానికి మరో పార్టీ అవసరం కావచ్చు. కానీ ప్రతి విమర్శ చివరికి మరో పార్టీగా మారాల్సిందేనా ?ఈ ప్రశ్నకు సమాధానం దొరకకపోతే ఐక్యత రేపటి విభజనకు ముందు విరామం మాత్రమే కావచ్చు. అయితే ఈ ప్రశ్న కమ్యూనిస్టులకే ప్రత్యేకమైనది కాదు. ప్రతి రాజకీయ సంస్థ,సామాజిక ప్రజాసంఘంలోనూ ఒక దశలో సిద్ధాంతం సంస్థగా మారుతుంది. సంస్థ గుర్తింపుగా మారుతుంది. గుర్తింపు చివరికి స్వీయ రక్షణగా మారే ప్రమాదం ఉంటుంది. ఉద్యమం మొదట మనిషి కోసం నిర్మించబడుతుంది. కొంతకాలానికి మనిషి ఉద్యమాన్ని కాపాడుకోవడానికి ఉపయోగపడే పరిస్థితి రావచ్చు. అక్కడే లక్ష్యంబి సంస్థ మధ్య సంబంధాన్ని మళ్లీ పరిశీలించాల్సిన అవసరం వస్తుంది. ప్రజల విముక్తి కోసం నిర్మించిన సంస్థ తన సొంత నిరంతర ఉనికినే ప్రధాన లక్ష్యంగా మార్చుకోకుండా ఉండగలదా? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పగలిగినంతవరకే ఐక్యతకు రాజకీయ అర్థం ఉంటుంది. కాబట్టి సమావేశం ముందు నిలిచిన అసలు ప్రశ్న "ఎన్ని కమ్యూనిస్టు పార్టీలు ఒకే వేదికపై వచ్చాయి?" అన్నది కాదు. "ఎన్ని సంస్థలు తమలోని పాత విభజనలను ఉత్పత్తి చేసే మనస్తత్వాన్ని ప్రశ్నించడానికి సిద్ధంగా ఉన్నాయి?" అన్నదే. కలిసి పని చేయడం ఒక రాజకీయ ఒప్పందం కావచ్చు. కానీ కలిసిపోవడం అంటే అందరూ ఒకే పార్టీగా మారడం కాదు. భిన్నత్వాన్ని కొనసాగిస్తూనే ఒకరి భిన్నత్వాన్ని మరొకరు భరించగల రాజకీయ సంస్కృతిని నిర్మించడం. మార్క్సిజాన్ని భారత పరిస్థితులకు అన్వయించడంలో వైఫల్యం ఎక్కడ ఉందో వెతికే ముందు, దాన్ని అన్వయిస్తున్న మనుషుల మధ్య సంబంధాలను కూడా పరిశీలించాలి. ఎందుకంటే విడిపోయిన పార్టీల సంఖ్యను లెక్కించడం చరిత్రను వివరిస్తుంది. కానీ అవి ఎందుకు పదేపదే విడిపోతున్నాయో తెలుసుకోవాలంటే మనిషిలోకి, సంస్థలోకి, గుర్తింపులోకి చూడాలి. అక్కడే తివాచి కింద దాచిన అసలు వైరుధ్యం కనిపించవచ్చు.

ఆయిరబోయిన బిక్షపతి.
7993248717

# జల సంక్షోభం.. ముందస్తు చర్యలే పరిష్కారం

నిన్నటి సంచిక తరువాయి

భారతదేశం ఈ ప్రపంచ సంక్షోభానికి మినహాయింపు కాదు. దేశంలో అనేక ప్రాంతాలు ఇప్పటికే భూగర్భ జలాలపై అధికంగా ఆధారపడుతున్నాయి. నగరాల విస్తరణతో చెరువులు, కుంటలు, సహజ నీటి ప్రవాహ మార్గాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. వర్షపు నీరు భూమిలోకి చొరబడే అవకాశాలు తగ్గుతున్నాయి. ఫలితంగా ఒకవైపు భారీ వర్షాలు పడితే వరదలు వస్తున్నాయి; మరోవైపు వేసవిలో అదే ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడుతోంది.

కేప్‌టౌన్ అనుభవం మనకు ఇదే పాఠం చెబుతోంది. నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి చేరినప్పుడు ఒక నగరంలో ప్రజల రోజువారీ జీవితాన్ని ఎంత కఠినంగా నియంత్రించాల్సి వస్తుందో ప్రపంచం చూసింది. కాబట్టి కేప్‌టౌన్‌ను భయపెట్టే ఉదాహరణగా మాత్రమే కాకుండా ముందస్తు హెచ్చరికగా చూడాలి. "మన నగరానికి ఆ పరిస్థితి రాదు" అనే నిర్లక్ష్యం అత్యంత ప్రమాదకరం.

మహారాష్ట్రలోని లాతూర్‌కు తీవ్రమైన నీటి కొరత సమయంలో రైలు ద్వారా నీటిని తరలించాల్సి వచ్చిన సంఘటన కూడా భారతదేశానికి ఒక పెద్ద హెచ్చరిక. నీటి వనరులు క్షీణిస్తే చివరికి ప్రభుత్వం ఎంత దూరమైనా నీటిని తరలించాల్సి వస్తుంది. కానీ ట్యాంకర్లతో, రైళ్లతో నీటిని తరలించడం శాశ్వత పరిష్కారం కాదు. శాశ్వత పరిష్కారం వర్షపు నీటిని నిల్వ చేయడం, చెరువులను పునరుద్ధరించడం, భూగర్భ జలాలను పెంచడం, నీటి వినియోగాన్ని నియంత్రించడం. ఈ పరిస్థితికి ప్రధాన కారణాల్లో మనిషి పాత్రను విస్మరించలేం. చెరువులను పూడ్చి ఇళ్లు నిర్మించడం, అడవులను నరికివేయడం, నదులను ఆక్రమించడం, వాగుల సహజ ప్రవాహాలను అడ్డుకోవడం, భూగర్భ జలాలను అతిగా తోడేయడం, నీటిని వృథా చేయడం-ఇవన్నీ కలిపి జల సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నాయి. ప్రకృతిని మనిషి ఎంతగా మార్చితే అంతగా ప్రకృతి తన సమతుల్యతను కోల్పోతుంది.

ఇక వ్యక్తిగత స్థాయిలోనూ మార్పు అవసరం. అవసరం లేకుండా కుళాయిని తెరిచి ఉంచకూడదు. కార్లు, బైకులను ప్రతిరోజూ అధిక నీటితో కడగకూడదు. ఇంటి ప్రాంగణం, మెట్లు, రోడ్లను అవసరానికి మించి నీటితో శుభ్రం చేయకూడదు. కారుతున్న కుళాయిలను వెంటనే మరమ్మతు చేయాలి. మొక్కలకు అవసరమైనంత నీరు మాత్రమే ఇవ్వాలి. వర్షపు నీటిని సేకరించాలి. సాధ్యమైన చోట మురుగునీటిని శుద్ధి చేసి పునర్వినియోగించాలి.

అయితే వ్యక్తిగత పొదుపుతో పాటు ప్రభుత్వ విధానాల్లోనూ సమూల మార్పు అవసరం. పట్టణ ప్రణాళికలో చెరువులకు, సరస్సులకు, వర్షపు నీటి ప్రవాహ మార్గాలకు రక్షణ కల్పించాలి. కొత్త నిర్మాణాలకు వర్షపు నీటి సంరక్షణ తప్పనిసరి చేయాలి. వ్యవసాయంలో తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి ఇచ్చే పద్ధతులను ప్రోత్సహించాలి. పరిశ్రమల్లో నీటి పునర్వినియోగాన్ని పెంచాలి. పట్టణ పైపులైన్లలో నీటి లీకేజీలను తగ్గించాలి. భూగర్భ జలాల వినియోగానికి శాస్త్రీయ నియంత్రణ ఉండాలి. ఐక్యరాజ్యసమితి 2030 అజెండాలో సుస్థిర అభివృద్ధి లక్ష్యం-6 ద్వారా అందరికీ నీరు, పారిశుద్ధ్యం అందుబాటులో ఉండేలా చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ప్రపంచ ప్రస్తుత వేగంతో కొనసాగితే 2030 నాటికి నీరు, పారిశుద్ధ్యానికి సంబంధించిన లక్ష్యాలను సాధించలేమని ఐక్యరాజ్యసమితి 2024 లోనే హెచ్చరించింది. అంతేకాదు, సమగ్ర నీటి నిర్వహణ విషయంలో ప్రస్తుత పురోగతి రేటు కొనసాగితే ప్రపంచం కనీసం 2049 వరకు సుస్థిర నీటి నిర్వహణను సాధించలేకపోవచ్చని 2024 ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఇది కేవలం ఒక గణాంకం కాదు; మన విధానాల వేగం సరిపోవడం లేదనే స్పష్టమైన హెచ్చరిక. 2026లో ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన ఎస్‌డీజీ-6 సమగ్ర నివేదిక కూడా 2030 లక్ష్యాల వైపు ప్రపంచ పురోగతిని సమీక్షిస్తూ, నీరు మరియు పారిశుద్ధ్య రంగంలో వేగవంతమైన చర్యల అవసరాన్ని ముందుకు తెచ్చింది.

కాబట్టి మన ముందున్న కాలపరిమితి స్పష్టంగా కనిపిస్తోంది.



2030 నాటికి నీటి సరఫరా-డిమాండ్ మధ్య భారీ అసమతుల్యతను నివారించాల్సిన దశ. 2050 నాటికి పెరుగుతున్న నీటి డిమాండ్, జనాభా, వాతావరణ మార్పు ప్రభావాలను ఎదుర్కొనే నీటి వ్యవస్థలను నిర్మించాల్సిన దశ. 2100 నాటికి హిమనదుల క్షీణత, సముద్ర మట్టం పెరుగుదల, వాతావరణ మార్పు వంటి దీర్ఘకాలిక ప్రభావాలకు సిద్ధపడాల్సిన దశ. ఇక్కడ మరో ముఖ్యమైన విషయాన్ని గుర్తించాలి. ప్రపంచంలోని నీటిలో "కేవలం 2.7 శాతం మాత్రమే తాగదగినది" అనే సాధారణంగా ప్రచారంలో ఉన్న వాక్యం శాస్త్రీయంగా ఖచ్చితమైనది కాదు. భూమిపై ఉన్న నీటిలో దాదాపు 97 శాతం ఉప్పునీరు; మంచినీటిలో కూడా పెద్ద భాగం మంచు, హిమనదులు లేదా భూగర్భ నిల్వల్లో ఉంది. వాస్తవంగా మనిషికి సులభంగా అందుబాటులో ఉన్న వినియోగయోగ్యమైన మంచినీటి భాగం చాలా చిన్నది. ఐక్యరాజ్యసమితి తాజా సమాచారంలో భూమిపై సులభంగా అందుబాటులో ఉండే, ఉపయోగించగల మంచినీటి భాగాన్ని సుమారు 0.5 శాతంగా సూచిస్తోంది. కాబట్టి "2.7 శాతం తాగునీరు" అనే ప్రచార గణాంకం కంటే ఈ శాస్త్రీయ వివరణను ఉపయోగించడం సముచితం.

చివరికి ఒక ప్రశ్న మన ముందుంది-మన పిల్లలకు మనం ఏమి వదిలి వెళ్తాం? ఎత్తైన భవనాలా? విశాలమైన రహదారులా? ఆధునిక నగరాలా? ఇవన్నీ నీరు లేకపోతే అర్థరహితమే. మన తర్వాతి తరానికి నిండిన చెరువులు, ప్రవహించే నదులు, పచ్చని అడవులు, ఆరోగ్యకరమైన భూగర్భ జలాలు, సురక్షితమైన తాగునీరు అందించగలిగితేనే మన అభివృద్ధికి అర్థం ఉంటుంది.

2030 హెచ్చరికను 2030లో గుర్తుచేసుకోవడం కాదు-2030కు ముందే చర్య తీసుకోవాలి. 2050 ప్రమాదాన్ని 2050లో ఎదుర్కోవడం కాదు-ఈరోజే సిద్ధపడాలి. 2100 నాటికి హిమనదులు, నదులు, పర్యావరణ వ్యవస్థలపై పడే ప్రభావాన్ని తగ్గించాలంటే ఇప్పుడే ప్రకృతిని కాపాడాలి.

నీటి ప్రతి చుక్కను గౌరవించడం ఇక నైతిక బాధ్యత మాత్రమే కాదు; అది మానవ మనుగడకు సంబంధించిన అత్యవసర బాధ్యత. చెరువును కాపాడటం అంటే నీటిని కాపాడటం; అడవిని కాపాడటం అంటే వర్షాన్ని కాపాడటం; నీటిని పొదుపు చేయడం అంటే భవిష్యత్తును కాపాడటం. జల సంక్షోభం మన తలుపు తట్టే వరకు ఎదురుచూడకుండా, ఈరోజే మన జీవన విధానాన్ని మార్చుకోవాలి. అదే మన భవిష్యత్ తరాలకు ఇవ్వగలిగే నిజమైన వారసత్వం.

2.నీటి సంక్షోభం ఇక భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య మాత్రమే కాదు; ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే తీవ్రమైన పర్యావరణ, ఆర్థిక, సామాజిక సంక్షోభంగా మారింది. వాతావరణ మార్పులు, జనాభా పెరుగుదల, వేగవంతమైన పట్టణీకరణ, పరిశ్రమల విస్తరణ, భూగర్భ జలాల అధిక వినియోగం, అడవుల నరికివేత, నదులు-చెరువుల ఆక్రమణ, నీటి కాలుష్యం వంటి అనేక కారణాలు ప్రపంచ జల భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. నీరు కేవలం తాగడానికి అవసరమైన సహజ వనరు మాత్రమే కాదు. వ్యవసాయం, ఆహార ఉత్పత్తి, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి, ఆరోగ్యం, జీవవైవిధ్యం, పర్యావరణ సమతుల్యత, ఆర్థికాభివృద్ధి అన్నీ నీటితో విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయి. అందువల్ల నీటి కొరత పెరిగితే దాని ప్రభావం సమాజంలోని ప్రతి రంగంపైనా పడుతుంది.

ఐక్యరాజ్యసమితి ఇప్పటికే ప్రపంచ దేశాలను నీటి వనరుల పరిరక్షణ, సమర్థవంతమైన నీటి నిర్వహణ, పరిశుభ్రమైన తాగునీటి అందుబాటు విషయంలో పదేపదే హెచ్చరిస్తోంది. ప్రస్తుత వినియోగ ధోరణులు, వాతావరణ మార్పులు కొనసాగితే రాబోయే దశాబ్దాల్లో నీటి డిమాండ్-సరఫరా మధ్య అంతరం మరింత పెరిగే ప్రమాదం ఉంది. నీటి కొరత వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తే ఆహార భద్రతపై కూడా తీవ్ర ప్రభావం పడుతుంది. నీటి కోసం ప్రజలు వలస వెళ్లే పరిస్థితులు పెరగవచ్చు. నీటి వనరులపై ప్రాంతాల మధ్య, రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య వివాదాలు కూడా మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది.

దక్షిణాఫ్రికా సహా ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఎదురైన నీటి సంక్షోభాలు మనకు ఒక స్పష్టమైన హెచ్చరిక. నీటి సమస్య తీవ్ర స్థాయికి చేరిన తర్వాత పరిష్కారం కనుగొనడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరం. భారతదేశం కూడా ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. దేశంలో ఒకవైపు వరదలు, మరోవైపు కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వర్షపు నీటిని సమర్థవంతంగా నిల్వ చేయకపోవడం, చెరువులు-కుంటలు కనుమరుగవడం, భూగర్భ జలాలను విచక్షణారహితంగా వినియోగించడం భవిష్యత్తు నీటి భద్రతకు ప్రమాదకరంగా మారుతున్నాయి.

ఈ పరిస్థితుల్లో నీటి సంరక్షణ ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు; ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా మారాలి. వర్షపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పునర్భరణ, మురుగునీటి శుద్ధి--పునర్వినియోగం, వ్యవసాయంలో నీటి పొదుపు పద్ధతుల అమలు, పరిశ్రమల్లో నీటి వినియోగ నియంత్రణ వంటి చర్యలను విస్తృతంగా చేపట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ నీటి వనరులను కాపాడటంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ప్రతి భవనంలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ప్రోత్సహించాలి. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచే కేంద్రాలుగా పనిచేయాలి.

నీటిని అంతులేని సహజ వనరుగా భావించే రోజులు ముగిశాయి. ప్రతి చుక్క నీటిని విలువైనదిగా భావించి వినియోగించినప్పుడే భవిష్యత్ తరాలకు సురక్షితమైన జీవనాన్ని అందించగలం. నీటి సంరక్షణ అంటే కేవలం నీటిని పొదుపు చేయడం కాదు; అది ఆహార భద్రతను, ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని, ఆర్థిక వ్యవస్థను, మానవ భవిష్యత్తును రక్షించడం. కాబట్టి నీటి సమస్యను రేపటి సమస్యగా వాయిదా వేయకుండా నేటి నుంచే సమగ్ర కార్యాచరణ ప్రారంభించాలి. ప్రపంచం ఎదుర్కొంటున్న జల సంక్షోభం మనిషి ప్రకృతితో ఏర్పరచుకున్న సంబంధాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. ప్రకృతిని దోచుకోవడం కాకుండా సంరక్షించడం, నీటిని వృథా చేయడం కాకుండా పొదుపు చేయడం, వర్షాన్ని వరదగా వెళ్లనివ్వకుండా భూమిలోకి చేర్చడం, ఉపయోగించిన నీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించడం భవిష్యత్ నీటి భద్రతకు ప్రధాన మార్గాలు. ప్రభుత్వ విధానాలు, శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల భాగస్వామ్యం కలిసినప్పుడే స్థిరమైన నీటి నిర్వహణ సాధ్యమవుతుంది. అందువల్ల "నీరు ఉంటేనే జీవనం - నీరు ఉంటేనే నాగరికత" అనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. నీటిని కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడటమే. జల సంరక్షణను ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా మార్చినప్పుడే ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న నీటి సంక్షోభానికి స్థిరమైన పరిష్కారం సాధ్యమవుతుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం



## ఏఐ చిలుక పలుకులు నిజమా?
# అధికారిక రికార్డులే ఆధారమా?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సెప్టెంబర్ 29న 'అమెరికా డాట్ గవ్' అనే కొత్త ప్రభుత్వ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ప్రజలు అనేక ప్రభుత్వ శాఖల వెబ్‌సైట్లలో వెతకాల్సిన అవసరం లేకుండా, ఒకే వేదిక ద్వారా ప్రభుత్వ సమాచారం, సేవలను పొందడం దీని ఉద్దేశం. అమెరికా ప్రభుత్వ సమాచారం ఆధారంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) ద్వారా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ఈ వ్యవస్థ ప్రత్యేకత. అమెరికా జనరల్ సర్వీసెస్ అడ్మినిస్ట్రేషన్ ప్రకారం, ఈ వేదిక 29 వేలకుపైగా ప్రభుత్వ వెబ్‌సైట్లలోని సమాచారాన్ని ఉపయోగిస్తోంది.అయితే ప్రారంభమైన కొద్దిరోజుల్లోనే అసలు సమస్య బయటపడింది. ట్రంప్ రాజకీయంగా తరచూ చెప్పే కొన్ని విషయాలకు, ఈ ప్రభుత్వ ఏఐ ఇచ్చిన సమాధానాలకు తేడా కనిపించింది. ముఖ్యంగా 2020 అధ్యక్ష ఎన్నికల విషయంలో ఏఐ అధికారిక ఎన్నికల రికార్డుల ఆధారంగా జో బైడెన్‌కు 306 ఎలక్టోరల్ ఓట్లు, ట్రంప్‌కు 232 ఓట్లు వచ్చాయని పేర్కొంది. అమెరికా నేషనల్ ఆర్కైవ్స్‌లోని అధికారిక రికార్డు కూడా ఇదే ఫలితాన్ని నమోదు చేసింది.

ఇక్కడ అసలు ప్రశ్న "ట్రంప్ చెప్పింది నమ్మాలా? ఏఐ చెప్పింది నమ్మాలా?" అనేది కాదు. ఏఐ సమాధానం కూడా స్వయంగా అధికారిక ఆధారం కాదు. అది ఎక్కడి నుంచి సమాచారాన్ని తీసుకుంది? ఏ పత్రాలను ఉపయోగించింది? ఏ సమాచారాన్ని పక్కన పెట్టింది? ఏ నియమాల ప్రకారం సమాధానం రూపొందించింది? అనే ప్రశ్నలు ముందుగా అడగాలి. ఏఐకి స్వంతంగా నిజానిజాలు తెలుసుకొనే శక్తి లేదు. ఏఐకి సాంకేతిక శిక్షణ ఇచ్చే మనుషులు అందించిన సమాచారం, శిక్షణ విధానాలు, సిస్టమ్ నియమాలు, డేటా ఎంపిక, సాంకేతిక నియంత్రణల ఆధారంగానే అది సమాధానాలు రూపొందిస్తుంది.

ఇదే కారణంగా మరొక ఆందోళన కూడా తలెత్తింది. అమెరికా డాట్ గవ్ చాట్‌బాట్ మొదట కొన్ని రాజకీయ ప్రశ్నలకు అధికారిక సమాచారాన్ని ఆధారంగా చేసుకుని సమాధానాలు ఇచ్చింది. తరువాత అదే తరహా ప్రశ్నలకు "రాజకీయ వ్యాఖ్యానం ఇవ్వలేను" అంటూ సమాధానం ఇవ్వడం ప్రారంభించింది. 2020 ఎన్నికలు, జనవరి 6 ఘటన వంటి అంశాల్లో వేర్వేరు సమయాల్లో వేర్వేరు సమాధానాలు వచ్చినట్లు నివేదికలు వెలువడ్డాయి.

దీని అర్థం ఏఐని సాంకేతిక నిపుణులు కావాలనే నియంత్రించి, ప్రభుత్వ రికార్డుల్లోని నిజాలను దాచేస్తున్నారని నిర్ధారించడం కాదు. అలాంటి ఆరోపణకు ప్రస్తుతం తగిన ఆధారం లేదు. కానీ ఏఐ సమాధానాలు ఎందుకు మారుతున్నాయి? ఎవరు ఆ మార్పులు చేస్తున్నారు? ఏ నియమాలు అమలు చేస్తున్నారు? ఏ ప్రభుత్వ పత్రాలను ఏఐ ఉపయోగిస్తోంది? అనే విషయాలు ప్రజలకు పారదర్శకంగా తెలియాల్సిన అవసరం మాత్రం స్పష్టంగా ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ అధికారి, అధ్యక్షుడు, మంత్రి లేదా ఏఐ-ఎవరూ తమ మాటనే సత్యానికి తుది ప్రమాణంగా ప్రకటించుకోలేరు. ఒక నాయకుడి ప్రసంగం ఒక రాజకీయ ప్రకటన. ఏఐ సమాధానం ఒక సాంకేతిక వివరణ. కానీ అసలు ఎన్నికల ఫలితం, చట్టం, ప్రభుత్వ గణాంకం, కోర్టు తీర్పు వంటి మూల పత్రాలే మొదటి ఆధారం కావాలి. ఆ పత్రాలను స్వతంత్రంగా పరిశీలించడం మరింత మంచిది.

అయితే ప్రభుత్వ రికార్డులు కూడా తప్పులేనివని భావించడం సరికాదు. ప్రభుత్వ సంస్థలు కూడా తప్పులు చేయవచ్చు; సమాచారం అసంపూర్ణంగా ఉండవచ్చు; కొన్ని వివరాలు ఆలస్యంగా బయటకు రావచ్చు. అందుకే ఏఐ సమాధానాన్ని చివరి మాటగా కాకుండా, మూల సమాచారానికి వెళ్లే మార్గదర్శిగా మాత్రమే ఉపయోగించాలి. భవిష్యత్తులో ప్రభుత్వ సేవలు, సామాజిక భద్రత, పాస్‌పోర్టులు వంటి ముఖ్యమైన వ్యవహారాల్లో ఏఐ మరింత పెద్ద పాత్ర పోషించబోతోంది. అలాంటి సమయంలో ప్రజలు తెలుసుకోవాల్సింది ఏఐ "ఏం చెప్పింది?" అనేది మాత్రమే కాదు; "అది చెప్పడానికి ఏ ఆధారాన్ని ఉపయోగించింది?" అనేదే. ప్రజాస్వామ్యంలో నిజం ఒక నాయకుడి నోటిలోనూ, ఏఐ చిలుక పలుకుల్లోనూ ఉండదు. అది పరిశీలించగల, ధృవీకరించగల మూల ఆధారంలో ఉండాలి.

డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.



# 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- ఎంపీ ఆర్.కృష్ణయ్య

**అలంపూర్, అక్టోబర్ 10 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని ప్రభుత్వ నామినేటెడ్ పదవులతో పాటు కీలకమైన స్థానిక సంస్థల పోస్టుల్లో తక్షణమే 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలంపూర్‌లో నిర్వహించిన ఒక ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ పలు కీలక సమస్యలపై స్పందించారు. రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన అన్ని కులాలు మరియు వర్గాలకు ప్రభుత్వ పదవుల్లో సమాన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా బీసీలకు న్యాయమైన వాటా దక్కాలని, అందుకోసం 42 శాతం రిజర్వేషన్ల జీవోను వెంటనే తీసుకురావాలని ఆయన ఈ సమావేశం ద్వారా గట్టిగా డిమాండ్ చేశారు. బీసీల సంక్షేమం, హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.



# అభివృద్ధి పనులకు భూసేకరణ పనులను వేగవంతం చేయాలి

- ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.శ్రీధర్

**కొడంగల్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** అభివృద్ధి పనులకు భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కడ కార్యాలయంలో రేడియల్ రోడ్, లిఫ్ట్ ఇరిగేషన్, ఇండస్ట్రియల్ పార్క్, ఇడబ్ల్యుఐడిసి, ప్రజారోగ్యం, పంచాయతీరాజ్ మరియు రోడ్లు, భవనాల శాఖల పనులపై వికారాబాద్ , నారాయణ పేట జిల్లా కలెక్టర్ లు దీపక్ తివారీ, సిహెచ్ ప్రియాంక లతో కలిసి ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.శ్రీధర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.శ్రీధర్ మాట్లాడుతూ భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూ సేకరణ పనులు ఏవైన సమస్యలు వుంటే పరిష్కార దిశగా పనిచేస్తూ అవార్డులు ప్రకటించాలని ఆయన అధికారులకు సూచించారు. కుటుంబ తగాదాలు, ఇంకా ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే ఉమ్మడి సర్వే నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. భూసేకరణ విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఉత్సాహంగా పనిచేయాలన్నారు. భూసేకరణ చేసిన భూములకు సరిహద్దులు ఏర్పాటుతో పాటు ఫెన్సింగ్ ఏర్పాటుకు చర్యలు



తీసుకోవాలని ఆయన తెలిపారు. పంచాయతీరాజ్ మరియు రోడ్లు, భవనాల శాఖలు చేపట్టే పనులను నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలని ఆయన తెలిపారు. అంగన్వాడీ, పాఠశాల, గ్రామ పంచాయతీ, మహిళా సంఘాల భవనాలు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని అధికారులకు సూచించారు . రోడ్ల విస్తరణ పనుల్లో ఇండ్లు కోల్పోయే వారికి ప్లాట్ల కేటాయింపుకు స్థల సేకరణ చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇడబ్ల్యుఐడిసి చేపట్టే పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.మున్సిపల్ పరిధిలో చేపట్టిన పనులు డిసెంబర్ మాసంలోగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రోడ్లు, మంచినీటి సరఫరా, మురుగు కాలువల నిర్మాణం, సుందరీకరణ పనులు చేపట్టాలని ఆయన తెలిపారు. పనులు నాణ్యత యుతంగా చేపట్టే విధంగా అధికారులు పర్యవేక్షించి పరిశీలించాలని ఆయన అధికారులను ఆదేశించారు.నవంబర్ మాసంలో హకీం పేటలో నిర్వహించే వ్యవసాయ అనుబంధ శాఖల రాష్ట్ర స్థాయి మేళాకు అధికారులు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు.ముందుగా ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.శ్రీధర్ కొడంగల్ లో చేపడుతున్న వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణ పనులను పరిశీలించారు. దేవాలయానికి వెళ్ళే రోడ్డు పనులతో పాటు అంతర్గత రోడ్ల పనులను వేగవంతం చేస్తూ పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమా శంకర్ ప్రసాద్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జడ్పీ సీఈఓ సుధీర్, ఆర్డీఓలు వాసు చంద్ర, అనిత సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై అధికారుల మౌనం..!

- ఫోన్ చేస్తే 'నాట్ కవరేజ్ ఏరియా'.. ఫిర్యాదులపై స్పందన కరువు
- నిన్నటి వార్తతో తలతిప్పుకుంటున్నారా..?
- అధికారుల తీరుపై విమర్శలు

**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** అక్రమ నిర్మాణాలపై వరుసగా ఫిర్యాదులు వస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యపై వివరణ కోరేందుకు ఫోన్ చేస్తే ఒక్కోసారి ఫోన్ స్విచ్‌ఆఫ్, మరికొన్ని సందర్భాల్లో 'నాట్ కవరేజ్ ఏరియా' అంటూ పొంతనలేని సమాధానాలు వినిపిస్తున్నాయని స్థానికులు, ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలపై జనం సాక్షిలో నిన్న ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించాల్సి ఉండగా, సమాధానం ఇవ్వకుండా తలతిప్పుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించకపోవడంతో అధికారుల వ్యవహారశైలిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ఫిర్యాదులపై విచారణ ఎప్పుడు?

అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి వాస్తవాలను




వెల్లడించాల్సిన అధికారులు అందుబాటులో లేకపోవడం, ఫోన్ స్పందనలు సరిగా లేకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు జరుగుతున్నాయా? ఫిర్యాదులపై అధికారులు ఏ చర్యలు తీసుకున్నారు? అన్నదానిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.ప్రజల ఫిర్యాదులకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, అక్రమ నిర్మాణాలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# "నో డ్రగ్స్-సేవ్ తెలంగాణ" పోస్టర్ ఆవిష్కరణ

- రాయదుర్గం పరిధిలో ఈ నెల 26న అవగాహన సదస్సు

**రాయదుర్గం, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** తెలంగాణ యువత ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "నో డ్రగ్స్ – సేవ్ తెలంగాణ" అవగాహన కార్యక్రమంలో భాగంగా, మద్యం మత్తు, గంజాయి, డ్రగ్స్, అమ్మాయిల వేధింపులు, సైబర్ క్రైమ్ వంటి సామాజిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ నెల 26వ తేదీన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ యువత రాష్ట్ర అధ్యక్షులు ఇమ్మడి సతీష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రాయదుర్గం సీఐ భూపతి ట్రాఫిక్ సీఐ పవన్ కుమార్ ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ యువత రాష్ట్ర అధ్యక్షులు ఇమ్మడి సతీష్ మాట్లాడుతూ, యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడంతో పాటు, మహిళలు మరియు బాలికల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన, సామాజిక బాధ్యత వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, షాపింగ్ మరియు వ్యాపార సంస్థల సిబ్బంది, స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని



విజయవంతం చేయాలని తెలంగాణ యువత తరఫున పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ యువత రాష్ట్ర అధ్యక్షులు ఇమ్మడి సతీష్, జనరల్ సెక్రటరీ మల్లికార్జున, రాయదుర్గం సీఐ భూపతి, ట్రాఫిక్ సీఐ పవన్ కుమార్, డాక్టర్ ప్రదీప్ బొజ్జ, నవీన్ తదితరులు పాల్గొన్నారు. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం సీఐ భూపతి గారు, ట్రాఫిక్ సీఐ పవన్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు, యువత, వ్యాపారస్తులు మరియు విద్యార్థులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొని "నో డ్రగ్స్ – సేవ్ తెలంగాణ" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# నిమ్స్ ఆసుపత్రిలో సకాలంలో వైద్య సేవలు

- రోగుల కోసం 24/7 ప్రత్యేక హెల్ప్‌లైన్

**ఖైరతాబాద్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** రోగులకు మెరుగైన సమన్వయం, తక్షణ మార్గదర్శకత్వం, సకాలంలో వైద్య సేవలు అందించేందుకు నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)లో 24 గంటలు, వారంలో ఏడు రోజులు పనిచేసే ప్రత్యేక హెల్ప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రజా ప్రతినిధులు, వారి వ్యక్తిగత కార్యదర్శులు(పీఎస్), వ్యక్తిగత సహాయకులు(పీఏ) ఈ సేవలను విని యోగించుకోవచ్చని నిమ్స్ యాజమాన్యం తెలిపిం ది.రోగుల రిఫరల్స్, అడ్మిషన్లు,అత్యవసర పరిస్థి తులు, వైద్య సేవలకు సంబంధించిన సహాయం తదితర అంశాలపై సంబంధిత అధికారులను సంప్రదించవచ్చని పేర్కొంది. 24/7 హెల్ప్‌లైన్ నంబర్లు, హాట్‌లైన్ 040–2348–9692 (ఆర్ఎం వో) డ్యూటీ మొబైల్ 9490296073 డైరెక్టర్ డ్యూటీ మొబైల్: 9490076060, సమన్వయం కోసం అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్లు డా.ఎన్.రాకేష్ 9490295048, డా.ఎం.చరణ్ రాజ్ 9490295057, డా.సయ్యద్ సల్మాన్ 9398979541, డా.పుష్పి రాణి (6305808940) అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజా ప్రతినిధుల ద్వారా రిఫర్ చేయబడిన రోగి పేరు, సంప్రదింపు నంబర్‌తో పాటు మెడికల్ రికార్డులను డ్యూటీ ఆర్ఎంవో మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపి, అనంతరం ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. ఈ ప్రత్యేక సమన్వయ వ్యవస్థను అడిషనల్ మెడికల్ సూపరింటెండెంట్, అడిషనల్ ప్రొఫెసర్ డా.కాశిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి(9490295004) పర్యవేక్షిస్తారు. రోగుల సంరక్షణ, సంక్షేమం, వైద్య సేవలకు సంబంధించిన ప్రతి అంశంలో నిమ్స్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అందుబాటులో ఉంటుందని మెడికల్ సూపరింటెండెంట్ డా.నిమ్మ సత్యనారాయణ తెలిపారు. ప్రజా ప్రతినిధులు ఈ ప్రత్యేక సేవలను సద్వినియోగం చేసుకుని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో సహకరించాలని నిమ్స్ యాజమాన్యం కోరింది.

## ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులు నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలి



**దుద్యాల, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** నిర్మాణ పనులలో అలసత్వం వహించకుండా వేగవంతంగా చేపట్టాలని ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం దుద్యాల మండలం హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్ లో భవన నిర్మాణాలు, రోడ్ల విస్తరణ పనులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తో కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ మాట్లాడుతూ ఎడ్యుకేషన్ హబ్ లో చేపడుతున్న నిర్మాణ పనులన్ని నాణ్యతో పాటు వేగవంతంగా పనులు పూర్తి చేయాలన్నారు.నిర్దేశించిన లక్ష్యం మేరకు పనుల పురోగతి ఉండాలన్నారు.ప్రతి బ్లాక్ కు సంబందించిన ప్లాన్ ను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు.ఆయా వెంట అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, జెడ్పి సీఇఓ సుదీర్,ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

# మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలి

- నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలి
- ఎల్బీనగర్ శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి

**ఎల్బీనగర్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చైతన్యపురి డివిజన్‌లోని న్యూ దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉచిత కుట్టు, బ్యూటీషియన్, మెహందీ శిక్షణను పూర్తి చేసిన మహిళలకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ట్రస్ట్ చైర్మన్ కమల సుధీర్‌రెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళ చేతిలో నైపుణ్యం ఉంటే కుటుంబం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుందని, కుటుంబాలు అభివృద్ధి చెందితే సమాజం కూడా పురోగతి సాధిస్తుందని అన్నారు. మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకునేలా ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుట్టులో ప్రాథమిక స్థాయి నుంచి ఆధునిక పద్ధతుల వరకు, బ్యూటీషియన్, మెహందీ తదితర ఉపాధికి ఉపయోగపడే కోర్సుల్లో శిక్షణ



అందిస్తున్నామని చెప్పారు. మహిళల నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబన కోసం భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు, నర్సిరెడ్డి, రాపోలు సుధాకర్, విశ్వప్రేమ్, శివప్రకాష్, నాగలక్ష్మి, జయశ్రీ, శోభారాణి, ట్రైనర్లు సునీత, భానుప్రియ, శివబిందు, అర్చన, ట్రస్ట్ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, శిక్షణ పొందిన మహిళలు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాల కూల్చివేత



**మల్కాజిగిరి, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** మల్కాజిగిరి జోన్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అనధికార నిర్మాణాలు, అక్రమ అదనపు అంతస్తులపై మల్కాజిగిరి, మౌలాలి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలను మంగళవారం కూల్చివేశారు.మౌలాలీ సర్కిల్ పరిధిలోని సింహాద్రి నగర్‌లో ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా చేపట్టిన ఓ భవన నిర్మాణ స్లాబులను తొలగించారు. అదేవిధంగా మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, పీవీఎన్ కాలనీల్లో అనుమతికి మించి అక్రమంగా నిర్మించిన అదనపు అంతస్తులను కూల్చివేసి, పనులను పూర్తిగా నిలిపివేయించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ. జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. భవన నిర్మాణాలు ప్రారంభించే ముందు తప్పనిసరిగా ఎంఎంసీ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనుమతి తీసుకున్న ప్లాన్‌కు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించినా, నిబంధనలు అతిక్రమించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొల్చివేతల్లో మౌలాలి డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు, విజయ్, కుమార్, ప్రజ్వల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నల్సార్ జంక్షన్‌లో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతపై అవగాహన

**శామీర్‌పేట్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** శామీర్‌పేట్ లోని బ్లాక్ స్పాట్‌గా గుర్తించబడిన నల్సార్ జంక్షన్‌లో "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతపై ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను నివారించి, రోడ్డు వినియోగదారుల్లో భద్రతా అవగాహన పెంపొందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్య మన్నారు.ఈ సందర్భంగా రోడ్డు వినియోగదారులకు ట్రాఫిక్ నిబంధనలు, లేన్ క్రమశిక్షణ, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగం, వాహనం నడుపు తున్నప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించక పోవడం, వేగ నియంత్రణ, పాదచారుల భద్రత, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ గురించి అవగాహన కల్పించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం, అత్యవసర వాహనాలకు దారి ఇవ్వడం, జంక్షన్లు మరియు పాదచారుల క్రాసింగ్‌ల వద్ద అప్ర మత్తంగా ఉండడం వంటి అంశాలపై సూచనలు చేశారు.సురక్షితమైన రోడ్డు ప్రవర్తనను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి, అమూల్యమైన ప్రాణాలను కాపాడవచ్చని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో షామీర్‌పేట్ డీఐ వై. మహేష్, అల్వాల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి. పవన్ కుమార్ రెడ్డి, అల్వాల్ ట్రాఫిక్ అదనపు ఇన్‌స్పెక్టర్ జి. జనకీ రాములు పాల్గొన్నారు.



# రాష్ట్రపతి భవన్‌లో తెలంగాణ నకాష్ కళా వైభవం

- చేర్యాల స్క్రోల్ పెయింటింగ్‌కు జాతీయ గౌరవం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా నకాష్ కళాకారులకు సన్మానం

**బోడుప్పల్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** శతాబ్దాల నాటి తెలంగాణ సంప్రదాయ కళారూపమైన చేర్యాల స్క్రోల్ పెయింటింగ్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణకు చెందిన ప్రముఖ నకాష్ కళాకారులు ధనలకోట నాగేశ్వర్, ధనలకోట సాయికిరణ్, ధనలకోట శ్రవణ్ కుమార్ రాష్ట్రపతి భవన్‌లో తెలంగాణ నకాష్ కళా వైభవాన్ని ప్రదర్శించి రాష్ట్రానికి విశిష్ట గుర్తింపు తీసుకువచ్చారు. రాష్ట్రపతి భవన్‌లో సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 5 వరకు నిర్వహించిన ప్రతిష్టాత్మక అర్టిస్ట్ ఇన్ రెసిడెన్సీ కార్యక్రమంలో తెలంగాణ నకాష్ కళాకారులు పాల్గొన్నారు. 'వికసిత్ భారత్' ఇతివృత్తాన్ని ఆధారంగా చేసుకుని చేర్యాల చిత్రకళకు ప్రత్యేకమైన రంగులు, ఆకృతులు, కథన శైలితో పలు కళాఖండాలను రూపొందించారు. భారతదేశ సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాలు, ప్రజాజీవనం, వైవిధ్యం, సాంస్కృతిక ఏకత్వాన్ని తమ కళాకృతుల్లో ఆవిష్కరించారు.

### రాష్ట్రపతి చేతుల మీదుగా ఘన సన్మానం

అక్టోబర్ 5న రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా తెలంగాణ నకాష్ కళాకారులు సన్మానం అందుకున్నారు. రాష్ట్రపతి భవన్ వంటి అత్యున్నత జాతీయ వేదికపై చేర్యాల చిత్రకళను ప్రదర్శించి, అనంతరం రాష్ట్రపతి చేతుల మీదుగా గౌరవం అందుకోవడం నకాష్ కళా సమాజానికి విశిష్ట ఘట్టంగా నిలిచింది. ఈ గౌరవం ముగ్గురు కళాకారుల వ్యక్తిగత విజయమే కాకుండా, తరతరాలుగా చేర్యాల చిత్రకళా సంప్రదాయాన్ని కాపాడుకుంటూ వస్తున్న నకాష్ కళాకారుల సమాజానికి దక్కిన జాతీయ గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర నకాష్ సంఘం పేర్కొంది.

### భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయకం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం రాష్ట్రపతి భవన్ వంటి జాతీయ వేదికపై తెలంగాణ నకాష్ కళాకారులకు ఇంతటి గుర్తింపు లభించడం కళా సమాజానికి గర్వకారణమని సంఘం ప్రతినిధులు తెలిపారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన చేర్యాల కళను జాతీయ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా భవిష్యత్



తరాలకు స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర నకాష్ సంఘం అధ్యక్షులు రాచర్ల కేశవరావు, అసోసియేట్ అధ్యక్షులు కె. అశోక్ కుమార్, ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు, శ్రీ మాతా నిమిషాంబ దేవి ఆలయ ట్రస్ట్ చైర్మన్ కామరౌతు వినోద్ కుమార్ వర్మ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో తెలంగాణ నకాష్ కళా వైభవాన్ని చాటిన ధనలకోట నాగేశ్వర్, ధనలకోట సాయికిరణ్, ధనలకోట శ్రవణ్ కుమార్‌లకు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
07 అక్టోబర్ 2026

# ఉపాధ్యాయులు గైర్హాజరైతే చర్యలు తప్పవు

- ఉపాధ్యాయుల హాజరుపై రోజువారీ నివేదిక ఇవ్వాలి
- ఎఫ్ఎల్ఎన్ పాఠశాలల్లో అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** ఉపాధ్యాయులు పాఠశాలలకు గైరాజర్ అయితే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, సీహెచ్ఎంలు, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల అమలు, పాఠశాలల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల అభ్యసన స్థాయిలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఎఫ్ఎల్ఎన్ (ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం) కాంపిటెంట్ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శించి బోధన, ఉపాధ్యాయులు--విద్యార్థుల హాజరు, అభ్యసన స్థాయిలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయుల హాజరును ముఖ గుర్తింపు విధానం ద్వారా క్రమం తప్పకుండా నమోదు చేయాలని, దానికి సంబంధించిన రోజువారీ నివేదికను సమర్పించాలన్నారు. పాఠశాలలకు గైర్హాజరయ్యే ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే సోమవారం నుంచి జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల ముఖ గుర్తింపు హాజరు స్పష్టంగా ఉండాలని, హాజరు నమోదులో ఎలాంటి అవకతవకలు, నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల ద్వారా ప్రతి విద్యార్థి తన తరగతి స్థాయికి అనుగుణంగా చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. విద్యార్థుల అభ్యసన స్థాయులను ఎప్పటికప్పుడు అంచనా వేసి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.
పాఠశాలల పనితీరు, విద్యార్థుల అభ్యసన ఫలితాలను నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన చోట తక్షణమే మెరుగుదల చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఎంఈఓలు, సీహెచ్ఎంలు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి రోహిణి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు, ఎంఈఓలు, సీహెచ్ఎంలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గిన్నిస్ రికార్డుతో మెదక్ ఖ్యాతి చాటిన మహేష్ గౌడ్



**చిలప్‌చేడ్, అక్టోబర్ 5 (జనంసాక్షి) :** కరాటే విభాగంలో ప్రతిభ చాటుతూ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించిన ఉమ్మడి కౌడిపల్లి మండలం ప్రస్తుత చిలప్ చేడ్ మండలం అంతరం గ్రామానికి చెందిన కరాటే మాస్టర్ కాలాలి మహేష్ గౌడ్‌కు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఘన సన్మానం చేశారు. సోమవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన మహేష్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి, ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి కరాటే విభాగంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించడం గర్వకారణమని అన్నారు. మహేష్ గౌడ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి నర్సాపూర్ నియోజకవర్గంతో పాటు మెదక్ జిల్లాకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### 2 వేల మందితో ఏకకాలంలో కరాటే ప్రదర్శన

హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన కరాటే ప్రదర్శన పోటీల్లో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 2,000 మందికి పైగా మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు ఏకకాలంలో పాల్గొని ప్రదర్శన ఇవ్వడంతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నమోదైనట్లు మహేష్ గౌడ్, ఆయన తండ్రి కాలాలి దుర్గా గౌడ్ తెలిపారు. ఈ ఘనత సాధించడంలో అకాడమీ ఫౌండర్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జామినర్, ఇంటర్నేషనల్ రెఫ్రీ, కిక్‌బాక్సింగ్ గ్రాండ్ మాస్టర్ ఎన్. పోచయ్య అందించిన మార్గదర్శకత్వం, కృషి ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంతరం గ్రామ సర్పంచ్ పంబాల భాగ్యలక్ష్మి బుర్రేశు, ఉప సర్పంచ్ యాదయ్య, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సామాన్య నాయక్, ఉపాధ్యక్షుడు నరహరి, గ్రామ పెద్ద కుమ్మరి యాదయ్యతో పాటు పలువురు మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## జనంసాక్షి కథనంతో కదిలిన విద్యాశాఖ అధికారి



**రాజాపూర్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో ఉన్న అను మాడల్ పాఠశాల నిర్వహిస్తున్న భవనం, పాఠశాల భవనానికి ఉండవలసిన విద్యాశాఖ నిబంధనల ప్రకారం లేదని, విద్యార్థులకు రక్షణ, మౌలిక సదుపాయాలు కూడా లేకుండా కొనసాగుతున్నదని జనంసాక్షి వార్తా పత్రికలో వచ్చిన కథనానికి మండల విద్యాశాఖ అధికారి మంగళవారం అను మాడల్ పాఠశాల భవనాన్ని పరిశీలించి షోకాజ్ నోటీసు పాఠశాల యాజమాన్యానికి ఇచ్చారు. ఆగస్టు 3న మొదటి నోటీసు ఇచ్చినా అను మాడల్ పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తున్నారని, మంగళవారం రెండో నోటీసు ఇచ్చామని మండల విద్యాశాఖ అధికారి తెలిపారు.

## పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**బెజ్జంకి, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్,మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా 65 మంది లబ్ధిదారులకు రూ.25 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు,41 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ప్రజాపాలన సాగిస్తోంది అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం వైద్య ఖర్చులకు ఎక్కువ మొత్తంలో ఆర్థిక సాయం అందిస్తోంది అనీ అన్నారు.పేదలకు సన్నబియ్యం,ఇందిరమ్మ ఇళ్లు,ఉచిత విద్యుత్,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాలను అమలు చేస్తోంది అనీ అన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది అనీ అన్నారు.కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్,జిల్లా కార్యదర్శి అక్కర వేణి పోచయ్య,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్,మాజీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి,మార్కెట్ వైస్ చైర్మన్ చిలువేరి శ్రీనివాస్ రెడ్డి,సర్పంచులు గుర్రాల బాల్ నరసింహారెడ్డి, పులి రమేష్, గండికోట సురేష్, శనగొండ శరత్, తిరుపతి, పర్ష సంతోష్,బైర సంతోష్,కుక్కల రాములు,రావుల నర్సయ్య,ఇష్కిల్లా ఐలయ్య,బోనగం రమేష్,వివిధ గ్రామాల అధ్యక్షులు,డైరెక్టర్లు, మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## అచ్చంపేట ట్రెజరీ కార్యాలయంలో ఏసీబీ వల

- రూ.25 వేల లంచం డిమాండ్
- సీనియర్ అకౌంటెంట్ అరెస్టు



**అచ్చంపేట, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** అచ్చంపేట సబ్ డివిజనల్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్ లంచం తీసుకున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. లంచం డిమాండ్ చేసి స్వీకరించిన ఆరోపణలపై సీనియర్ అకౌంటెంట్ కందాడ వెంకటయ్యపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) క్రిమినల్ దుష్ప్రవర్తన కేసు నమోదు చేసింది. ఏసీబీ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. ఫిర్యాదుదారుడి వైద్య సెలవు, సంబంధిత బిల్లుల ప్రాసెసింగ్ కోసం సీనియర్ అకౌంటెంట్ రూ.25 వేల లంచాన్ని డిమాండ్ చేసినట్లు పేర్కొంది. ఇందులో భాగంగా ఆగస్టు 14న రూ.3 వేల నగదు, మిగిలిన రూ.22 వేలను ఆగస్టు 18న ఫోన్‌పే ద్వారా చెల్లించినట్లు ఏసీబీ తెలిపింది. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ.. అధికారిక విధుల నిర్వహణలో నిందితుడు అక్రమంగా, నిజాయితీకి విరుద్ధంగా వ్యవహరించి తనకు అనుచిత ప్రయోజనం పొందాలనే ఉద్దేశంతో లంచం స్వీకరించినట్లు ఏసీబీ పేర్కొంది. నిందితుడిని నాంపల్లిలోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ వెల్లడించింది. కేసు దర్యాప్తు కొనసాగుతోందని తెలిపింది. ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా వెల్లడించలేదు.

### లంచం అడిగితే 1064కు సమాచారం

ప్రభుత్వ ఉద్యోగి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని ఏసీబీ సూచించింది. అలాగే వాట్సాప్ 9440446106 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

## మట్టి పరీక్షా కేంద్రం పనులు త్వరగా పూర్తి చేయాలి



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం సమీపంలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన మట్టి పరీక్షా కేంద్ర భవనాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా భవన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్ ఇప్పటివరకు పూర్తయిన పనులు, ఇంకా చేపట్టాల్సిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసార పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన పరికరాల ఏర్పాటుపై వ్యవసాయ శాఖ అధికారులతో చర్చించారు. మట్టి పరీక్షా కేంద్రానికి సంబంధించి మిగిలిన పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులకు అవసరమైన నిధులను త్వరగా విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని, కేంద్రం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. భవనంలో అవసరమైన మరమ్మతులను గుర్తించి, వాటికి సంబంధించిన అంచనాలను సిద్ధం చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న స్థలాన్ని సక్రమంగా వినియోగించుకుంటూ మట్టి పరీక్షా కేంద్రానికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మిగిలిన పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి, మట్టి పరీక్షా కేంద్రాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలపై రైతుల ఆందోళన

- ఏఈతో సబ్‌స్టేషన్‌లో వాగ్వాదం



**రామాయంపేట, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** రామాయంపేట తమకు విద్యుత్ సరిగ్గా రావడం లేదంటూ కోనాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామస్తులు మండిపడ్డారు మంగళవారం సబ్ స్టేషన్ కు చేరుకున్న రైతులు ఏఈ తిరుపతిరెడ్డి తో వాగ్వాదానికి దిగారు తమకు ప్రభుత్వం ఇచ్చే తొమ్మిది గంటల విద్యుత్ లో కనీసం రెండు గంటలు కూడా రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చే కరెంటు ఏదో నీరు గారడంలా ఇస్తే తమకు ఈ బాధలు తప్పవని పేర్కొన్నారు. ప్రతిరోజు విద్యుత్ వల్ల మోటార్లు కాలిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. తమకు నిరగడం గా విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. దీంతో ఏఈ తిరుపతిరెడ్డి రైతులకు నచ్చజెప్పి రెండు రోజుల్లో విద్యుత్ సక్రమంగా అందిస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతులు సంజీవరెడ్డి. విద్యాసాగర్. బిక్షపతి. బీరయ్య. హరి కిషన్. తదితరులున్నారు.

## వరి పంటలో పురుగు, తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



**కొల్చారం, అక్టోబర్ 06 (జనం సాక్షి) :** కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి, వెంకటాపూర్, కొల్చారం గ్రామాల్లో వ్యవసాయ వరి పంటలను పరిశీలించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి తెలిపారు. పంటల్లో దోమపోటు, మెడ విరుపు తెగులు, కంకినల్లి, ఫాల్ ఆర్మీవర్మ్ తదితర పురుగు, తెగుళ్లను గుర్తించడం జరిగిందన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండి ప్రారంభ దశలోనే వాటిని గుర్తించి సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని ఏవో సూచించారు. ముఖ్యంగా వరి పూత దశలో, కంకి బయటకు వచ్చే సమయంలో మెడ విరుపు తెగులు సోకే అవకాశం ఉన్నందున రైతులు పంటను నిశితంగా పరిశీలించాలన్నారు. తెగులు ప్రారంభ లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సకాలంలో మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఆలస్యం చేయకుండా నివారణ చర్యలు చేపడితే పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి తెలిపారు.

## మానసిక నిపుణులకు జాతీయ అవార్డులు



**సంగారెడ్డి, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సమాజంలో మానసిక సమస్యల నివారణ, మనోవికాసం, మూఢనమ్మకాల నిర్మూలనకు విశేష కృషి చేసిన పలువురు మానసిక నిపుణులు, మేజీషియన్లకు డాక్టర్ బి.వి. పట్టాభిరామ్ స్మారక జాతీయ స్థాయి పురస్కారాలు-2026కు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఏ. కరీం, తెలంగాణ మ్యాజిక్ అకాడమీ అధ్యక్షుడు మర్రి రమేష్, చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రమణ నాయక్ బానోతు తదితరులు అవార్డు గ్రహీతల వివరాలతో కూడిన బ్రోచర్‌ను విడుదల చేశారు. బెస్ట్ సీనియర్ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్‌గా డాక్టర్ జి. రాజేశ్వరరావు, బెస్ట్ సూపర్ సీనియర్ జనరల్ ఫిజీషియన్‌గా మహమ్మద్ రాహతుల్లా, బెస్ట్ సైకాలజిస్టులుగా డాక్టర్ గర్రె శంకరరావు, డాక్టర్ సి. సుబ్బారెడ్డి, డాక్టర్ అనిత జ్యోతి, బెస్ట్ మైండ్ పవర్ మోటివేషనల్ స్పీకర్‌గా డాక్టర్ మొహమ్మద్ ఆజం అలీ తదితరులు ఎంపికయ్యారు. అక్టోబర్ 8న హైదరాబాద్ నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించే ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేయనున్నట్లు డాక్టర్ ఎం.ఏ. కరీం తెలిపారు.

## రైతులకు వేరుశనగ విత్తనాలు వెంటనే పంపిణీ చేయాలి

- వ్యవసాయ అధికారి దీప్తికి వినతి పత్రం అందజేత



**ఊర్కొండ, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** రైతులకు వేరుశనగ విత్తనాలను వెంటనే పంపిణీ చేయాలని కోరుతూ ఊర్కొండ మండల రైతులు సోమవారం మండల వ్యవసాయ అధికారి దీప్తికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సీజన్ ప్రారంభం కావడంతో వేరుశనగ విత్తనాలకు డిమాండ్ పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలను త్వరగా సరఫరా చేస్తే సకాలంలో విత్తుకునేందుకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అధికారులు స్పందించి నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. పిఏసిఎస్ ఊరుకొండ గోదాములు వేరుసెనగ విత్తనాలు అందుబాటులో ఉన్న రైతులకు సకాలంలో పంపిణీ చేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వినతి పత్రాన్ని స్వీకరించిన వ్యవసాయ అధికారి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నిరంజన్ గౌడ్, తాడెం చిన్న, తిరుపతి రెడ్డి,మండలంలోని అన్ని గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్
- సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా, వినతి



**చేర్యాల, అక్టోబర్ 10 (జనంసాక్షి) :** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం చేర్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శ్రీవాస్య సందీప్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రసాదించిన స్వతంత్ర ఎన్నికల వ్యవస్థను కాపాడాల్సిన సీఈసీ కేంద్ర బిజెపి ప్రభుత్వానికి కీలుబొమ్మగా పనిచేస్తూ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో ఓటర్ల జాబితాలో అక్రమాలు, ప్రతిపక్ష పార్టీల ఫిర్యాదులపై స్పందించకపోవడం, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడంపై ప్రజల్లో ఎన్నికల సంఘంపై విశ్వాసం సన్నగిల్లుతోందని ఆయన అన్నారు. దేశంలో ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో నాయకుల లక్షలాది ఓట్లను తొలగించిందని పండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం 2002 సంవత్సరం ప్రమాణికం నిబంధన పెట్టి ఓటర్లను అనేక ఇబ్బందుల పాలు చేశారని అన్నారు. రాజ్యాంగబద్ధ సంస్థ అధిపతిగా నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన బాధ్యతను విస్మరించిన జ్ఞానేష్ కుమార్ ను తక్షణమే తొలగించాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, కుడిక్యాల బాల్ మోహన్, నంగి కనకయ్య, పొన్నబోయిన మమత, గూడెపు సుదర్శన్, మనెపల్లి కిష్టయ్య, నంగి సత్తయ్య, గోమారపు నర్సయ్య, సిద్దిరాం భద్రయ్య, బండారి శ్రీనివాస్, చరణ్, రాజు, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ కోతలపై రైతుల ధర్నా

▫ మద్దతు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ



**నెక్కొండ అక్టోబర్ 6 (జనంసాక్షి) :** నెక్కొండ మండల కేంద్రంలోని రెడ్లవాడ గ్రామపంచాయతీ పరిధిలోని ఐదు గ్రామ పంచాయతీ పరిధిలో రైతులందరూ కరెంట్ కోతలు నిరసిస్తూ సమయానికి కరెంట్ అందక పంటలు ఎండిపోయి వరి పంట చేతికి వచ్చే సమయానికి ఎండిపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ సబ్ స్టేషన్ ఎదురుగా రైతులు ధర్నాకు దిగారు కరెంట్ కోతలు లేకుండా సమయానికి కరెంటు ఇవ్వాలని పంటలు ఎండిపోకుండా చూడాలని రైతులను ఆదుకోవాలని కరెంట్ అధికారులను వేడుకున్నారు. రెడ్లవాడ సబ్‌స్టేషన్ ఎదుట విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులు నిర్వహించిన ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పంచాయతీ రాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యులు, మాజీ ఎంపీపీ గటిక అజయ్ కుమార్, నెక్కొండ మండల పార్టీ అధ్యక్షులు సంగని సూరయ్య , మాజీ స్టేట్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ సూరం రాజిరెడ్డి , రెడ్లవాడ సర్పంచ్ దగ్గు గాంధీ, మాజీ సర్పంచ్ బొల్లెబోయిన వీరస్వామి, అజ్మీర మాంగ్య తండా సర్పంచ్ మాలోత్ వెంకట్ , మాజీ సర్పంచ్ గొట్లకొండ కొనసోటు వెంకన్న, రెడ్లవాడ మాజీ సర్పంచ్ రావుల ప్రసాద్, అలంకానిపేట మాజీ సర్పంచ్ మాదాసు రవి, గౌడ సంఘ నాయకులు కారింగుల సురేష్, నెక్కొండ మాజీ ఉపసర్పంచ్ దేవనబోయిన వీరభద్రం, పోలిశెట్టి సత్యం, సీనియర్ నాయకులు ఈదునూరి వెంకన్న, అజ్మీర మాంగ్య తండా గ్రామ పార్టీ అధ్యక్షులు బానోతు ప్రవీణ్, ఉపసర్పంచ్ అజ్మీర సుమన్ నాయక్, వార్డు మెంబర్ మాలోత్ వసంత వెంకన్న, మాజీ ఉపసర్పంచ్ సపావత్ మురళి, గొట్లకొండ గ్రామ పార్టీ అధ్యక్షులు భూక్య రమేష్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌జెండర్లకు ఉపాధి అవకాశాలు కల్పిద్దాం

▫ సీనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ

▫ ట్రాన్స్ జెండర్ హక్కుల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం




**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 06 (జనం సాక్షి) :** సుబేదారిలోని అసంత భవన్ నందు ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ, మోడరన్ అవేర్నెస్ సొసైటీ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ వరంగల్ పోలీస్ కమిషనరేట్ సంయుక్తంగా ట్రాంజెండర్ కమ్యూనిటీకి మానవ అక్రమ రవాణా నిర్మూలన మరియు ట్రాంజెండర్ హక్కుల పరిరక్షణ పైన అవగాహన కార్యక్రమాన్ని సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ హాజరై మాట్లాడుతూ సమాజంలో ఇంకా ట్రాంజెండర్ వ్యక్తులపైన వివక్షత కొనసాగుతుందని అంతేగాకుండా ఈ మధ్యకాలంలో నకిలీ ట్రాంజెండర్స్ వలన ట్రాంజెండర్ కమ్యూనిటీకి చెడ్డ పేరు రావడం జరుగుతుందని కాబట్టి నిజమైన ట్రాంజెండర్ వ్యక్తులు ఆ నకిలీ ట్రంజెండర్ వ్యక్తులను గుర్తించి సమాజంలో గౌరవంగా ఉండేటట్లు చూడాలని కోరారు. అంతేకాకుండా ట్రాంజెండర్ వ్యక్తులకు ప్రభుత్వంలోని వివిధ పథకాల ద్వారా అందుతున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు మరి ముఖ్యంగా ట్రాంజెండర్ వ్యక్తులలో చదువుకున్న వారు అర్హత కలిగిన వారికి ఆయా ప్రభుత్వ శాఖలతో పాటు మిగతా సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వివిధ ప్రభుత్వ అధికారులకు సూచించారు. సమాజంలో అనేక రకాలుగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సమాజం ట్రాంజెండర్ వ్యక్తులను ఆదరించి తగిన ఉద్యోగ అవకాశాలు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. కేవలము ఉద్యోగ అవకాశాలు కాకుండా ట్రాంజెండర్ వ్యక్తులు స్వయం ఉపాధి మార్గాలను నైపుణ్య శిక్షణలను పొంది సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని కోరారు. ఎవరైనా మీకు ,మీ యొక్క హక్కులకు భంగం కలిగించినట్లయితే తప్పనిసరిగా జిల్లా న్యాయ సేవా సంస్థలను ఆశ్రయిస్తే తగిన సహాయ సహకారాలు అందించి అట్టి వ్యక్తులపైన చర్యలు తీసుకోబడుతుందని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ఇన్స్పెక్టర్ ట్రాంజెండర్స్ ప్రొటెక్షన్ సెల్ ఇన్చార్జి ఓ.రమేష్ హాజరై మాట్లాడుతూ "తెలంగాణ పోలీస్ విమెన్ సేఫ్టీ విభాగం ద్వారా ద్వారా ట్రాంజెండర్ వ్యక్తుల హక్కుల పరిరక్షణ కొరకై ప్రైడ్ ప్లేస్ పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాల నందు సంక్షేమ అధికారి విశ్వాజ , ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ తో పాటు ట్రాంజెండర్ కమ్యూనిటీ నాయకులు లైలా, మరియు ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్ మానవ అక్రమ రవాణా పైన ట్రాంజెండర్ వ్యక్తుల హక్కుల పరిరక్షణ పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫిక్ యూనిట్ ఎస్సైలు శ్రావణి, సుధాకర్, ఏ.ఎస్.ఐ.భాగ్యలక్ష్మి, కానిస్టేబుల్ రామారావు, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ కోఆర్డినేటర్లు ఇక్బాల్ పాషా, అజయ్ కుమార్, కె.రవి తదితరులతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ట్రాన్స్ జెండర్, గే, శివశక్తి కమ్యూనిటీకి చెందిన సుమారు 160 మంది పాల్గొన్నారు.

# 9న భూపాలపల్లిలో ఉద్యోగ మేళా

▫ కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అక్టోబర్ 9న భూపాలపల్లిలోని పుష్ప గ్రాండ్ ప్రాంగణంలో భారీ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. 300కు పైగా కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ యువత కోసం ఆర్టీసీ ఆధ్వర్యంలో ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామాలు, మండలాల వారీగా నిరుద్యోగులను గుర్తించి మేళాకు తరలించేలా అధికారులు ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. పుష్ప గ్రాండ్, బిట్స్ స్కూల్ వద్ద రిజిస్ట్రేషన్ కౌంటర్లు, ఇంటర్వ్యూ హాళ్లు, నీడ, మంచినీరు, పారిశుధ్య సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు, రద్దీ నియంత్రణ, పార్కింగ్, భద్రతకు పోలీసు బందోబస్తు, నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అర్హులైన యువత విద్యార్హత ధ్రువపత్రాలు, ఇతర సర్టిఫికెట్లతో అక్టోబర్ 9న సమయానికి హాజరు కావాలని సూచించారు.

## ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

▫ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుండి 17 వరకు జరిగే పదో తరగతి, ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీలోని తన ఛాంబర్ లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. పరీక్షలు ఉదయం 9 నుండి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుండి 5.30 గంటల వరకు జరుగుతాయని, ఇంటర్ ప్రాక్టికల్స్ అక్టోబర్ 23 నుండి 30 వరకు ఉంటాయని తెలిపారు. ప్రతి కేంద్రంలో పోలీసు బందోబస్తు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ లను నియమించాలని, ఉదయం 8.30 నుండి సాయంత్రం 6 గంటల వరకు జిరాక్స్ కేంద్రాలు మూసివేయాలని సూచించారు. విద్యార్థులకు తాగునీరు, పారిశుధ్యం, వైద్య శిబిరం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అధికారులకు తెలిపారు. విద్యార్థులు సమయపాలన పాటించి ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. సమావేశంలో డీఈఓ లలిత, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, డీపీఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

# దసరా వేడుకల వేళ బయటపడ్డ విభేదాలు?

▫ సమీక్షకు హాజరుకాని కుడా చైర్‌పర్సన్, కుడా అధికారులు

▫ ప్రజల పండుగకు పంతాలు అడ్డంకిగా మారకూడదంటున్న స్థానికులు




**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 06 (జనం సాక్షి) :** వరంగల్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఉర్సు దసరా వేడుకలకు రంగలీల మైదానం వేదిక కానుంది. ఈ నేపథ్యంలో ఉర్సు దసరా ఉత్సవ సమితి పిలుపు మేరకు స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండా సురేఖ మంగళవారం రంగలీల మైదానానికి చేరుకుని వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె వెంట జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో పాటు, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, వరంగల్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. అయితే ఏర్పాట్ల పరిశీలన సమయంలో కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కూడా) చైర్ పర్సన్ గుండు సుధారాణి, సంబంధిత కూడా అధికారులు అక్కడ కనిపించకపోవడం చర్చకు దారితీసింది. ఎమ్మెల్యే కొండా సురేఖ, కూడా చైర్ పర్సన్ గుండు సుధారాణి మధ్య ఉన్న రాజకీయ విభేదాలే ఈ గైర్హాజరుకు కారణమై ఉండొచ్చనే చర్చ స్థానికంగా వినిపిస్తోంది. ఏటా భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనే ఉర్సు దసరా వేడుకల ఏర్పాట్ల విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ఈసారి మాత్రం ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం కొరవడిందనే చర్చలు వినిపిస్తుండటంతో ఉత్సవాల నిర్వహణపై కొందరిలో సందిగ్ధత వ్యక్తమవుతోంది. రాజకీయ విభేదాలు ఉంటే వాటిని పార్టీ వేదికలపైనే పరిష్కరించు కోవాలని స్థానికులు సూచిస్తున్నారు. ప్రజలకు ఏడాదికోసారి వచ్చే పండుగను రాజకీయ పంతాలకు అతీతంగా ఘనంగా నిర్వహిం చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాలని కోరుతున్నారు. ప్రజల పండుగకు రాజకీయ పంతాలు అడ్డుకాకుండా.. ఉర్సు దసరా వేడుకలను సమన్వయంతో నిర్వహించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఉత్సవ కమిటీ కూడా అందరి సహకారంతో ముందుకు సాగాలనే అభిప్రాయం ప్రజల్లో వ్యక్తం అవుతుంది.



### కొత్త పెన్షన్ లబ్ధిదారులను విచారించిన అడిషనల్ కలెక్టర్ శేషాద్రి

**నడికుడ అక్టోబర్ 6 (జనం సాక్షి) :** నడికుడ మండలంలోని 15 గ్రామాలలో నూతన పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను జిల్లా పరిషత్ సీఈవో ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ శేషాద్రి ఎంపీడీవో రామకృష్ణతో కలిసి మంగళవారం పెన్షన్ లబ్ధిదారులను విచారించారు అనంతరం గ్రామంలో ఉన్న లైబ్రరీ, పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు గ్రామ ప్రథమ పౌరులు పంచాయతీ అధికారుల సహకారంతో అభివృద్ధి చేసుకోవాలని తెలియజేశారు నూతన పెన్షన్ విధానంలో అవకతవకలకు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశాలు జారీ చేయడంతో నూతన పెన్షన్ లబ్ధిదారులను విచారించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 15 గ్రామాల సర్పంచులు పంచాయతీ అధికారులు తదితరులు పాల్గొన్నారు

### భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించిన వరంగల్ సీపీ శ్వేతా



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 06 (జనం సాక్షి) :** వరంగల్ నగరంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భద్రకాళి దేవస్థానంలో ఈ నెల 11 వ తేదీ నుండి ప్రారంభం కానున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముందస్తు భద్రతా ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉత్సవాల సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీస్ శాఖ తరపున చేపడుతున్న చర్యలను సిపి స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలు, భద్రతా విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్ రావు, హన్మకొండ ఏసీపీ నర్సింహారావు, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ, మట్టెవాడ, ఇంతేజర్ గంజ్, మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్లు, ఆలయ పాలక మండలి, అర్చకులు పాల్గొన్నారు.

# వరద ముంపునకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

▫ 57వ డివిజన్‌లో రూ.2.52 కోట్లతో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

▫ అంబేద్కర్ జంక్షన్ నుంచి వడ్డేపల్లి చర్చి వరకు రూ.18 కోట్లతో రోడ్డు విస్తరణ



**కాజీపేట, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా 57వ డివిజన్‌లోని సమ్మయ్యనగర్, గోకుల్‌నగర్ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. డివిజన్‌లో సుమారు రూ. 2.52 కోట్ల నిధులతో అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా గోకుల్‌నగర్, సమ్మయ్యనగర్‌తో పాటు పరిసర కాలనీల్లో వర్షాకాలంలో ఏర్పడుతున్న వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అంబేద్కర్ విగ్రహం వైపు నుంచి వచ్చే వర్షపు నీరు, సుబేదారి పోలీస్ స్టేషన్ వైపు నుంచి వచ్చే నీరు గోకుల్‌నగర్ చౌరస్తా వద్ద కలిసిపోవడంతో ప్రతి వర్షాకాలంలో గోకుల్‌నగర్‌తో పాటు పరిసర కాలనీలు నీట మునిగే పరిస్థితి ఏర్పడుతోందని ఎమ్మెల్యే వివరించారు. రోడ్డు విస్తరణ పూర్తయితే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు భవిష్యత్తులో పెరుగుతున్న జనాభా, వాహనాల రాకపోకలకు అనుగుణంగా మెరుగైన రహదారి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనుల విషయంలో దుకాణదారులు, ఇళ్ల యజమానులు ప్రజా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని సహకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనుల సమయంలో కొంతమేర ఇబ్బందులు, నష్టం కలిగే అవకాశం ఉన్నప్పటికీ, భవిష్యత్ తరాలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను అందించేందుకు అందరూ సహకరించాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా గోకుల్‌నగర్, సమ్మయ్యనగర్, పరిసర కాలనీల ప్రజలు వర్షాకాలంలో వరదలతో ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పుడు ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే అవకాశం వచ్చిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పనులకు సహకరించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. రోడ్లు, డ్రైనేజీ, రోడ్డు విస్తరణ, చౌరస్తాల సుందరీకరణ పనులను సమన్వయంతో పూర్తి చేసి 57వ డివిజన్‌ను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత ఈ ప్రాంత ప్రజలకు వరద ముంపు సమస్య నుంచి శాశ్వత ఉపశమనం లభించడంతో పాటు మెరుగైన రహదారి, డ్రైనేజీ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వారివెంట డివిజన్ ఇంచార్జ్ ఇ.వి శ్రీనివాస్ రావు,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్,డివిజన్ అధ్యక్షులు అశోక్ రెడ్డి ఆయా కాలనీల ప్రజలు, అధికారులు ఉన్నారు.

# అరుదైన నక్షత్రాల తాబేలు ప్రత్యక్షం



**కౌటాల అక్టోబర్ 06 (జనం సాక్షి) :** విచిత్ర తాబేలు ను చూసేందుకు చుట్టూ పక్కల జనాలు ఎగబడ్డారు. మండల కేంద్రంలో ఓ అరుదైన నక్షత్ర తాబేలు ప్రత్యక్షమైంది.స్థానిక సదాశివపేటకు చెందిన రాచకొండ సంతోష్ అనే వ్యక్తి ఇంటి ఆవరణలోకి మంగళవారం ఉదయం ఈ తాబేలు వచ్చింది. వీపుపై నక్షత్రాల వంటి ఆకారాలు ఉన్న ఈ విచిత్ర తాబేలును చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు, స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.విషయం తెలుసుకున్న ఇంటి యజమాని సంతోష్ వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ తులసీదాస్ నాయక్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని తాబేలును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దానిని సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓ తులసీదాస్ మాట్లాడుతూ.. వన్యప్రాణులు లేదా ఇతర జంతువులు జనావాసాల్లోకి వచ్చినప్పుడు ప్రజలు వాటికి ఎలాంటి హాని తలపెట్టకూడదని విజ్ఞప్తి చేశారు. అలాంటి దృశ్యాలు కనిపించిన వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచులు!



**తాండూర్, అక్టోబర్ 06(జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా తాండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో తీవ్ర నిరసన వ్యక్తమైంది. ఐసీడీఎస్ అధికారుల ఏకపక్ష వైఖరికి నిరసనగా సర్పంచులు ఈ సమావేశాన్ని పూర్తిగా బహిష్కరించారు. మాదారం సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్ భార్య, అంగన్‌వాడీ కార్యకర్త అయిన కృష్ణపల్లి మీనాపై ఐసీడీఎస్ అధికారులు కావాలనే వ్యక్తిగత కక్షతో వేధింపులకు గురిచేస్తున్నారని సర్పంచులు ఆరోపించారు. ఎలాంటి తప్పు చేయకపోయినప్పటికీ, ఆమెను కావాలనే మందలించడం, ఇబ్బందులకు గురిచేయడంపై సర్పంచ్ లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల ఈ విధమైన అనుచిత ప్రవర్తనను నిరసిస్తూ, ఆయనకు మద్దతుగా మండలంలోని ఇతర సర్పంచులు కూడా సమావేశం నుండి బయటకు వచ్చేసి తమ నిరసనను తెలిపారు. ప్రజాప్రతినిధులపై మరియు వారి కుటుంబ సభ్యులపై అధికారుల కక్షసాధింపు చర్యలు సరికావని, ఈ విషయంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని సర్పంచులు డిమాండ్ చేశారు. సర్పంచుల బహిష్కరణతో సర్వసభ్య సమావేశం అర్ధాంతరంగా నిలిచిపోయింది.

# ఇండ్ల తాళలు పగులగొట్టి దొంగతనాలు

▫ నిందితుడి అరెస్ట్.. బంగారు, వెండి ఆభరణాలు,నగదు స్వాధీనం



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** ఇళ్లకు తాళాలు వేసి ఉన్న సమయంలో తాళాలు పగులగొట్టి వరుస దొంగతనాలకు పాల్పడు తున్న సబ్బాని లక్ష్మీనారాయణ చింటూ అనే నిందితుడిని జైపూర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జైపూర్ ఎస్ఐ భూమేష్ తెలిపారు. మంగళవారం మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ భూమేష్ మాట్లాడుతూ నిందితుడు తన స్నేహితుడు మహ్మద్ మగ్దూంతో కలిసి సెప్టెంబర్ 28న ఇందారం గ్రామంలో రెండు ఇళ్ల తాళాలు పగులగొట్టి నగదు, బంగారు,వెండి ఆభరణాలను దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది. దొంగిలించిన నగదు, ఆభరణాలను ఇద్దరూ పంచుకున్నట్లు నిందితుడు తెలిపాడు. అదేవిధంగా, బెల్లంపల్లి రైల్వే రాడగంబల బస్తీలో జనవరి 16న, గాంధీనగర్‌లో జూలై 9న,ఇందారం గ్రామంలో సెప్టెంబర్ 24న ఇళ్లకు తాళాలు పగులగొట్టి నగదు,వెండి వస్తువులు, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ తదితర వస్తువులను దొంగిలించినట్లు విచారణలో వెల్లడించాడు. నిందితుడి వద్ద నుంచి సుమారు 2 తులాల వెండి కాళ్ల పట్టీలు, రూ. 3,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించి నిందితుడి సహచరుడిని గతంలోనే పోలీసులు అరెస్ట్ చేసి,అతని వద్ద నుంచి దొంగిలించిన బంగారు,వెండి ఆభరణాలు, నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులు, నగదును ఇంట్లో ఉంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపించినప్పుడు వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

### పీఆర్‌టీయూ టీఎస్ మహిళా అసోసియేట్ అధ్యక్షురాలిగా అనురాధ



**గీసుకొండ, అక్టోబర్ 6, (జనంసాక్షి) :** పీఆర్‌టీయూ టీఎస్ గీసుగొండ మండల శాఖ మహిళా అసోసియేట్ అధ్యక్షు రాలిగా ఎస్‌జీటీ జి.అను రాధను ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. ఈ మేరకు మండల శాఖ అధ్యక్షుడు మార్త శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బొల్లం రవి, కార్యవర్గ సభ్యులు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన వరంగల్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఇ.రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరెడ్డి మహేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీ.ఎస్. కొమ్మాల ప్రధానోపాధ్యాయుడు సుంచు ప్రజాపతి, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు ఎన్.మాలతి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## రోడ్డుపై మొసలి పిల్ల కలకలం..

**• గోదావరిలో వదిలిన అటవీ అధికారులు**



**బూర్గంపహాడ్, అక్టోబరు 6 (జనంసాక్షి) :** గోదావరి తీర ప్రాంతమైన బూర్గంపహాడ్‌లో మంగళవారం ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపైకి ఓ మొసలి పిల్ల రావడంతో స్థానిక యువత అప్రమత్తమయ్యారు. వేగంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాల కింద పడి మొసలి పిల్లకు ప్రమాదం జరగకుండా యువకులు చాకచక్యంగా దానిని పట్టుకుని సురక్షితంగా కాపాడారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మొసలి పిల్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దానిని ఎటువంటి హాని కలగకుండా గోదావరి నదిలో సురక్షితంగా వదిలిపెట్టారు. మొసలి పిల్లను కాపాడి అటవీ శాఖకు అప్పగించిన గ్రామ యువకులు బబ్బు, రాయుడు తదితరులను సారపాక డిప్యూటీ రేంజ్ అధికారి డి.కృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి జీవులు జనావాసాల్లోకి వచ్చినా వాటికి ఎలాంటి హాని తలపెట్టవద్దని సూచించారు. వన్యప్రాణులు కనిపించిన వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సారపాక అటవీ బీట్ అధికారి జి.బాబురావు, సాండెల్లపాడు అటవీ బీట్ అధికారి బి.భీమ్ చందర్, కృష్ణసాగర్ అటవీ బీట్ అధికారి బి.ఉపేందర్ పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయి భూమే భూ రీ-సర్వేకు ప్రమాణికం

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** రీ సర్వే ద్వారా భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ఖచ్చితమైన రికార్డులను రూపొందించడం కోసం చేపట్టిన భూ రీ-సర్వేకు క్షేత్రస్థాయిలో ఉన్న భూమే ప్రామాణికమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. వైరా మండలం నారుపునేనిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు, భూ యజమానుల సమక్షంలో రోవర్, ట్యాబ్ తదితర ఆధునిక సాంకేతిక పరికరాలతో నిర్వహిస్తున్న డిజిటల్ సర్వే ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వే నిర్వహిస్తున్న విధానం, ఇప్పటివరకు పూర్తయిన, మిగిలిన ప్రక్రియ పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడి భూ రీ-సర్వే ఉద్దేశ్యం, సర్వే నిర్వహణ విధానం, భూ రికార్డుల క్రమబద్ధీకరణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. రైతుల సందేహాలు, అనుమానాలను అడిగి తెలుసుకుని వాటిని నివృత్తి చేశారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రతి అంశాన్ని రైతుల సమక్షంలో పరిశీలించి, వాస్తవాలను మాత్రమే నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూలి, భూమి ఉండి పట్టాదారు పాస్‌బుక్‌లు లేని వారు, పట్టాదారు పాస్‌బుక్‌లు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలోని భూ విస్తీర్ణం, హద్దులు, ఇతర వివరాలు రికార్డులతో సరిపోలని వారు, అలాగే రికార్డుల్లో భూమి వివరాలు నమోదు కాని సందర్భాలను రీ-సర్వే ద్వారా గుర్తించి, నిబంధనల ప్రకారం పరిష్కరించే అవకాశం ఉంటుందని తెలిపారు. రీ-సర్వేలో ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఎవరు భూమిని సాగు చేస్తున్నారు, వారి పేరుపై ఎంత విస్తీర్ణం నమోదై ఉంది, పట్టాదారు పాస్‌బుక్ ఉందా లేదా, రికార్డుల్లో నమోదైన వివరాలు క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోతున్నాయా అనే అంశాలను సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పట్టాదారు పాస్‌బుక్‌లో నమోదైన విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ విస్తీర్ణానికి మధ్య తేడా ఉంటే, చుట్టుపక్కల రైతుల సమక్షంలో కొలతలు నిర్వహించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించాలని అన్నారు. అవసరమైన సందర్భాల్లో పంచనామా నిర్వహించి వివరాలను నమోదు చేయాలని, భూ విస్తీర్ణం ఎక్కువగా లేదా తక్కువగా ఉన్నట్లయితే అందుకు గల



కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రీ-సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండి, తమ వద్ద ఉన్న సంబంధిత భూ పత్రాలను అధికారులకు అందజేస్తూ సర్వే ప్రక్రియకు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. రైతుల భాగస్వామ్యంతో పారదర్శకంగా నిర్వహించే రీ-సర్వే ద్వారా భవిష్యత్‌లో భూ వివాదాలను తగ్గించి, భూ రికార్డుల్లో మరింత స్పష్టత తీసుకురావచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మండల తహసీల్దార్ సురేష్, గ్రామ సర్పంచ్, సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు, భూ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వానికి అండగా రాష్ట్ర ప్రజలు

**• డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**



**గరిడేపల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న తమ ప్రభుత్వానికి అండగా ఉండేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం గడ్డిపల్లిలో నిర్మిస్తున్న సమీకృత ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అధిక నిధులు, వనరులతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని ఆశించామని, అయితే గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని విమర్శించారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని అప్పగించినప్పటికీ పేద ప్రజలకు సన్నబియ్యం అందించలేకపోయిందన్నారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం కోటి ఆరు లక్షలకు పైగా పేద ప్రజలకు సన్నబియ్యం అందిస్తోందని తెలిపారు. డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని, పేద ప్రజలకు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమంలో భాగంగా మునగాల మండలంలో అత్యాధునిక సదుపాయాలతో వంటశాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమం, విద్య, అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గతంలో దొరల పాలనలో దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తాము కూర్చున్న ప్రదేశంలో చరిత్ర సృష్టించేలా అత్యున్నత ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఆధునిక సదుపాయాలతో పాఠశాలను తీర్చిదిద్దుతున్నామని, పూర్తిగా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఉంటుందని చెప్పారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారు ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ ప్రజల సహకారాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంట్ స్థానానికి హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి లక్షకు పైగా ఓట్ల మెజారిటీ అందించారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు పర్యాయాలు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలే తనకు దేవుళ్లని అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర రాజకీయాల్లో విశిష్ట స్థానం కలిగిన నాయకుడని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో అసెంబ్లీలో నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహకారంతో హుజూర్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.15 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి, కాంట్రాక్ట్ కరోబార్



**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి, కాంట్రాక్ట్ కరోబార్ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. జక్కాపూర్ పంచాయతీ కార్యదర్శి బి. అరుణ, కాంట్రాక్ట్ కరోబార్ దాసరి సంతోష్ లంచం డిమాండ్ చేసి తీసుకుంటుండగా పట్టుబడ్డారు. ఫిర్యాదుదారుడి పేరుపై ఉన్న రెండు ఇళ్లకు సంబంధించిన మ్యుటేషన్ దరఖాస్తు ఫైల్‌ను ఫార్వర్డ్ చేసి ప్రాసెస్ చేయడం కోసం పంచాయతీ కార్యదర్శి తొలుత రూ.20 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. అనంతరం బేరసారాల తర్వాత రూ.15 వేలకు లంచం మొత్తం తగ్గించినట్లు పేర్కొంది. కరోబార్ ద్వారా లంచం స్వీకరణ ఏసీబీకి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు. మంగళవారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో జక్కాపూర్ పంచాయతీ కార్యాలయంలో కాంట్రాక్ట్ కరోబార్ దాసరి సంతోష్ ద్వారా రూ.15 వేల లంచం స్వీకరిస్తుండగా ఇద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ వెల్లడించింది.

### దర్యాప్తు కొనసాగింపు

ఏసీబీ అధికారులు పంచాయతీ కార్యదర్శి అరుణ, కాంట్రాక్ట్ కరోబార్ సంతోష్‌ను అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఎస్ పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని వెల్లడించారు. లంచం డిమాండ్ చేసే ఏ ప్రభుత్వ ఉద్యోగి గురించిన సమాచారమైనా ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

## అర్హులైన లబ్ధిదారులకే పెన్షన్లు అందాలి

**• పెన్షన్ల వెరిఫికేషన్ పారదర్శకంగా నిర్వహించాలి**

**• వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



**రేవల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** అర్హత కలిగిన లబ్ధిదారులకే సామాజిక భద్రతా పెన్షన్లు అందేలా పెన్షన్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. మంగళవారం పెన్షన్ వెరిఫికేషన్‌లో భాగంగా రేవల్లి మండలంలోని తల్పునూరు, రేవల్లి గ్రామాలను జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా చేయూత దరఖాస్తుల్లో నమోదైన పెన్షన్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పెన్షన్‌కు అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో అర్హత లేని లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో గుర్తించి, నిబంధనల ప్రకారం తొలగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెన్షన్ వెరిఫికేషన్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, నిష్పక్షపాతంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

### రేవల్లి సీహెచ్‌సీలో వైద్య సేవల పరిశీలన

రేవల్లి మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అదనపు కలెక్టర్ సందర్శించారు. ఆసుపత్రిలోని ఔట్‌పేషెంట్ (ఓపీ), ఇన్‌పేషెంట్ (ఐపీ) విభాగాలు, ఫార్మసీ, ల్యాబొరేటరీలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, డెంగ్యూ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్డీఏ సరోజ, స్థానిక ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి



**రామాయంపేట, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి విస్తృతంగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. రామాయంపేట పట్టణంలో సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం కళ్యాణ శుభ వేదిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా, మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్ రావుతో కలిసి జీడిమామిడి మొక్కలను నాటారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

### జీడిమామిడి సాగుతో రైతులకు అదనపు ఆదాయం

జీడిమామిడి వంటి ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు రైతులకు అదనపు, దీర్ఘకాలిక ఆదాయం లభించే అవకాశం ఉందని గవర్నర్ తెలిపారు. జీడిమామిడి తోటల పెంపకం రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని అన్నారు.

### మొక్కల సంరక్షణే అసలు లక్ష్యం

మొక్కలు నాటడమే కాకుండా అవి ఎదిగే వరకు సంరక్షించినప్పుడే కార్యక్రమం యొక్క అసలు లక్ష్యం నెరవేరుతుందని శివప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను కూడా స్వీకరించాలని సూచించారు. మానవ జీవితం ప్రకృతిపైనే ఆధారపడి ఉందని, ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరైన గవర్నర్‌కు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులతో పాటు మండల రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు, డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలు, పోలీసు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గుండ్లకుంటకు హైడ్రా రక్షణ

**• 7.23 ఎకరాల చెరువుకు హైడ్రా ఫెన్సింగ్**

**శామీర్ పేట్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం మందాయపల్లి - దేవరయాంజల్ గ్రామాల పరిధిలోని గుండ్లకుంటను హైడ్రా కాపాడింది. నివాస ప్రాంతాలు పెరగడం, లే ఔట్లు రావడంతో చెరువు కబ్జాకు గురయ్యే ప్రమాద ముందని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ చెరువు ఆక్రమణలకు ఆస్కారం లేకుండా కాపాడాలని కోరారు. హెచ్‌ఎండీఏ ఫైనల్ నోటిఫికేషన్ ప్రకారం చెరువు హద్దులను నిర్ధారించి భవిష్యత్తులో ఎలాంటి ఆక్రమణలకు ఆస్కారం లేకుండా హైడ్రా ఫెన్సింగ్ వేసింది. మొత్తం 7.23 ఎకరాల మేర ఉన్న చెరువును కాపాడుతూ 800ల మీటర్ల మేర హైడ్రా ఫెన్సింగ్ వేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసింది. చెరువును పూర్తి స్థాయిలో కాపాడడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



## రూ.52.20 లక్షలతో డిఫెన్స్ కాలనీలో రెండు పార్కుల అభివృద్ధి

**హయత్‌నగర్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్‌లోని డిఫెన్స్ కాలనీలో రూ.52.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న రెండు పార్కుల అభివృద్ధి పనులకు మంగళవారం శ్రీకారం చుట్టారు. ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్, ఎల్బీనగర్ ఇంచార్జ్ మధు యాష్కీ గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర యాదవ్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్ పనులను ప్రారంభించారు. మొదటి పార్కు 2,780 చదరపు గజాలు, రెండో పార్కు 547 చదరపు గజాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్నారు. పార్కుల అభివృద్ధితో కాలనీ వాసులకు పచ్చదనం, ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు వాకింగ్, వ్యాయామం వంటి సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా గజ్జి భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కాలనీ వాసుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఫెన్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కామేశ్వరరావు, నరసింహ, గోపాల్ రెడ్డి, కోటేశ్వరరావు, మాధవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కృష్ణమూర్తి, మల్లారెడ్డి, హరిబాబు, సుధాకర్ రెడ్డి, మోహనకృష్ణ, సంజీవరెడ్డి, వేణు, రాజవర్ధన్ రెడ్డి, శ్రవణ్ రెడ్డి తదితరులతో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.



# సింగరేణి మండలంలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్

**• పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం..**

**• జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**కారేపల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పౌష్టికాహారం ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించడం ద్వారా రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను అధిగమించవచ్చని తెలిపారు. తొమ్మిదవ జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా కామేపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సింగరేణి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ మంగళవారం సందర్శించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ రకాల పోషకాహార పదార్థాలను పరిశీలించి, వాటి వినియోగం, పోషక విలువలు, తయారీ విధానం తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం, గుడ్ల పంపిణీ తదితర కార్యక్రమాల అమలుపై కలెక్టర్ ఆరా తీశారు. కలెక్టర్, చిన్నారులతో ముచ్చటించి, వారితో కలిసి సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారులకు అక్షరాలను పరిచయం చేస్తూ స్వయంగా అక్షరాభ్యాసం చేయించారు. విద్యతో పాటు ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రతపై చిన్నారుల్లో చిన్న వయస్సు నుంచే మంచి అలవాట్లు పెంపొందించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, పోషకాహారం అనేది కేవలం ఒక నెలకు పరిమితమైన కార్యక్రమం కాదని, ప్రతి కుటుంబం రోజువారీ జీవితంలో పాటించాల్సిన అలవాటుగా మారాలని అన్నారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు వారి వయస్సుకు అనుగుణంగా సమతుల్య ఆహారం అందించడం అత్యంత అవసరమని తెలిపారు. చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు వంటి పోషక విలువలు కలిగిన పదార్థాలను తగిన మోతాదులో ఆహారంలో చేర్చుకోవాలని సూచించారు. అధికంగా జంక్‌ఫుడ్, పోషక విలువలు తక్కువగా ఉన్న ఆహార పదార్థాల వినియోగాన్ని తగ్గించాలని అన్నారు. పోషకాహారంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులకు చిన్నారుల ఆహారం, పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, వయస్సుకు అనుగుణమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి



చిన్నారి ఆరోగ్యంగా ఎదగడం ద్వారా మాత్రమే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం సింగరేణి మండలం లోని ఎంపీడీవో కార్యాలయంలో మండల అధికారులతో అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతి పై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇంకుడుగుంతలు, విద్యాలయాలకు అదనపు ఏకరూప దుస్తులు, సంక్షేమ శాఖ పనులు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూవో ఎ. ప్రమీల, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బానోతు పద్మ, సీడీపీవో కె.ఉమా, ఎంపీవో రాజేంద్రప్రసాద్, ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.




## భారత్ వృద్ధి అంచనాలను పెంచిన ప్రపంచ బ్యాంక్




**దిల్లీ:** భారత వృద్ధి అంచనాలను ప్రపంచ బ్యాంక్ సవరించింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి 7.1 శాతంగా నమోదు కావొచ్చని అంచనా వేసింది. అంతకుముందు జూన్‌లో 6.6 శాతంగా ఉన్న వృద్ధి అంచనాలను పెంచింది. అంతర్జాతీయ అనిశ్చితులు ఉన్నా.. ఆశించిన స్థాయిలో వృద్ధి నమోదు కావడంతో అంచనాలను సవరించినట్లు తన 'ఇండియా డెవలప్‌మెంట్ అప్‌డేట్' నివేదికలో పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో భారత్ 7.8 శాతం వృద్ధి నమోదు చేసిన సంగతి తెలిసిందే.సబ్సిడీలు, తక్కువ ద్రవ్యోల్బణం కారణంగా గ్రామీణ వినియోగం పుంజుకోగా, ఆదాయపు పన్ను ఉపశమనాలు, జీఎస్టీ కోతల కారణంగా పట్టణ వినియోగం బలపడిందని తెలిపింది. అంతర్జాతీయ ప్రతికూలతలు ఉన్నప్పటికీ.. పారిశ్రామిక రంగం ఊహించిన దానికంటే మెరుగైన ఫలితా లను ఇచ్చిందని పేర్కొంది. నైరుతి రుతుపవనాల్లో నమోదైన లోటు వర్ష పాతం వ్యవసాయ రంగాన్ని కొంత ప్రభావితం చేయొచ్చని నివేదిక అంచనా వేసింది. అయితే పారిశ్రామిక రంగం ఆ లోటును భర్తీ చేస్తుందని అభిప్రా యపడింది. సేవల రంగం మునుపటి కంటే కాస్త నెమ్మదించినప్పటికీ.. ఇప్పటికీ స్థిరంగా కొనసాగుతోందని పేర్కొంది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు దాదాపు 7 శాతంగా నమోదు కావొచ్చని ప్రపంచ ఏజెన్సీలైన ఎస్అండ్‌పీ, ఫిచ్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ), ఓఈసీడీ ఇటీవల పేర్కొన్నాయి.

# దిగొచ్చిన చమురు ధరలు

**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారమూ రాణించాయి. గత సెషన్ లాభాల ర్యాలీని కొనసాగించాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం మార్కెట్‌పై సానుకూల ప్రభావం చూపాయి. దీనికితోడు బ్యాంక్ షేర్లలో కొనుగోళ్ల మద్దతూ కలిసొచ్చింది. దీంతో రెండో రోజు సూచీలు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 72,508.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 72,382.47) లాభాల్లో ఆరంభమైంది. రోజంతా సూచీ లాభాల్లోనే కదలాడింది. 685.34 పాయింట్లు లాభపడి 73,067.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 220.35 పాయింట్లు పెరిగి 22,776.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.43గా ఉంది.సెన్సెక్స్ 30లో ట్రెంట్, కోటక్ బ్యాంక్, హిందుస్థాన్ యునిలీవర్, రిలయన్స్, ఇండిగో, ఎటర్నల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి.**



## మరోసారి ట్రిలియనీర్‌గా మస్క్

### అమాంతం పెరిగిన సంపద..

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ మళ్లీ ట్రిలియనీర్ అయ్యారు సోమవారం ఆయన సంపద ఒక్కసారిగా 65 బిలియన్ డాలర్లు పెరిగి.. 1.03 ట్రిలియన్ డాలర్లకు చేరింది. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ఈ గణాంకాలను వెల్లడించింది. స్పేస్‌ఎక్స్, టెస్లా షేర్లు లాభాల్లో దూసుకెళ్లడమే మస్క్ సంపద గణనీయంగా పెరగడానికి ప్రధాన కారణం. అక్టోబర్ ప్రారంభం నుంచి స్పేస్ ఎక్స్ షేర్లు 13 శాతం, టెస్లా షేర్లు 6.7 శాతం ర్యాలీ అయ్యాయి. జూన్‌లో మస్క్ తొలి సారి ట్రిలియనీర్‌గా అవతరించిన సంగతి తెలిసిందే. ఆ నెలలో అమెరికా మార్కెట్లలో స్పేస్‌ఎక్స్ షేర్లు నమోదయ్యాయి షేర్ వాల్యూ దూసుకెళ్లడంతో కంపెనీ విలువ 2.8 ట్రిలియన్ డాలర్ల మార్క్‌కు చేరువైంది. మస్క్ వ్యక్తిగత సంపద 1.4 ట్రిలియన్ డాలర్లు దాటింది. కానీ జులై ప్రారంభానికి వచ్చేసరికి షేరు ధర తగ్గుతూ రావడంతో ట్రిలియనీర్ ఘనతను కోల్పోయారు.



## ఈ నెలలోనే జియో ఐపీఓ..

దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ సేవల విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ ఈ నెలలోనే పబ్లిక్ ఇష్యూకు రానుంది. దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది. అయితే, ఈ ఇష్యూలో ఆఫర్ ఫర్ సేల్ ఉండకపోవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి. తమ వాటాలను పూర్తిగా లేదా పాక్షికంగా వదులుకునేందుకు ఏ ఒక్క ఇన్వెస్టరూ సుముఖత చూపడం లేదని తెలుస్తోంది. అంటే ఈ ఇష్యూ పూర్తిగా కొత్త షేర్ల జారీ రూపంలోనే జరగనుంది.జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు సంబంధించి ఇటీవల ప్రపంచవ్యాప్తంగా రోడ్‌షోలు నిర్వహించగా.. మెరుగైన స్పందన వచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో జియో ఐపీఓ సుమారు రూ.12 లక్షల కోట్ల మార్కెట్ విలువతో లిస్టింగ్‌కు రావొచ్చని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే భారత స్టాక్ మార్కెట్‌లో టాప్-3 కంపెనీల జాబితాలో చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ పరంగా మూడు అతిపెద్ద కంపెనీలుగా ఉన్నాయి.

**21 నుంచి ప్రారంభం?**

రిలయన్స్ జియో ఐపీఓ ఈ నెల 21-23 మధ్య సబ్‌స్క్రిప్షన్‌కు వచ్చే అవకాశం ఉంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 19న విండో తెరుచుకోనున్నట్లు తెలుస్తోంది. మొత్తం 27 కోట్ల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. పబ్లిక్ ఇష్యూలో క్యూఐబీలకు 50 శాతం, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు 15 శాతం, రిటెయిల్ ఇన్వెస్టర్లకు 35 శాతం చొప్పున కోటా నిర్ణయించనున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ప్లాట్‌ఫామ్స్, దాని అనుబంధ కంపెనీల్లోని శాశ్వత ఉద్యోగులకు షేర్ల కేటాయింపులో రిజర్వేషన్ ఉంటుంది. ఐపీఓ పరిమాణం, ధరల శ్రేణి వంటి వివరాలపై త్వరలో స్పష్టత రానుంది.

# ఆసుపత్రి బిల్లులకు ఎఫ్‌డీల పోటు

### చికిత్స వ్యయాలు భారమవుతున్నాయ్




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
దేశీయ హాస్పిటల్స్‌లోకి విదేశీ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలైన బ్లాక్‌స్టోన్, కేకేఆర్, టీపీజీ, జనరల్ అట్లాంటిక్ వంటివి గత అయిదేళ్లలో సుమారు రూ.96,200 కోట్ల (10 బి. డాలర్ల) పెట్టుబడులు పెట్టినట్లు ఈవై నివేదిక వెల్లడిస్తోంది. ఈ నిధులతో ఆసుపత్రుల విస్తరణ, కొత్త పడకల ఏర్పాటు, ఆధునిక వైద్య పరికరాలు - సాంకేతికత సమకూరుతున్నాయి. పెద్ద హాస్పిటల్ చెయిన్‌లోకి చిన్న, మధ్య తరహా ఆసుపత్రులూ చేరుతున్నాయి. అయితే విదేశీ పెట్టుబడులు వచ్చాక, దేశీయ ఆసుపత్రుల్లో చికిత్సా వ్యయాలు అధికమవుతున్నాయన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వైద్య ద్రవ్యోల్బణం ఏటా 13 శాతానికి చేరిందని పార్లమెంటరీ సంఘం పేర్కొంది.ఆసుపత్రి స్వాధీనానికి ప్రారంభంలో భారీగా పెట్టుబడి పెడుతున్నా, కార్యకలాపాలు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాక, నిరంతర ఆదాయ ప్రవాహానికి అవకాశం ఉండటం పెట్టుబడిదారులను ఆకర్షిస్తోంది. ఒకే సంస్థ కిందకు పలు ఆసుపత్రులను తీసుకురావడం, వైద్య సేవలను ఏకీకృతం చేయడం ద్వారా నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకుంటున్నారు. 2021లో దేశంలో సుమారు 600 ఆసుపత్రి ప్రాజెక్టులకు 32 బిలియన్ డాలర్ల (రూ.3 లక్షల కోట్లకు పైగా) పెట్టుబడి అవసరమని గుర్తించారు. దీంతో ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని పీఈ సంస్థలు భావిస్తున్నాయి.ఆసుపత్రుల్లో పెట్టుబడులపై ప్రతిఫలానికి మణిపాల్ హెల్త్ ఎంటర్‌ప్రైజెస్ ఒక ఉదాహరణ. 2017లో ఈ సంస్థలో పెట్టుబబడి పెట్టిన టెమాసెక్.. గత ఆగస్టులో జరిగిన ఐపీఓలో వాటా విక్రయించడం ద్వారా 10 రెట్ల రాబడిని పొందినట్లు వీసీసర్కిల్ నివేదిక పేర్కొంది. భారత్‌లో ఆసుపత్రుల ఆదాయం 2026-27లో గరిష్ఠంగా 15% పెరిగే అవకాశం ఉందని క్రిసిల్ అంచనా వేస్తోంది. ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడులున్న ఆసుపత్రుల్లోని పడకలు, దేశంలోని మొత్తం ఆసుపత్రి పడకల్లో 5 శాతమే. అయినా కూడా అధిక ఆదాయం వచ్చే గుండె శస్త్ర చికిత్సలు, క్యాన్సర్ వంటి చికిత్సా విభాగంలో వీటికే ప్రాధాన్యం ఎక్కువగా ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. సాధారణ ఆసుపత్రులతో పోలిస్తే వీటిల్లో చికిత్స ఖర్చు సగటున 5-10 రెట్లు అధికమని పార్లమెంటరీ కమిటీ పేర్కొంది. పీఈ పెట్టుబడులున్న ఆసుపత్రులు అధిక బిల్లులను వసూలు చేస్తున్నాయని ఆరోగ్య బీమా కంపెనీలు ఆరోపిస్తున్నాయి. ఆసుపత్రి బిల్లులు పెరిగితే, క్లెయిం చెల్లింపులు పెరుగుతాయి. ఫలితంగా ముమ్మందు బీమా ప్రీమియాలను పెంచాల్సి వస్తుంది. బీమా చెల్లింపులు ఆలస్యం చేస్తుండటం తమను ఇబ్బంది పెడుతున్నట్లు హాస్పిటల్స్ పేర్కొంటున్నాయి. దేశీయంగా జనాభాకు తగినట్లు ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కొరత, విదేశీ పెట్టుబడిదారులకు పెద్ద అవకాశంగా మారింది. బ్లూమ్‌బర్గ్ నివేదిక ప్రకారం, భారత్‌లో ప్రతి 1,000 మంది జనాభాకు సగటున 1.3 ఆసుపత్రి పడకలున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఇదే సమయంలో ప్రజల ఆదాయాలు, ఆయుర్దాయం పెరగడం, క్యాన్సర్, గుండె జబ్బులు, కిడ్నీ సంబంధిత వ్యాధుల విస్తృతి, ప్రత్యేక వైద్య సేవల అవసరం పెరుగుతుండటంతో ఆసుపత్రులకు గిరాకీ అధికమవుతోంది. చిన్న, మధ్యతరహా ఆసుపత్రులను కొనుగోలు చేసి, పెద్ద నెట్‌వర్క్‌లుగా మార్చడం, ప్రైవేట్ ఈక్విటీ సంస్థల ప్రధాన వ్యూహంగా మారింది. కేకేఆర్ దీనికి ప్రధాన ఉదాహరణ. 2024 జులైలో కేరళకు చెందిన 1,000 పడకల బేబీ మెమోరియల్ హాస్పిటల్‌లో కేకేఆర్ పెట్టుబడి పెట్టింది. అనంతరం వరుస కొనుగోళ్లు చేస్తోంది. స్వీడన్‌కు చెందిన మెడికవర్ భారత విభాగాన్ని రూ.13,000 కోట్ల కు కొనుగోలు చేయడం పూర్తయితే, దక్షిణ భారతదేశంలో కేకేఆర్ ఆధీనంలోని ఆసుపత్రి పడకల సంఖ్య దాదాపు 10,000కు చేరనుంది.గతంలో రేడియంట్ లైఫ్ కేర్‌లో పెట్టుబడి పెట్టిన కేకేఆర్.. దాన్ని మ్యాక్స్ హెల్త్‌కేర్‌తో విలీనం చేయించింది. 2022లో మ్యాక్స్ హెల్త్‌కేర్ నుంచి నిష్క్రమించింది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,57,582 | ₹ 1,71,909 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,45,000

## బోయిన్‌పేటలో నాకా బంది

### 110 లీటర్ల గుడుంబా, 35 బైకులు స్వాధీనం

మంథని, అక్టోబర్ 06, (జనంసాక్షి) : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయిన్‌పేట గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్, నాకా బందీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ గోదావరిఖని ఏసిపి మడత రమేష్, మంథని సీఐ బుద్ధి స్వామి, మంథని ఎస్సై సందీప్ తదితర అధికారులు పాల్గొన్నారు. బోయిన్ పేట ప్రాంతంలో శోధన నిర్వహించి, 110 లీటర్ల గుడుంబా (అక్రమ స్వేదన మద్యం) ను స్వాధీనం చేసుకుని, నిందితులపై 3 కేసులు నమోదు చేశారు. అదే విధంగా, ద్విచక్ర వాహన ఉల్లంఘనలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టి, 35 బైక్‌లను స్వాధీనం చేసుకుని, 8 పెట్టీ కేసులు నమోదు చేశారు. ఏసీపీ, సీఐ మంథని గ్రామస్థులతో మాట్లాడి, సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత, మాదకద్రవ్య దుర్వినియోగ నివారణ, ఇతర సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. అక్రమ మద్యం, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ప్రజలను కోరారు.



# నిర్మాణ లోపాలతో పెరుగుతున్న ప్రమాదాలు

- డీ765 రహదారి పనులు నత్తనడక.. ప్రమాదాలకు అడ్డుకట్టేదెప్పుడు?
- రూ.895 కోట్లతో 96 కిలోమీటర్ల విస్తరణ.. మూడేళ్లు గడిచినా పూర్తికాని పనులు



**బాన్సువాడ (జనంసాక్షి):**
మెదక్ నుంచి రుద్రూర్ వరకు ఉన్న డీ765 రెండు వరుసల రహదారిని నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.895 కోట్ల నిధులు మంజూరు చేసింది. 96 కిలోమీటర్ల మేర చేపట్టిన ఈ పనులు మూడేళ్లు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. మెదక్?ఎల్లారెడ్డి, ఎల్లారెడ్డి?రుద్రూర్ ప్రాంతాలుగా విభజించి పనులు చేపట్టినా నత్తనడకన కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.రహదారి పనులు అసంపూర్తిగా ఉండటం, రోడ్డు పక్కన కంకర కుప్పలు, మురికి కాలువలు, గ్రామాల వద్ద సరైన డివైడర్లు లేకపోవడం వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా గ్రామాల వద్ద రహదారి మధ్యలో పటిష్ఠమైన డివైడర్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇనుప రాడ్లతో జాలి తరహాలో ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.

**వారం రోజుల్లోనే ఇద్దరి మృతి**

ఇటీవల రహదారి నిర్మాణ పనుల కారణంగా వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నిజామాబాద్ జిల్లా అక్బర్‌నగర్ వద్ద రహదారి పక్కన ఉన్న కంకర కుప్పను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తిమ్మాపూర్‌కు చెందిన మరో యువకుడు ద్విచక్ర వాహనం అదుపుతప్పి నిర్మాణంలో ఉన్న మురికి కాలువలో పడడంతో మృత్యువాత పడ్డాడు. కంశెట్టిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి సైకిల్‌పై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందగా, తాజాగా కామారెడ్డి జిల్లా హాజీపూర్‌కు చెందిన కాట్రావత్ శంకర్ ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ప్రాణాలు కోల్పోయారు.

**అటవీ అనుమతులతో మరో అడ్డంకి**

ఒకవైపు రహదారి నిర్మాణ పనులు నెమ్మదిగా సాగుతుండగా, మరోవైపు నస్రుల్లాబాద్ అటవీ ప్రాంతంలో అటవీ శాఖ అనుమతులు రాక పనులు నిలిచిపోయాయి. ఇప్పటికే చేపట్టిన పనుల్లోనూ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.రహదారి నిర్మాణం పూర్తయ్యే వరకు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా గ్రామాల వద్ద పటిష్ఠమైన డివైడర్లు, హెచ్చరిక బోర్డులు, రహదారి పక్కన ఉన్న కంకర కుప్పలను తొలగించడం, అసంపూర్తి పనుల వద్ద భద్రతా ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పనుల్లో వేగం పెంచడంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




## వరకట్న వేధింపుల కేసులో కోర్టు సంచలన తీర్పు

### భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష.

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి(జనంసాక్షి):భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు నిజామాబాద్ సెషన్స్ జడ్జి జి.వి.ఎన్. భారత లక్ష్మి మంగళవారం సంచలన తీర్పు వెల్లడించారు. దోషికి కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఇందల్వాయి మండలం చంద్రాయన్ పల్లి గ్రామానికి చెందిన వేముల సాయిలుకు, డిచ్‌పల్లి గ్రామానికి చెందిన మనోజకు 2016 వ సంవత్సరంలో వివాహం జరిగింది. వివాహ సమయంలో ఎలాంటి నగదు, వరకట్నం లేకుండానే పెళ్లి ఘనంగా నిర్వహించుకున్నారు. కొన్నాళ్ల పాటు సాఫీగా సాగిన వీరి కాపురంలో కట్న పిశాచి కదలడంతో చిచ్చురేగింది. నగదు వరకట్నం కావాలంటూ సాయిలు తన భార్య మనోజను శారీరకంగా, మానసికంగా తీవ్రస్థాయిలో చిత్రహింసలకు గురిచేయసాగాడు.నువ్వు చనిపోతే నేను మరో పెళ్లి చేసుకుంటాను, అప్పుడు కట్నం డబ్బులు వస్తాయి అంటూ ఆమెను నిత్యం వేధింపులకు గురిచేసేవాడు. భర్త పెడుతున్న బాదలు భరించలేక మనోజ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. బాధలు భరించలేక విసిగి పోయిన మనోజ 2024 అక్టోబర్ 13 న చంద్రాయన్ పల్లి గ్రామ శివారులోని పెద్ద పోశమ్మ గుడి దగ్గర ఉన్న వేప చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు.ఈ ఘటనపై డిచ్‌పల్లి సర్కిల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో సాక్షుల వాంగ్మూలాలు, సాక్ష్యాలను పరిశీలించిన సెషన్స్ జడ్జి భారత లక్ష్మి నేరం రుజువు అయినట్లు నిర్ధారించారు.భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్ 85 కింద వరకట్న వేధింపులకు గాను మూడు సంవత్సరాల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. అలాగే ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు సెక్షన్ 108 ప్రకారం ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ జడ్జి తుది తీర్పును వెల్లడించారు.

## ఫోర్‌లైన్ పనులతో ధ్వంసమైన పైప్‌లైన్లు..

### నీళ్ల బిందెలతో హుస్నాబాద్-కరీంనగర్ రహదారి దిగ్బంధం

చిగురుమామిడి అక్టోబర్ 6(జనంసాక్షి):మండలంలోని కొండాపూర్ గ్రామంలో హుస్నాబాద్ - కరీంనగర్ ప్రధాన రహదారిపై ఉన్న కొండాపూర్ స్టేజీ వద్ద తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.మండల పరిధిలోని కొండాపూర్ గ్రామంలో గత పది రోజులుగా తాగునీటి కష్టాలు తారస్థాయికి చేరడంతో విసిగిపోయిన గ్రామస్తులు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చి బైఠాయించారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా జేసీబీలతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపడంతో గ్రామానికి తాగునీరు అందించే నల్లా పైపులు పూర్తిగా ధ్వంసమయ్యాయి.దీనివల్ల పది రోజులుగా చుక్క నీరు రాక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని,ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరువైపులా ఆర్టీసీ బస్సులు ,లారీలు,ఇతర వాహనాలు గంటల కొద్దీ నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.రాస్తారోకో విషయం తెలుసుకున్న కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అమృత వర్షిణి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులతో నేరుగా మాట్లాడి, సమస్య తీవ్రతను అర్థం చేసుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఆమె వెంటనే ట్రాక్టర్ల ద్వారా తాగునీటిని తెప్పించారు. నీటి ఇబ్బందిని తీర్చడంతో గ్రామస్తులు శాంతించి,తమ ఆందోళనను విరమించారు.ధ్వంసమైన పైప్‌లైన్ల మరమ్మతు పనులను కూడా యుద్ధప్రాతిపదికన చేపడతామని గ్రామంలో తాగునీటికి ఇకపై ఎలాంటి ఇబ్బందులు రాకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కార్యదర్శి అమృత వర్షిణి గ్రామస్తులకు హామీ ఇచ్చారు.



# మానాలకు ఎత్తిపోతల ద్వారా సాగు, త్రాగునీరు

### ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

**రుద్రంగి, అక్టోబర్ 6 (జనంసాక్షి):**రుద్రంగి మండలంలోని మానాలలో రహదారుల అభివృద్ధికి మరో ముందడుగు పడిందని ప్రభుత్వ సలహాదారు బోధన్ శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజాంబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రడ్డి లు అన్నారు.వారు మంగళవారం రుద్రంగి మండలంలోని ఉమ్మడి మానాలలో మాజీ నిజామాబాద్ డిసిసి అధ్యక్షుడు, మాజీ యూనియన్ కో-ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి తో కలిసి మొత్తం రూ.14 కోట్ల 20 లక్షల వ్యయంతో మూడు కీలక రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....మానాల గ్రామానికి రుద్రంగి మండల కేంద్రంలో కలిగోట సూరమ్మ చెరువు పనులు తుది దశకు చేరుతున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సలహా సూచనల మేరకు అట్టి జలాశయం నుండి ఎత్తిపోతల ద్వారా మానాలకు సాగు, త్రాగునీటిని అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే ఈరోజు మరిమట్ల రహదారి కి 7 కోట్ల 43 లక్షలు, మానాల రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరణ కోసం రూ.5 కోట్ల 60 లక్షలు, హనుమాన్ తండా (గొర్రెగుండం) రహదారి కి రూ.1 కోటి 17 లక్షల తో నిర్మించనున్న రోడ్లకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. త్వరలోనే ఇట్టి పనులు ప్రారంభమైతాయని తెలిపారు. అనంతరం నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు భూపతి రెడ్డి మాట్లాడుతూ... మానాల గ్రామానికి ఉద్యమాల చరిత్ర ఉందని, ప్రజా పాలనలో ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమం పథకాలను వివరించారు.మాజీ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ....తాను మానాల మోహన్ రెడ్డి గా గ్రామం పేరే ఇంటిపేరుగా గ్రామ ప్రజలు చూపిన ఆదర అభిమానాలతోనే అభివృద్ధి చెంది నిజామాబాద్, హైదరాబాద్ స్థాయికి ఎదిగానని భావోద్వాగానికి లోనై కంటతడి పెట్టారు.గిరిజనులకు పోడు పట్టాలు,పట్టాల పునరుద్ధరణ చేపట్టాలని,సాగు,త్రాగునీటి ఇబ్బందులు తీర్చాలని కోరారు. అందుకు రుద్రంగి సూరమ్మ చెరువు ప్రాజెక్టు నుండి లిఫ్టు ద్వారా మానాలకు త్రాగు సాగు నీరు అందించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ప్రభుత్వ సలహాదారు సురేందర్ రెడ్డికి మానాల ప్రజల తరఫున ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.సర్పంచ్ బుర్ర శంకర్ గౌడ్,బాల్కొండ నియోజకవర్గ ఇంచార్‌అనిల్ రెడ్డి,ఉర్దూ అకాడమీ కార్పొరేషన్ చైర్మన్ తాహెర్ బిన్ హైమద్, తాసిల్దార్ పుష్పలత, ఎంపీడీవో నటరాజ్,మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి, చందుర్తి సిఐ రవీందర్, ఎస్సై మోతి రామ్ నాయక్, రిటైర్డ్ ఏడిఈ భూక్య లక్ష్మణ్, రాజన్న సిరిసిల్ల డిసిసి ప్రధాన కార్యదర్శి తూమ్ జలపతి,మాజీ ఎమ్మెల్సీ అరికల నర్సారెడ్డి,చింతామణి తండా సర్పంచ్ గుగులోత్ సింధూజ గంగాధర్,రుప్లా తండా సర్పంచ్ జవహర్ నాయక్, గైదిగుట్ట సర్పంచ్ కిషన్,అడ్డ బోర్ తండా సర్పంచ్ మంజుల రాజు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీందర్ రెడ్డి,నాయకులు, మోహన్, వంశీ, లక్ష్మీనారాయణ, భూమన్న, వార్డ్ సభ్యులు, మహిళలు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.



## సుధాకర్ మృతి పోలీసుల వైఫల్యమే.

- ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు బొబ్బిలి వేణుగోపాల్.
- అరెస్టును తీవ్రంగా ఖండించిన బీజేపీ.



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):**
భీంగల్‌లో హోటల్ నిర్వహిస్తున్న వ్యక్తి పోలీసుల వేధింపుల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మృతిచెందిన ఘటనపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన బీజేపీ ఓబీసీ మోర్చా నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి వేణుగోపాల్‌ను పోలీసులు అరెస్టు చేయడం ఉద్రిక్తతకు దారితీసింది.ఈ సందర్భంగా వేణుగోపాల్ పోలీసుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. హోటల్ నిర్వాహకుడి మృతికి పోలీసుల వైఫల్యమే కారణమని ఆరోపిస్తూ, బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసుల ఒత్తిళ్లు, వేధింపులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన తమను అడ్డుకోవడం, ప్రశ్నించిన వారిని అరెస్టు చేయడం సమంజసం కాదని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఆసుపత్రి పరిసరాల్లో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకుని వేణుగోపాల్‌ను అక్కడి నుంచి తరలించారు.బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
7 అక్టోబర్ 2026

# ఓట్ల చోరీకి వ్యతిరేకంగా కరీంనగర్‌లో ఇండియా కూటమి గర్జన

- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇందిరా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ
- అంబేద్కర్ ఇచ్చిన ఓటును దొంగిలిస్తున్న బీజేపీ
- చొప్పదండి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం





**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ, ఎలక్షన్ కమిషన్‌లో జరుగుతున్న అవకతవకలు, ఓట్ల చోరీకి వ్యతిరేకంగా, రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా మంగళవారం కరీంనగర్ జిల్లా కాంగ్రెస్, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందిరా చౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మోడీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, వోడితల ప్రణవ్ బాబు, ఊట్కూరు నరేందర్ రెడ్డి, సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు అంబటి జోజి రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి వాసుదేవ రెడ్డి, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్, సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) జిల్లా కార్యదర్శి జిన్నం ప్రసాద్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశంలో అతిపెద్ద దోపిడీ, దొంగతనం ఇదేనని ఆరోపించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మనకు కల్పించిన ఓటు హక్కును దొంగతనం చేసే కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం చేపడుతున్న సందర్భంలో జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించి, అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ ఎలక్షన్ కమిషన్ బీజేపీకి యువమోర్చా, మహిళా మోర్చాలా అనుబంధ విభాగంగా మారిపోయిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు, బయట విద్యావంతులు, సామాజిక వర్గాల్లో చర్చిస్తున్న అంశం ఒకటేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవాలని, భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని, ఈ అన్యాయం తొలగే వరకు అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ ద్వారా దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించి ఎన్నికలు గెలవాలనే దురుద్దేశంతో బీజేపీ చేస్తున్న అన్యాయాన్ని ఎండగట్టేందుకు ఇండియా బ్లాక్ రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ఈ పోరాటాన్ని ముందుకు తీసుకుపోతున్నారని తెలిపారు.

**జ్ఞానేష్ కుమార్ వెంటనే తప్పుకోవాలి : మేడిపల్లి సత్యం**

డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. ఈ దేశంలో మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఎవరైతే పోరాడుతున్నారో వారందరినీ ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రక్రియ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలో జరుగుతోందన్నారు. ఇండియా కూటమిలోని అన్ని భాగస్వామ్య పార్టీలు జ్ఞానేష్ కుమార్ ఆ పదవి నుంచి దిగిపోయేంత వరకు పోరాడుతాయని, ఈ ఉద్యమాన్ని, ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అనంతరం సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని జిల్లా కలెక్టర్ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఇండియా కూటమి సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ సుహాసిని, ఆకారం భాస్కర్ రెడ్డి, ఎం.డి. తాజ్, ముత్యం శంకర్ గౌడ్, సతీష్ యాదవ్, బానోతు శ్రావణ్ నాయక్, ఫహాద్, సృజన్, పంజాల శ్రీనివాస్ గౌడ్, కొరివి అరుణ్ కుమార్, పులి ఆంజనేయులు గౌడ్, జూపాక శ్రీనివాస్, మిల్కూరు వాసుదేవ రెడ్డి, వెన్నరాజ మల్లయ్య, గుడికందుల సత్యం, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, మల్యాల సుజిత్ కుమార్, అబ్దుల్ రెహమాన్, అశోక్ రెడ్డి, చర్ల పద్మ, కుంభాల రాజు కుమార్, బషీరుద్దీన్, జి.ఎస్. ఆనంద్, స్వప్న శ్రీ, తిరుమల్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కును కాపాడుదాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం

- ఎల్లారెడ్డిలో ఘనంగా 'వోట్ బచావో-దేశ్ బచావో' ర్యాలీ
- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో భారీగా పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు




**కామారెడ్డి జిల్లా ప్రతినిధిఅక్టోబర్ 6 (జనంసాక్షి)** ఓటు హక్కును పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఎల్లారెడ్డి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'వోట్ బచావో–దేశ్ బచావో' ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏఐసీసీ , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు నిర్వహించిన ఈ ర్యాలీకి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ నాయకత్వం వహించారు. ఎల్లారెడ్డి అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ర్యాలీలో ముందుగా అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా పట్టణంలో ముందుకు సాగారు. ప్రతి అర్హుడి ఓటు హక్కును కాపాడాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయాలని నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 326ను బహిరంగంగా చదివి సార్వత్రిక వయోజన ఓటుహక్కు ప్రాధాన్యతను వివరించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు ప్రజాస్వామ్యానికి కీలకమని, ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని నాయకులు పిలుపునిచ్చారు. ర్యాలీలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్లు, వివిధ సెల్స్, డిపార్ట్‌మెంట్ల ప్రతినిధులు, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ ముగింపు సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించి, అనంతరం జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు.

## ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ పీఠం కోసం పోరు

# పాతవారికా? కొత్తవారికా?

- డీసీసీబీ చైర్మన్ పదవి రేసులో తీవ్రమవుతున్న రాజకీయం
- ఆశావహుల ఆశలు, పార్టీ క్యాడర్ నైతికతపై విశ్లేషణ



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 06 జనం సాక్షి:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ పీఠం చుట్టూ రాజకీయం మరోసారి వేడెక్కింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోచరం భాస్కర్ రెడ్డి చైర్మన్‌గా ఉన్న ఈ కీలక పదవిని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవిశ్వాస తీర్మానం ద్వారా కుంట రమేష్ రెడ్డి దక్కించుకున్నారు. ఇప్పుడు ఆయన పదవీకాలం ముగియడం, నూతన చైర్మన్ ఎంపిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో రాజకీయం రసవత్తరంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో, బోధన్ ఎమ్మెల్యేగా పి. సుదర్శన్ రెడ్డి గెలవడంలో కుంట రమేష్ రెడ్డి పాత్ర కీలకమనే వాదన బలంగా వినిపిస్తోంది. "సుదర్శన్ రెడ్డి గెలిస్తే ఆ పదవి రమేష్ రెడ్డికే దక్కుతుంది" అనే ముద్ర పార్టీ వర్గాల్లో గట్టిగా పడిపోయింది. ఈ సమీకరణం కారణంగా ఈ పదవి ప్రతిసారీ ఒకే వ్యక్తికి పరిమితం అవుతుందనే చర్చ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు, నందిపేట్ మండలం ఐలాపూర్ గ్రామానికి చెందిన పొద్దుటూరి పూర్ణచంద్ర శేఖర్ రెడ్డి కూడా ఆ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయనతో పాటు పార్టీ కోసం కష్టపడిన ఎందరో ఆశావాహులు సైతం రేసులో నిలిచేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రతీసారి ఒకే వర్గానికి లేదా ఒకే వ్యక్తికి అవకాశం ఇస్తే, పార్టీని నమ్ముకుని కష్టపడే ద్వితీయ శ్రేణి నాయకులకు ఎప్పుడు అవకాశం దొరుకుతుందనే ప్రశ్న ఇక్కడ ఉద్భవిస్తోంది. ప్రతి రాజకీయ పార్టీలోనూ క్షేత్రస్థాయి నుంచి పనిచేసే నాయకులకు తగిన గుర్తింపు లభించినప్పుడే క్యాడర్‌లో జోష్ ఉంటుంది. కేవలం కొన్ని సమీకరణాలకే పరిమితం కాకుండా, పార్టీ కోసం చెమటోడ్చిన ఆశావాహులందరికీ సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. అప్పుడే నాయకుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది మరియు పార్టీ మరింత పటిష్టశీ అవుతుంది. సహకార రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు, నాయకుల ఆకాంక్షలకు, పార్టీ క్యాడర్ నైతికతకు మధ్య సమతుల్యత సాధించడం కాంగ్రెస్ అధిష్టానానికి ప్రస్తుతం అతిపెద్ద సవాల్‌గా మారింది. మరి ఈసారి అధిష్టానం పాత వారికే మళ్లీ పట్టం కడుతుందా? లేక కొత్త ఆశావహులకు తలుపులు తెరుచుకుంటాయా? వేచి చూడాల్సిందే.

## ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు

### మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి

**జమ్మికుంట, అక్టోబర్ 06 (జనంసాక్షి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని షాపుల యజమానులు ట్రేడ్ లైసెన్స్ తీసుకొని తమ వ్యాపారాన్ని నిబద్ధత కొనసాగించాలని జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి తెలిపారు. మంగళవారం జమ్మికుంట బస్టాండ్ ఎదురుగా గల లక్ష్మీపతి కిరాణం యజమాని సూదం శివకుమార్ గత కొన్ని సంవత్సరాలుగా ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నాడని ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసిన స్పందించకపోవడంతో సానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్ లక్ష్మీపతి కిరాణం షాపుకు తాళం వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని అనుమతులతో వ్యాపారం చేసుకుంటే మున్సిపల్ సిబ్బంది సహకరిస్తారని నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తే మున్సిపల్ ఆక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గత కొన్ని సంవత్సరాలుగా మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్ను చెల్లించకుండా అనుమతులు తీసుకోకుండా వ్యాపారం చేస్తే ఇలాంటి చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది కొలుగురి కిరణ్,ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కల్లు డిపోలపై నార్కోటిక్స్ కొరడా

- కామారెడ్డిలో ఆకస్మిక తనిఖీలతో నిర్వాహకుల్లో కలకలం
- ఇద్దరి అరెస్టుతో మరింత అప్రమత్తం
- సమాచారం అందగానే పలు దుకాణాలకు తాళాలు
- పరిసర ప్రాంతాలకూ విస్తరించిన తనిఖీల ప్రభావం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 6 (జనం సాక్షి):** కామారెడ్డి పట్టణంలో నార్కోటిక్స్ పోలీసులు చేపట్టిన ఆకస్మిక తనిఖీలు కల్లు డిపోల నిర్వాహకుల్లో తీవ్ర కలకలం రేపాయి. చట్టవిరుద్ధ కార్యకలాపాలు, కల్తీ కల్లు విక్రయాలపై నిఘాలో భాగంగా అధికారులు ముందస్తు సమాచారం లేకుండా పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. ఈ క్రమంలో బాలాగౌడ్, జీవన్‌గౌడ్ అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు సమాచారం. విషయం ఇతర డిపోల నిర్వాహకులకు చేరడంతో ఒక్కసారిగా అప్రమత్తమైన వారు దుకాణాలకు తాళాలు వేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ముఖ్యంగా సెకండ్ డిపో పరిధిలోని నిర్వాహకులు సమాచారం అందుకున్న వెంటనే దుకాణాలు మూసివేశారు. అనంతరం నంబర్–1 డిపో వైపు పోలీసులు వెళ్లేలోపే అక్కడి నిర్వాహకులు కూడా తాళాలు వేసి వెళ్లిపోయారు. దీంతో తనిఖీలకు వెళ్లిన అధికారులకు కొన్ని దుకాణాలు ఖాళీగా కనిపించాయి. పట్టణానికే పరిమితం కాకుండా తనిఖీల సమాచారం పరిసర ప్రాంతాలకు వేగంగా వ్యాపించింది. దేవునిపల్లి, రామేశ్వర్‌పల్లి, భిక్కనూరు తదితర ప్రాంతాల్లోని కల్లు దుకాణాల నిర్వాహకులు సైతం ముందస్తు జాగ్రత్తగా దుకాణాలు మూసివేసినట్లు సమాచారం. ఎప్పుడు, ఎక్కడ తనిఖీలు జరుగుతాయో తెలియక పలువురు నిర్వాహకులు అందుబాటులో లేకుండా వెళ్లిపోయారు. వరుస తనిఖీలు, ఇద్దరి అరెస్టులతో కామారెడ్డి డివిజన్‌లోని కల్లు డిపోల నిర్వాహకుల్లో ఆందోళన నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించే కార్యకలాపాలపై నిఘాను మరింత పెంచేందుకు నార్కోటిక్స్ పోలీసులు చర్యలు చేపడుతున్నట్లు ఈ తనిఖీలు స్పష్టం చేస్తున్నాయి.

# రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

### రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,ముఖ్యమంత్రి ఓఎస్డీ శ్రీనివాసులు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 6 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై మంగళవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్,ముఖ్యమంత్రి ఓఎస్డీ శ్రీనివాసులు,వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ముఖ్యమంత్రి ఓఎస్డీ శ్రీనివాసులు తెలిపారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం,తదితర నిర్మాణ పనులపై హైదరాబాద్‌లోని డా బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,అధికారులు సచివాలయంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించగా,రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ముఖ్యమంత్రి ఓఎస్డీ శ్రీనివాసులు సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. వీటీఏడీఏ ఆధ్వర్యంలో చేపడుతున్న భవిష్యత్తులో రద్దీ ప్రకారం ప్రణాళిక ప్రకారం అన్ని వసతులు కల్పించాలని వారు ఆదేశించారు. ప్రతి అధికారి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టారని, నిధులు మంజూరు చేస్తున్నారని,పనుల ప్రక్రియపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారని వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా ముందుకెళ్లాలని సూచించారు.శ్రీ విధుశేఖర భారతి స్వామి,సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయ విస్తరణ పనులను చేయాలని ఆదేశించారు. అధికారులందరూ ఈ పనులు తమవిగా భావించి పూర్తిస్థాయిలో నిమగ్నమై వేగంగా పూర్తి చేయించాలని సూచించారు.అధికారులు అన్ని పనులు నిర్ణీత గడువులోగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.



## రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ సిమ్మింగ్ పోటీలకు మానేరు విద్యార్థులు

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 06(జనంసాక్షి) :** హైదరాబాద్‌లో జరగనున్న 70వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్ 17 బాల బాలికల స్విమ్మింగ్ పోటీలకు కరీంనగర్ పద్మనగర్‌లోని మానేరు సిబిఎస్ఈ పాఠశాల కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో రాణించిన నాగుల హాసిని, నాగుల ప్రవస్థి లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. రాష్ట్ర పోటీల్లో రాణించి జాతీయ పోటీలకు ఎంపిక కావాలని సూచించారు. మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీత రెడ్డి, ప్రిన్సిపల్ రాజు చాకో, పిఈటిలు సిలివేరి మహేందర్, స్వామి, తిరుపతి, అఖిలాశ, సాయి, అన్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# రోగులకు నాణ్యమైన వైద్యం.. భూ సేకరణ వేగవంతం

- రోగుల రద్దీ పెరిగినా సేవల నాణ్యత తగ్గకూడదు
- పాఠశాలల్లో విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి
- కానంపల్లి చెరువు భూ సేకరణను త్వరగా పూర్తి చేయాలి
- బైపాస్ రోడ్డు రైతులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలి



**పెద్దపల్లి, అక్టోబర్ 6 (జనంసాక్షి):** జిల్లాలో పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా ముందస్తు చర్యలు చేపట్టి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. రోగుల రద్దీ పెరిగినా వైద్య చికిత్స నాణ్యత, వైద్యులు, సిబ్బంది వ్యవహారశైలిలో ఎలాంటి మార్పు ఉండకూడదని స్పష్టం చేశారు. మంగళవారం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రతి రోగితో ఓర్పుగా, మర్యాదగా వ్యవహరించాలని, ముఖ్యంగా పేదలు ఎంతో నమ్మకంతో ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నందున వారి నమ్మకాన్ని నిలబెట్టేలా సేవలు అందించాలని సూచించారు. అనంతరం పెద్దబొంకూర్ జడ్పీహెచ్ఎస్‌ను తనిఖీ చేసి విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజనం, పదో తరగతి విద్యార్థుల సన్నద్ధతను పరిశీలించారు. విద్యార్థుల హాజరుకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలని సూచించారు. పదో తరగతి సిలబస్‌ను సకాలంలో పూర్తి చేసి ప్రత్యేక తరగతులు, పునశ్చరణ నిర్వహించాలని ఆదేశించారు.

అనంతరం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ శ్రీరాములుతో కలిసి అటవీ, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో భూ సేకరణపై సమీక్ష నిర్వహించారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ధర్మారం మండలం కానంపల్లి చెరువు భూ సేకరణపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ అంశాలను పరిష్కరించాలని సూచించారు. పెద్దపల్లి బైపాస్ రోడ్డు కోసం భూములు కోల్పోతున్న రైతులతో చర్చలు జరిపి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకోవాలని అన్నారు. చట్టం, నిబంధనల ప్రకారం రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూ సేకరణ రికార్డులు, పరిహారం చెల్లింపులు, ఇతర పెండింగ్ అంశాలను శాఖల వారీగా సమీక్షిస్తూ నిర్ణీత గడువులో ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో పెద్దపల్లి ఆర్డీఓ బి.గంగయ్య, తహసీల్దార్ రాజయ్య, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

- మాతా-శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి, జిల్లా ప్రతినిధి అక్టోబర్ 6 (జనం సాక్షి) :** జిల్లాలోని ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. మాతా–శిశు ఆరోగ్య పరిరక్షణతో పాటు వ్యాధుల నివారణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన వైద్య ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు 2026 వరకు శాఖ సాధించిన ప్రగతిని కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో అసంక్రమిత వ్యాధుల గుర్తింపు పరీక్షల్లో 88 శాతం ప్రగతి సాధించి రాష్ట్రంలో రెండో స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. రక్తపోటు నియంత్రణలో 54 శాతం, మధుమేహ నియంత్రణలో 58 శాతం ప్రగతి నమోదైనట్లు తెలిపారు. ఈ–సంజీవని ద్వారా ఆగస్టు నెలలో 36,916 టెలి వైద్య సంప్రదింపులు నిర్వహించి రాష్ట్రంలో మూడో స్థానంలో నిలవడం ప్రశంసనీయమన్నారు.

జిల్లాలో సి–సెక్షన్ ప్రసవాల శాతం 67.5 శాతంగా ఉండటంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 52.7 శాతం, ప్రైవేటు ఆసుపత్రుల్లో 87 శాతం సి–సెక్షన్లు జరుగుతున్న నేపథ్యంలో అనవసర శస్త్రచికిత్సలను నివారించేందుకు ప్రైవేటు ఆసుపత్రుల్లో తప్పనిసరిగా సి–సెక్షన్ ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. కామారెడ్డి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ప్రాథమిక సి–సెక్షన్ కేసుల్లో ప్రతి కేసుకు పార్టోగ్రామ్‌ను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు అవసరమైన సందర్భాల్లో రెండో వైద్య అభిప్రాయం తీసుకోవాలని సూచించారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, జిల్లాలో గుర్తించిన 4,213 మంది అధిక ప్రమాద గర్భిణులపై నిరంతర పర్యవేక్షణ, అనుసరణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దకొడప్గల్, బాన్సువాడ, కామారెడ్డి ప్రాంతాల్లో వెనుకబడిన ఆరోగ్య సూచికలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

బాలికల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఉద్దేశించిన హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇంకా టీకా పొందని 5,451 మంది బాలికలకు పాఠశాలల వారీగా కార్యాచరణ రూపొందించి టీకాలు అందించాలని సూచించారు. డెంగ్యూ, టైఫాయిడ్ తదితర సీజనల్ వ్యాధుల నియంత్రణకు పంచాయతీరాజ్, పురపాలక శాఖలతో సమన్వయం చేసుకుని విస్తృతంగా పారిశుధ్య చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత నమ్మకం కలిగేలా వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకట్, కామారెడ్డి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, బాన్సువాడ సూపరింటెండెంట్ శ్రీనివాస్, బీడబ్ల్యూఓ వెంకటేశ్వర్లు, వైద్యులు, అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయాన్ని కృష్ణశిలలతోనే నిర్మించాలి

- ఆగమ శాస్త్రం ప్రకారం పనులు చేపట్టాలి
- రైతులకు నవంబర్ వరకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలి
- సిరిసిల్లలో రూ.32 కోట్ల అవినీతిపై విచారణ జరపాలి
- నేరెళ్ల బాధితులకు న్యాయం చేసే వరకు పోరాటం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 6 (జనంసాక్షి):** వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులను కృష్ణశిలలతో, ఆగమ శాస్త్రం ప్రకారం చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మంగళవారం వేములవాడలో రాజరాజేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, కోడె మొక్కులు చెల్లించిన అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆలయ నిర్మాణంలో కాంక్రీట్ వినియోగంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆలయ ప్రాచీనతను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలం నిలిచేలా కృష్ణశిలలతో నిర్మించాలని కోరారు. ఆలయ గోశాలలో కోడెలకు సరైన పశుగ్రాసం అందక మృత్యువాత పడుతున్నారన్న ఫిర్యాదులపై అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వేములవాడలో రోడ్లు, డ్రైనేజీ, ఆలయ చెరువు సమస్యలను పరిష్కరించాలని, అండర్ డ్రైనేజీపై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టి సారించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు ఆశించిన ప్రయోజనం కలగలేదని ఆమె ఆరోపించారు. అప్పర్ మానేరు–మిడ్ మానేరు లింక్, రుద్రంగి రిజర్వాయర్ తదితర పనులను పూర్తి చేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు నవంబర్ వరకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని, ప్రభుత్వం అవసరమైతే విద్యుత్‌ను కొనుగోలు చేసైనా సరఫరా చేయాలని అన్నారు. సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ(సెస్)లో రూ.32 కోట్ల అవినీతి జరిగిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలని, వారికి తగిన పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కవిత కోరారు. నేరెళ్ల ఘటనపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఎస్పీని డిమాండ్ చేశారు. గల్ఫ్ కార్మికుల సమస్యలపై స్పందిస్తూ మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. సిరిసిల్లలో రైల్వేలైన్, జాతీయ రహదారి పనులను పూర్తి చేయాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తీరుపై విమర్శలు చేసిన ఆమె, ప్రభుత్వం పలు అంశాలపై కమిటీలు వేస్తూ కాలయాపన చేస్తోందని ఆరోపించారు. మాజీ మంత్రి కేటీఆర్ హయాంలో సిరిసిల్లలో ఏర్పాటు చేసిన విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కొరత ఉందని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జర్నలిస్టులు, వైద్యం, విద్య రంగాల సమస్యల పరిష్కారానికి తమ పార్టీ తరఫున పోరాడతామని తెలిపారు. మాజీ మావోయిస్టులు రాజకీయాల్లోకి రావాలని, తమ పార్టీలో చేరాలని ఆహ్వానించారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్

- యువతలో నిరంతరం అవగాహన కల్పించాలి: మంత్రి అడ్లూరి
- సింగరేణి ప్రాంతాల్లోనూ 'మిషన్ పరివర్తన' విస్తరించాలి
- డీ-అడిక్షన్ చికిత్సకు అవసరమైన చర్యలు తీసుకోవాలి
- డ్రగ్స్ రహిత సమాజం కోసం సమష్టిగా కృషి చేయాలి



**ధర్మారం, అక్టోబర్ 6 (జనంసాక్షి):** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్‌ను నిర్మించుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కావొద్దని, వాటి నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లిలోని మహేశ్వర ఫంక్షన్ హాల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మిషన్ పరివర్తన' అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రామ్‌రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సరదా, థ్రిల్ కోసం కూడా మాదకద్రవ్యాలను ప్రయత్నించకూడదని, వాటికి బానిసైతే విద్య, కెరీర్‌తో పాటు భవిష్యత్ దెబ్బతింటుందని హెచ్చరించారు. ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని కలెక్టర్‌ను ఆదేశించారు. సింగరేణి ప్రాంతాల్లోనూ మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి ప్రభావానికి గురైన వారిని గుర్తిస్తే అధికారులకు సమాచారం అందించాలని, అవసరమైన డీ-అడిక్షన్ చికిత్స అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.
కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ 'మిషన్ పరివర్తన' వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి యువత, విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని అన్నారు. డీసీపీ రామ్‌రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి అక్రమ విక్రయాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువత క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ తమ ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి, కలెక్టర్, డీసీపీ, పోలీస్ అధికారులు, యువత, ప్రజలు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. డ్రగ్స్ వినియోగం, విక్రయాలు, రవాణాకు సంబంధించిన సమాచారం అధికారులకు అందించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞలో పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, ఏసీపీ కృష్ణ, పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు

# డీడీలు కట్టి ఏడు నెలలు.. ట్రాన్స్‌ఫార్మర్ మాత్రం బిగిస్తలే?

- మంజూరైన పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్‌కు మాత్రం మోక్షం లేదు!
- సీరియల్ నంబర్ 5 తర్వాత వారికి ముందుగా బిగింపు..
- విద్యుత్ శాఖ అధికారుల తీరుపై రైతు ఆగ్రహం



**సదాశివనగర్, అక్టోబర్ 6 (జనంసాక్షి):** కరెంట్ కనెక్షన్ కోసం డీడీలు చెల్లించి ఏడు నెలలు గడిచినా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంతో ఉత్తునూర్ గ్రామానికి చెందిన ఓ రైతు విద్యుత్ శాఖ తీరుపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తనకు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై, విద్యుత్ పోల్స్ సైతం మంజూరైనప్పటికీ కనెక్షన్ మాత్రం ఇవ్వకపోవడంపై మండిపడుతున్నాడు. సీరియల్ నంబర్ ప్రకారం ముందు గా రావాల్సిన కనెక్షన్‌ను పక్కనపెట్టి.. తన తర్వాత సీరియల్ ఉన్న రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడం ఏ నిబంధనల ప్రకారం జరుగుతోందని ప్రశ్నిస్తు న్నా డు. డీడీలు కట్టి నెలల తరబడి ఎదురుచూస్తున్న రైతులకు ఒక న్యాయం.. తర్వాత వచ్చిన వారికి మరో న్యాయమా? అంటూ నిలదీస్తు న్నాడు. "డబ్బులు కట్టి ఏడు నెలలైంది. ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైంది.. పోల్స్ కూడా వచ్చాయి. అయినా బిగించడానికి ఎందుకు ఇంత జాప్యం?" అంటూ రైతు ప్రశ్నిస్తున్నాడు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సీరియల్ ప్రకారం కనెక్షన్లు ఇవ్వడంతో పాటు, మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే బిగించాలని కోరుతున్నాడు. రైతులకు సేవలందించాల్సిన విద్యుత్ శాఖలోనే సీరియల్ క్రమం ఎందుకు అమలు కావడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నా యి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, ఎవరికి ఏ ప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్లు బిగిస్తున్నారో స్పష్టం చేయాలని రైతులు కోరుతున్నారు.

### "ఇందిరమ్మ టవర్స్ పనులు త్వరితగతిన పూర్తి చేసి"

# ఏడాదిలోపే లబ్ధిదారులకు తాళాలు అందజేస్తాం

- ఇందిరమ్మ టవర్స్ వేగంగా నిర్మించే కాంట్రాక్టర్లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు
- 5,218 మంది అర్హుల నుంచి లక్కీడ్రా.. 480 కుటుంబాలకు ఇళ్ల కేటాయింపు
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 6(జనం సాక్షి) :** ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు తొలివిడత ప్రయోగాత్మకంగా నిర్మిస్తున్న లక్ష ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను హైదరాబాద్ క్యూర్ పరిధిలో పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి ఏడాదిలోగా లబ్ధిదారులకు అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీనిలో భాగంగా ఏడాది గడువును కాంట్రాక్టర్లకు నిర్దేశించామని అయితే ఒక నెల ముందుగా పూర్తి చేస్తే రూ.45 లక్షలు, రెండు నెలల ముందుగా పూర్తి చేస్తే రూ. 90 లక్షలు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తామని తెలిపి నిర్మాణాలు చేపట్టనున్నామని తెలిపారు.
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో మంగళవారం ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సహచర మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే కే.పీ. వివేకానంద, పలువురు లబ్దిదారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు 23 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఇందిరమ్మ టవర్స్ ను నిరంతర ప్రక్రియగా నిర్మిస్తామని తెలిపారు.
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఇళ్ల కోసం 7,000 మందికి పైగా దరఖాస్తులు అందగా, పరిశీలన అనంతరం 5,218 మంది అర్హులుగా తేలారని అర్హులైన వారిలో లబ్ధిదారుల ఎంపికను బహిరంగంగా లక్కీ డ్రా ద్వారా చేపట్టి, 480 మంది లబ్ధిదారులను తుది జాబితాలో ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఎంపిక ప్రక్రియను ఆన్‌లైన్ విధానంలో పారదర్శకంగా నిర్వహించామని, ఎవరికి ఏ విధంగా ఇల్లు మంజూరైందనే వివరాలను కూడా లబ్ధిదారులకు తెలియజేయడంతో పాటు సంబంధిత ధ్రువపత్రాలను అందజేస్తామని తెలిపారు. ప్రస్తుతం కేటాయించిన ఇళ్లతో కార్యక్రమం ముగియదని, మరో మూడు విడతల్లోనూ ఇళ్ల నిర్మాణాన్ని చేపడతామని మంత్రి తెలిపారు తెలిపారు.
ప్రస్తుతం సుమారు 7.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉందని, దీనితో పాటు నియోజకవర్గంలో ఉన్న ఇతర ప్రభుత్వ, హౌసింగ్ శాఖ భూములను గుర్తించి అక్కడ కూడా పేదలకు ఇళ్లు నిర్మించే చర్యలు చేపడతామని తెలిపారు. ఈ మేరకు హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే సూచనలు చేసినట్లు వెల్లడించారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మంత్రి అన్నారు. లబ్దిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. "మీ కళ్ల ముందే మీ ఇల్లు నిర్మించబడాలి.. నాణ్యతతో కూడిన ఇంటిని సొంతం చేసుకున్నామనే తృప్తి, ఆనందం మీకు కలగాలి అనేదే ఇందిరమ్మ ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు పేదల చిన్న చిన్న కోరికలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం ఆ దిశగా చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. పేదవాడి సొంతింటి కలను కేవలం హామీగా కాకుండా, కార్యరూపంలోకి తీసుకువస్తున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్, జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ శాఖ సెక్రటరీ వి.పి.గౌతమ్, కలెక్టర్ మనూ చౌదరి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు లబ్దిదారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే

**బొంగ్లూర్ నుంచి ఇంజాపూర్ దాకా ప్రయాణం.. ఉచిత బస్సు ప్రయాణం తీరును పరిశీలన**



**రంగారెడ్డి, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. మహిళా ప్రయాణికులతో మాట్లాడి ఉచిత బస్సు ప్రయాణం అమలు తీరును తెలుసుకున్నారు. రంగారెడ్డి కలెక్టరేట్‌కు అఖిలపక్ష ధర్నాకు హాజరైన ఆయన... తిరిగి వెళ్లే క్రమంలో బొంగ్లూర్ ఓఆర్ఆర్ వద్ద కాసేపు ఆగారు. ఇదే సమయంలో ఇబ్రహీంపట్నం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆపిన ఆయన బస్కెక్కి కండక్టర్ వద్ద టికెట్ తీసుకున్నారు. సీట్లో కూర్చొని ప్రయాణించిన ఎమ్మెల్యే... బస్సులో వెళ్తున్న విద్యార్థినులు, మహిళలతో మాట్లాడారు. ఉచిత టికెట్ ప్రయాణం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కళాశాల నుంచి తిరిగి వెళ్తున్న పలువురు విద్యార్థిను లు ఎమ్మెల్యేకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా చేకూరుతున్న ప్రయోజనాలను వివరించారు. గతంలో కళాశాల బస్సులో వెళితే తమకు యాభై వేల దాకా చెల్లించేవారమని.... ఉచిత బస్సు పథకంతో ఆర్టీసీలోనే ప్రయాణం చేస్తున్నట్లు చెప్పారు. పుట్టింటి నుంచి వస్తున్న ఓ మహిళ మాట్లాడుతూ.. రూపాయి చెల్లించకుండా తన అమ్మానాన్నల వద్దకు వెళ్లి వస్తున్నట్లు వివరించారు. ఇలా.. మరికొందరు ప్రయాణికులు సైతం ఉచిత ప్రయాణంతో కలుగుతున్న ప్రయోజనాలను ఎమ్మెల్యేతో పంచుకుని... ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. డ్రైవర్, కండక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే రద్దీ విషయమై ఆరా తీశారు. సిబ్బంది తన దృష్టికి తీసుకువచ్చిన పలుసమస్యలను పరిశీలిస్తామని చెప్పారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం తెచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలో రోజూ దాదాపు నలభై లక్షల మంది ఉచిత ప్రయాణం చేస్తుంటే.... ఇబ్రహీంపట్నం డిపో పరిధిలోనే లక్ష మందికి పైగా ఉచితంగా ప్రయాణం చేస్తున్నట్లు మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. కాలం చెల్లిన బస్సుల స్థానంలో ఈవీలు తీసుకువస్తున్నట్లు చెప్పారు.

## పాత కక్షల నేపథ్యంలో హత్యాయత్నం

**బీరు సీసాతో తలపై కొట్టిన ఇద్దరు వ్యక్తులు అరెస్ట్**

**కథలాపూర్ అక్టోబర్ 6 (జనం సాక్షి) :** మండలంలోని తాండ్రియాల గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్, తండ్రి పేరు షేక్ ఇమామ్ అనే వ్యక్తిపై పాత కక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన సొరపాక నవీన్, తండ్రి నర్సయ్య మరియు కారం రాజు, తండ్రి శంకర్ అనే ఇద్దరు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడినారు. తేదీ: 05-10-2026 సోమవారం రోజున రాత్రి సుమారు 9:00 గంటల సమయంలో తాండ్రాల గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద నిందితులు మద్యం సేవిస్తూ, షేక్ ఇమ్రాన్‌కు ఫోన్ చేసి అక్కడికి పిలిపించారు. అనంతరం అతనిని చంపాలనే ఉద్దేశంతో బీరు సీసాతో తలపై కొట్టడంతో తలకు తీవ్ర రక్తగాయం అయినదని షేక్ ఇమ్రాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా సూరపాక నవీన్ మరియు కారం రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని, ఈ సందర్భంగా ఎస్సై రవికిరణ్ మాట్లాడుతూ, మండలంలో ఎవరైనా ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆర్టీసీ కార్మికులకు అండగా ఉన్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం

**కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్**

**హుజురాబాద్, అక్టోబర్ 6 (జనం సాక్షి) :** కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని,ఐక్య కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఈ నెల 9 జరిగే ఆర్టీసీ ఎన్నికలకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం ఎలా ఇబ్బంది పెట్టిందో వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విశేషంగా కృషి చేస్తున్నారని,కార్మికులకు అందే ఫలాలను అందజేస్తున్నారని అలాగే కార్మికుల హక్కుల కోసం నిరంతరం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని వివరించారు.కార్మికులకు ప్రభుత్వానికి వారధిగా మంత్రి పొన్నం నిలుస్తున్నారని, విలీనం అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందని, పదేళ్లుగా చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వంలో చేసి చూపించమని అన్నారు.ఈ ఎన్నికల్లో ప్రభుత్వానికి మద్దతుగా కార్మికులు నిలవాలని కోరారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు పవిత్రమైనది

### ఓట్ల తొలగింపును సహించం..

- సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి డిమాండ్




**తలకొండపల్లి అక్టోబర్ 06(జనంసాక్షి):** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని,అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కు పరిరక్షించబడాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు.ఏఐసీసీ,ఇండియా కూటమి ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.కాంగ్రెస్,సీపీఎం,సీపీఐ,జనసమితి పార్టీల ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షులు పారిజాత నర్సింహ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తో కలిసి కసిరెడ్డి నారాయణ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకత,నిష్పక్షపాతంగా వ్యవహరించడం ఎన్నికల కమిషన్ బాధ్యత అన్నారు.కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ బీజేపీ కేంద్ర ప్రభుత్వం చెప్పినట్టు వింటూ,బీజేపీ కోసం అర్హులైన వారి ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు.ముఖ్యంగా ఫారం-6 లో చాలా లోపాలు ఉన్నాయని,ఫారం-7 ను స్వలాభం కోసం వాడుతున్నారని, సర్ లో అవకతవకలకు పాల్పడిన జ్ఞానేష్ కుమార్ తన పదవి నుంచి తప్పుకొని వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.రాజ్యాంగబద్ధంగా నియమించబడ్డ ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు.ఒక్క అర్హుడి ఓటు కూడా తొలగిపోకుండా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ,కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని ఓటర్ల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్,డీసీసీ ఉపాధ్యక్షులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహా,డీసీసీ ప్రధాన కార్యదర్శులు చేగూరు వెంకటేష్, రఘురాములు, జిల్లా నాయకులు బిచ్య నాయక్,ఆమనగల్ మండల పార్టీ అధ్యక్షులు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,టౌన్ అధ్యక్షులు అవ్వారి శివలింగం, కౌన్సిలర్లు అనిత శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీపీ అనిత విజయ్, శ్రీశైలం, ఆవాంఛ నరసింహా రెడ్డి,రేణు రెడ్డి,మహేష్,సీత పెద్దయ్య,రాజేందర్ నాయక్, శివగౌడ్, గోవర్ధన్, సురేష్, జగన్‌గౌడ్, రఘుపతి, చంద్రు నాయక్, రవి నాయక్ పాల్గొన్నారు.

# ఫేస్‌బుక్ క్రెడిట్ కార్డు ప్రకటనతో రూ.1.24 లక్షల సైబర్ మోసం

**చేవెళ్ల, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** ఫేస్‌బుక్‌లో వచ్చిన క్రెడిట్ కార్డు ప్రకటనను నమ్మిన ఓ రైతు సైబర్ మోసగాళ్ల చేతిలో రూ.1,24,340 నష్టపోయిన ఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముడిమ్యాల గ్రామానికి చెందిన శేరి రాజు (51) అక్టోబర్ 2న ఫేస్‌బుక్ బ్రౌజ్ చేస్తుండగా ఐసీఐసీఐ బ్యాంక్ రూపే క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చంటూ వచ్చిన ప్రకటనను గమనించాడు. అందులోని 'అప్లై' ఆప్షన్‌పై క్లిక్ చేయడంతో గుర్తుతెలియని వ్యక్తులు రెండు మొబైల్ నంబర్ల నుంచి ఫోన్ చేసి క్రెడిట్ కార్డు ఇప్పిస్తామని నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు క్రెడిట్ కార్డుకు సంబంధించిన వివరాలను ఫోన్‌లో వెల్లడించాడు. అనంతరం కొద్దిసేపటికే అతని ఐసీఐసీఐ బ్యాంక్ ఖాతా నుంచి రూ.49,670 చొప్పున రెండుసార్లు, మొత్తం రూ.99,340, అలాగే యస్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.25,000 చొప్పున మొత్తం రూ.1,24,340 అక్రమంగా డెబిట్ అయ్యాయి. తాను సైబర్ మోసానికి గురైనట్లు గుర్తించిన రాజు వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రజలకు పోలీసుల సూచనలు సోషల్ మీడియా, ఫేస్‌బుక్, వాట్సాప్ తదితర వేదికల్లో వచ్చే క్రెడిట్ కార్డు, లోన్, రివార్డు వంటి ప్రకటనలను నమ్మి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలను వెల్లడించవద్దని పోలీసులు సూచించారు. బ్యాంకులు, క్రెడిట్ కార్డు సంస్థల పేరుతో ఎవరైనా ఫోన్ చేసినా ఓటిపి, పిన్, సివివి, కార్డు నంబర్, నెట్ బ్యాంకింగ్ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులపై క్లిక్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసం జరిగిన వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని చేవెళ్ల పోలీసులు సూచించారు.

# పంపిణీలో పారదర్శకతకు స్మార్ట్ రేషన్ కార్డులు

### హైదరాబాద్ జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సులభతరంగా, ఆధునికంగా అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా ఆహార భద్రత కార్డు (ఎఫ్.ఎస్.సీ)దారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపి ణీ కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 63 శాతం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తయిం దని చెప్పారు. మొత్తం 8,43,048 కార్డులకు గాను 5,36,650 కార్డులను పంపిణీ చేసినట్లు వివరించా రు. ఇంకా స్మార్ట్ రేషన్ కార్డులు పొందని 3,07,448 మంది ఎఫ్.ఎస్.సీ కార్డుదారులు తమకు సంబం ధించిన సహాయ పౌర సరఫరాల అధికారి కార్యాలయాన్ని సంప్రదించి, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఇతర అవసరమైన పత్రాలను సమర్పించికార్డులు పొందవచ్చని సూచించారు.

**ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలి...**

ప్రభుత్వ ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఆహార భద్రత కార్డుల్లో నమోదైన లబ్ధిదారుల ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ ధృవీకరణ ప్రక్రియ హైదరాబాద్ జిల్లాలో ఇప్పటివరకు 81.78 శాతం పూర్తయింద ని శ్రీనివాస్ తెలిపారు. ఇంకా ఈ-కేవైసీ పూర్తి చేయని లబ్ధిదారులు తమకు కేటాయించిన చౌక ధరల దుకాణం(ఎఫ్.పీ.ఎస్) వద్ద తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, ఈ-కేవైసీ ప్రక్రియలను విజయవంతంగా పూర్తి చేసేందుకు లబ్ధిదారులు అవసరమైన వివరాలు, పత్రాలను సమర్పించి సంబంధిత అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

# ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి

**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.**




**తాండూరు అక్టోబర్ 6(జనంసాక్షి) :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు.మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు జాదవ్ దారాసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటు బచావో - దేశ్ బచావో నిరసన ర్యాలీలో పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డితో కలిసి తాండూరు ఎమ్మెల్యే బీఎంఆర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల సంఘం బీజేపీకి తొత్తుగా మారింది. ఓట్ల చోరీకి సహకరిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తీరు ప్రజాస్వామ్యానికే ప్రమాదం. బీహార్ లో ఎస్ఐఆర్ పేరుతో లక్షలాది ఓట్లను తొలగించి బీజేపీకి మేలు చేశారు. అందుకే జ్ఞానేష్ కుమార్ ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.రాహుల్ గాంధీ ఓటు చోరీపై పోరాటం చేస్తున్నారు. ప్రతి ఒక్కరి ఓటును కాపాడుకోవడం కోసమే ఈ ఓటు బచావో - దేశ్ బచావో ర్యాలీ. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలంతా అప్రమత్తంగా ఉండి ఓట్ల గల్లంతును అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ నిరసన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లపై కఠిన నిఘా

- నిబంధనలు ఉల్లంఘిస్తే తక్షణ చర్యలు
- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్
- రాత్రివేళల్లోనూ ఆకస్మిక తనిఖీలకు ఆదేశం
- తప్పుడు ప్రకటనలు, అక్రమ మందుల విక్రయాలపై కొరడా
- రిజిస్ట్రేషన్, రెన్యూవల్, తనిఖీలపై సమీక్ష



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లు నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఉల్లంఘనలు గుర్తిస్తే చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆదేశించారు. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ల రిజిస్ట్రేషన్, రెన్యూవల్, తనిఖీలు, చట్టాల అమలుపై సమీక్షించారు. ఫైర్ సేఫ్టీ, ఎన్ఓసీలు, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. తనిఖీల్లో సేకరించిన ఆధారాలు, పరిశీలించిన అంశాలు, అధికారుల వివరాలతో సమగ్ర నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రకటించే సంస్థల్లో వాస్తవ పరిస్థితులను నిర్ధారించేందుకు అవసరమైతే రాత్రివేళల్లోనూ ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. ఓటీసీ మందుల విక్రయం, ప్రిస్క్రిప్షన్ నిబంధనలు, ఔషధ నియంత్రణ చట్టాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రతి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో రిజిస్ట్రేషన్, అందిస్తున్న వైద్య సేవలు, తప్పనిసరి సమాచారాన్ని ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే తప్పుడు ప్రకటనలు, హామీలు, ప్రచారాలను అనుమతించబోమని స్పష్టం చేశారు.
పోలీసులు సహా వివిధ శాఖల నుంచి వచ్చిన ఫిర్యాదులపైనా సమీక్షించారు. నిబంధనల ఉల్లంఘనలపై వెంటనే చర్యలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో 112 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ చర్యలపై కూడా చర్చించారు. చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయడంతోపాటు చేపట్టిన చర్యలపై ఏటీఆర్‌లను సిద్ధం చేసి తదుపరి సమావేశంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.ఆనంద్, జవహర్‌నగర్ ఏసీపీ ఎస్. చక్రపాణి, ఐఎంఏ ప్రతినిధులు వెంకటేశ్వరరావు, డిప్యూటీ డెమో వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

# కోరుట్లలో రవాణా శాఖ యూనిట్ కార్యాలయంపై ఏసీబీ ఆకస్మిక తనిఖీ



**జగిత్యాల జిల్లా క్రైమ్, అక్టోబర్ 06 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణం లోని రవాణా శాఖ యూనిట్ కార్యాలయంలో కరీంనగర్ రేంజ్ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం రోజున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయంలోని రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, చలాన్లు, పెండింగ్ దరఖాస్తులు, కార్యాలయ పనితీరును అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.తనిఖీల్లో పలు లోపాలను ఏసీబీ అధికారులు గుర్తించినట్లు తెలిపారు. ముఖ్యంగా ఎంవీఐ పర్యవేక్షణ లేకుండా డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. సిబ్బంది అధికారిక సేవల సమయంలో ఏజెంట్ల ద్వారా ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు.ఏజెంట్లు రవాణా శాఖ కార్యాలయంలో స్వేచ్ఛగా తిరుగుతూ సిబ్బందితో వ్యవహరిస్తున్నట్లు క్షేత్రస్థా గుర్తించారు.
కార్యాలయ రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ సక్రమంగా లేదని పేర్కొన్నారు.సిబ్బంది విధుల నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేకపోవడాన్ని గుర్తించారు. డ్రైవింగ్ పరీక్ష నిర్వహిస్తున్న ప్రదేశం రవాణా శాఖ ప్రమాణాలకు అనుగుణంగా లేదని తేల్చారు. డ్రైవింగ్ ట్రాక్‌లో అవసరమైన సైన్‌బోర్డులు కూడా లేవని అధికారులు గుర్తించారు. ఈ లోపాలపై సంబంధిత అధికారుల నుంచి వివరణ తీసుకుని, తదుపరి చర్యల కోసం నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ డిఎస్పి మహేందర్ రెడ్డి సిఐలు తిరుపతి ప్రేమ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైలుపట్టాలు దాటుతుండగా.. ఎంఎంటీఎస్ ఢీకొని వ్యాపారి మృతి



**అల్వాల్, అక్టోబర్ 6 (జనంసాక్షి ):** వాకింగ్ అనంతరం ఇంటికి తిరిగి వెళ్తున్న ఓ వ్యాపారి రైలు ఢీకొనడంతో మృతి చెందిన ఘటన అల్వాల్‌లో సోమవారం చోటు చేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ అల్వాల్‌కు చెందిన సుధాకర్ (55) కిరాణా దుకాణం నిర్వహిస్తు న్నాడు. బీహెచ్ఈఎల్ కాలనీ వెనుక వైపు రైల్వే పట్టాలపై వాకింగ్ అనంతరం ఇంటికి వెళ్తున్న క్రమంలో పట్టాలు దాటుతుండగా ఎంఎంటీఎస్ రైలు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సుధాకర్‌ను రైలు ప్రయాణికులు అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# స్వాతంత్ర్య సమరయోధుడి వారసత్వం

## సిరిసిల్ల పద్మశాలి ఆడబిడ్డగా అవకాశం ఇవ్వండి

- సిరిసిల్ల నుంచి ఎమ్మెల్సీగా అవకాశం కోరిన న్యాయవాది జ్యోతి కిరణ్




**సిరిసిల్ల టౌన్, అక్టోబర్ 6 (జనం సాక్షి):** సిరిసిల్ల నుంచి ఎమ్మెల్సీగా తనకు అవకాశం కల్పిస్తే ప్రజాసేవకు అంకితమవుతానని సిరిసిల్లకు చెందిన ప్రముఖ న్యాయవాది జ్యోతి కిరణ్ కోరారు. సిరిసిల్ల బిడ్డగా, పద్మశాలి ఆడబిడ్డగా రాజకీయ అవకాశం కల్పిస్తే నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందిస్తానని తెలిపారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్సీ పదవులకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్లు జ్యోతి కిరణ్ తెలిపారు. 38 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ ప్రజలకు సేవ చేస్తున్నానని చెప్పారు. స్వాతంత్ర్య సమరయోధుడు గుడ్ల లక్ష్మీనరసయ్య కుమార్తెగా తాను గర్వపడుతున్నానన్నారు. తన తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు మరింత విస్తృతంగా సేవ చేయాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. సిరిసిల్లకు చెందిన పద్మశాలి ఆడబిడ్డగా తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జ్యోతి కిరణ్ చెప్పారు. మహిళలకు, వెనుకబడిన వర్గాలకు, న్యాయం కోసం పోరాడుతున్న వారికి అండగా నిలుస్తానన్నారు. పట్టణ కాంగ్రెస్ నాయకులు సీనియర్ నాయకులు చొప్పదండి ప్రకాష్, వైద్య శివప్రసాద్ మాట్లాడుతూ జ్యోతి కిరణ్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉందన్నారు. ఆమె తండ్రి గుడ్ల లక్ష్మీనరసయ్య ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినా జీవితాంతం కాంగ్రెస్ పార్టీకి అంకితమై పనిచేశారని తెలిపారు. సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీకి మొట్టమొదట కార్యాలయం ఏర్పాటు చేసిన వారిలో ఆయన ముఖ్యుడని గుర్తుచేశారు. అటువంటి ఉన్నత రాజకీయ, ప్రజాసేవా వారసత్వం కలిగిన కుటుంబంలో జన్మించిన జ్యోతి కిరణ్ ప్రజాసేవకు ముందుకు రావడం అభినందనీయమని వారు అన్నారు. ఆమెకు 38 సంవత్సరాల న్యాయవాద వృత్తి అనుభవం ఉందని, న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి వద్ద జూనియర్‌గా పనిచేసి న్యాయవాద వృత్తిలో శిక్షణ పొందారని తెలిపారు. న్యాయ రంగంలో సంపాదించిన అనుభవాన్ని ప్రజాసేవకు వినియోగించాలనే లక్ష్యంతో ఆమె ఎమ్మెల్సీ అవకాశం కోరుతున్నారని చెప్పారు. సిరిసిల్ల జిల్లా ప్రజల మద్దతుతో జ్యోతి కిరణ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానాన్ని వారు కోరారు. సిరిసిల్లకు చెందిన స్థానిక మహిళకు, పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన న్యాయవాదికి అవకాశం కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి ప్రాధాన్యం ఇచ్చినట్టవుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆకునూరి బాలరాజు, స్వర్గం ప్రసాద్, భీమవరం శ్రీనివాస్, ఛేపూరి శ్రీనివాస్, కోడం శ్రీనివాస్, దొంత దేవదాస్, మ్యాన ప్రసాద్, కంసాల మల్లేశం, గజన్‌లాల్ పాల్గొన్నారు.




# పోలీస్‌స్టేషన్ ముందే పేద వ్యాపారి సజీవ దహనం

- పోలీసుల వేధింపులే ప్రాణం తీశాయా?
- అందరూ చూస్తుండగానే ఘటన
- కేసు విషయంలో పోలీస్‌స్టేషన్‌కు రావాలని హుకూం





**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 6 (జనంసాక్షి):** నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో చాయ్ హోటల్ నిర్వహిస్తున్న పొలాస సుధాకర్ చికిత్స పొందుతూ మృతిచెందడం తీవ్ర కలకలం రేపింది. రాత్రి వేళ రోడ్డుపై టేబుళ్లు ఏర్పాటు చేయడంపై పోలీసులతో వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. టేబుళ్లు తొలగించాలని పోలీసులు ఆదేశించడంతో పాటు వాటిని స్వాధీనం చేసుకుని సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌కు రావాలని, అనంతరం కోర్టుకు హాజరుకావాలని పోలీసులు సూచించినట్లు సమాచారం. ఈ పరిణామాలతో తీవ్ర మనస్తాపానికి గురైన సుధాకర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.

### స్టేషన్ గడప దాటకముందే మృత్యువు

పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే సుధాకర్ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకోవడం ఇప్పుడు అనేక ప్రశ్నలకు తావిస్తోంది. పోలీసుల సమక్షంలోనే ఈ ఘటన జరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఒక చిన్న వ్యాపారి అంతటి తీవ్ర నిర్ణయం తీసుకునే పరిస్థితి ఎందుకు వచ్చింది? అతడిపై నమోదైన కేసు, పోలీసుల వ్యవహారశైలి, స్టేషన్‌కు రావాలని ఇచ్చిన ఆదేశాల మధ్య ఏం జరిగింది? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

### పేదవాడి ప్రాణం ఇంత చవకా?

రోడ్డుపై టేబుళ్లు పెట్టిన వివాదం చివరకు ఒక మనిషి ప్రాణాలను బలితీసుకునే స్థాయికి వెళ్లిందా? నిబంధనలు అమలు చేయడం పోలీసుల బాధ్యతే అయినా.. ఆ నిబంధనల అమలులో మానవీయతకు చోటుందా? పేదలు, చిరు వ్యాపారుల విషయంలో అధికార వ్యవస్థ వ్యవహరించే తీరు ఎలా ఉండాలి? సుధాకర్ మృతి ఈ ప్రశ్నలను సమాజం ముందుంచింది.

### 'మాకు సంబంధం లేదు' అంటే ప్రశ్నలు ఆగిపోతాయా?

సుధాకర్ మృతికి పోలీసుల చర్యలకు ఎలాంటి సంబంధం లేదని నిజామాబాద్ సీపీ సాయి చైతన్య స్పష్టం చేశారు. నిబంధనల అమలులో భాగంగానే చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఘటనకు ఇతర కారణాలేమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ కొనసాగుతోందని చెప్పారు. అయితే పోలీసుల వివరణతోనే ఈ వ్యవహారం ముగిసిపోతుందా? పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఒక వ్యక్తి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకునేంతటి పరిస్థితి ఎందుకు ఏర్పడిందన్న దానిపై సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం లేదా? పోలీసుల చర్యలకు, సుధాకర్ తీసుకున్న తీవ్ర నిర్ణయానికి మధ్య ఏమైనా సంబంధం ఉందా లేదా అన్నది నిష్పక్షపాత విచారణలో తేలాల్సి ఉంది.

### పోలీసులపై ఆరోపణలు.. భగ్గుమన్న భీమ్‌గల్

సుధాకర్ మృతి విషయం తెలియడంతో నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది. కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి వేణుగోపాల్ తదితరులను పోలీసులు అడ్డుకోవడంతో నిరసన వ్యక్తమైంది. సుధాకర్ మృతికి పోలీసుల వేధింపులే కారణమని కుటుంబ సభ్యులు, ప్రతిపక్ష నాయకులు ఆరోపించారు.

### రూ.25 లక్షల పరిహారం డిమాండ్

మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పోలీసుల తీరును తప్పుపట్టారు. సుధాకర్ కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. సుధాకర్ మృతదేహానికి నివాళులర్పించేందుకు బయలుదేరిన ప్రశాంత్‌రెడ్డిని పోలీసులు ఆయన ఇంటి వద్దే అదుపులోకి తీసుకున్నారు.

### భీమ్‌గల్‌లో బంద్..

సుధాకర్ మృతిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ భీమ్‌గల్‌లో వ్యాపారులు, దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత. కానీ ఆ చర్యలు ఒక పేద వ్యాపారి ప్రాణాల మీదికి వచ్చేంతటి పరిస్థితిని ఎందుకు సృష్టించాయి? మరోవైపు పోలీసులపై వచ్చిన ఆరోపణలు నిజమా కాదా అన్నది కూడా నిర్ధారించాల్సిన బాధ్యత అదే వ్యవస్థపై ఉంది. సుధాకర్ మృతిపై ఆరోపణలు నిజమైతే బాధ్యులెవరు? పోలీసుల తప్పేమీ లేకపోతే.. సుధాకర్‌ను ఆ తీవ్ర నిర్ణయానికి నెట్టిన కారణమేంటి? పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే జరిగిన ఈ ఘటనకు పూర్తి నిజం ఎప్పుడు బయటపడుతుంది? సుధాకర్ బూడిద ప్రశ్నిస్తోంది.. పౌర సమాజం సమాధానం కోరుతోంది! నిజం వెలుగులోకి రావాలి.. బాధ్యులు తేలాలి.. సుధాకర్ కుటుంబానికి న్యాయం జరగాలి.







# ఇందిరమ్మ ఇళ్లతో పేదలు ధనవంతులవుతారు

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**కుత్బుల్లాపూర్ (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటి, పరిశ్రమలు, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. మంగళవారం నాడు రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి గాజుల రామారంలో 480 ఇళ్ల ఇందిరమ్మ టవర్స్ శంకుస్థాపన అనంతరం ఆయన ప్రసంగించారు. ఔటర్ రింగ్ రోడ్డులోపల కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నా తమ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ఎంత వ్యయమైనా భరించాలని నిర్ణయించారని అన్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం తర్వాత వాటి ధరలు రూ.50 లక్షల పైనే పలుకుతాయని, ఇది పేద, మధ్య తరగతి ప్రజలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తుందని శ్రీధర్ బాబు తెలిపారు. కొత్తగా నిర్మించే టవర్స్ సముదాయంలో ఆలయాలు, మసీదులు, చర్చి లాంటి ప్రార్థనా మందిరాలను నిర్మించుకునేందుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించే పరిశీలించాల్సింది కలెక్టర్ ను ఆదేశించినట్టు ఆయన తెలిపారు. సొంత ఇల్లు కలిగి ఉండటం అనేది జీవితంలో అతి ముఖ్యమైన విషయమని ఆయన చెప్పారు. క్యూర్ పరిధిలోని కాలుష్య పరిశ్రలను వెలుపలికి తరలించి స్వచ్ఛమైన గాలి ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ప్రకటించిన ఆరు హామీలను ఒకటొకటిగా అమలు చేస్తున్నామని, అందులో ఇందిరమ్మ ఇళ్లు అత్యంత ప్రాధాన్యత కలిగిన పథకమని వెల్లడించారు.

# 8 వేల మెగావాట్ల అదనపు భారమైనా విద్యుత్ కోతలు లేవు

- జలవిద్యుత్ ఉత్పత్తి 4 వేల మెగావాట్లు తగ్గినా నిరంతర సరఫరా
- రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పెరిగింది
- గృహ వినియోగదారులకు 24 గంటలూ విద్యుత్ అందిస్తున్నాం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**చింతలపాలెం (జనంసాక్షి) :** రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగడంతో పాటు జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పటికీ ప్రజలకు ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా సరఫరా చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గతంలో ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ పీక్ డిమాండ్ 15 వేల మెగావాట్లు ఉండగా.. ప్రస్తుతం దాదాపు 20 వేల మెగావాట్లకు చేరిందన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడిన వర్షాభావ పరిస్థితులతో నదులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గడంతో జలవిద్యుత్ ఉత్పత్తి సుమారు 4 వేల మెగావాట్లు తగ్గిందని చెప్పారు. దీంతో మొత్తంగా 8 వేల మెగావాట్ల అదనపు భారం ఏర్పడినప్పటికీ ట్రాన్స్‌కో,ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థలు సమర్థంగా పనిచేస్తూ నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నాయని వెల్లడించారు.పులి చింతల జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి భట్టి విక్రమార్క పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం,ఇప్పటివరకు జరిగిన ఉత్పత్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూనిట్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి న అనంతరం అధికారులు ఏర్పాటు చేసిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు.అనంతరం మీడియాతో భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జలవిద్యుత్ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.ప్రాజెక్టుల యంత్రాలు, యూనిట్లు పూర్తి సామర్థ్యంతో పనిచేసే స్థితిలోనే ఉన్నాయని చెప్పారు. అవసరమైన స్థాయిలో నీటి లభ్యత లేకపోవడం వల్లే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గిందన్నారు. వర్షాభావ పరిస్థితులు, ఎండల తీవ్రత పెరగడం ఇందుకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు.

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినప్పటికీ గృహ వినియోగదారుల కు 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను థర్మల్ పవర్ ద్వారా అధిగమిస్తున్నామని తెలిపారు. ప్రజలు విద్యుత్ సరఫరాపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మనకంటే పెద్దదైన కర్ణాటకలో పీక్ విద్యుత్ డిమాండ్ సుమారు 20 వేల మెగావాట్లు ఉండగా.. తెలంగాణలోనూ ప్రస్తుతం అదే స్థాయికి చేరిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పీక్ డిమాండ్ సుమారు 12 వేల మెగావాట్లుగా ఉందన్నారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగినప్పటికీ ప్రజలకు నిరంతర సరఫరా అందిస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోతే నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు, శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని తెలిపారు. తదుపరి వర్షాకాలం వరకు అందుబాటులో ఉన్న నీటిని మనుషులు, పశువులు, పక్షుల తాగునీటి అవసరాలకు జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. తాగునీటిని భవిష్యత్ కోసం నిల్వ చేసుకోవడం సాధ్యం కాదని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. విద్యుత్ రంగంలో నిరంతరం శ్రమిస్తున్న జెన్‌కో సిబ్బందికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు.

### 27 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయాన్నే టిఫిన్ అందించే పథకానికి సంబంధించిన సెంట్రలైజ్డ్ కిచెన్ నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని 105 నియోజకవర్గాల్లో ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున కేటాయించి అత్యాధునిక సదుపాయాలతో పాఠశాలలను నిర్మిస్తున్నామని చెప్పారు. ఒకే ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాలకు చెందిన సుమారు 2,600 మంది విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యనభ్యసించేలా వీటిని అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దుతున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందన్ లాల్,వివిధ శాఖల అధికారులు వివిధ హోదాలలో ఉన్న ప్రజా ప్రతినిధులు,వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370